

21-5-71
40


డియల్ పిక్చర్స్
దెబ్బకుథా దొంగలముఠా
దర్శకుడు
సంగీతం బి శంకర్

ఉత్తరాలు

ఎన్. జి. వో.ల సమ్మె

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ వర్గాలన్నీ పక్షం రోజుల నుంచి సాగిస్తున్న సమ్మె ప్రభుత్వమును నడిపే మంత్రులు ఉదాసీనతగా చూచుట చాలా శోచనీయము. మా గ్రామంలో ప్రతిరోజు ఉద్యోగులు వీధుల వెంట మండుటెండలో నినాదాలతో తిరుగుచుండుట చూచిన ఏవ్యక్తి యైనను దయదలచకుండా వుండలేదు.

భారత దేశ సౌభాగ్యమును గోరి మహాత్ములెందరో త్యాగాలు చేసి సంపాదించిన మన రాజ్యంలో మన తోటి సోదరులు స్వయంవృత్తులు అవలంబించలేక ప్రభుత్వ ఉద్యోగము చేస్తుంటే వారి గోడు వినబడనట్లు ప్రవర్తించే ప్రభుత్వాన్ని ఏమనాలో తెలియరావడంలేదు—

పొరుగు రాష్ట్రాలలో ఆహార ధాన్యాలపై అమ్మకం పన్నులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు పెంచి యిస్తుంటే—ఆహార ధాన్యాలపై—మొత్తం భారతదేశంలోనూ ఏరాష్ట్రం విధించని విధంగా ఎక్కువ రేటు పెంచి ఆహారధాన్యాలకు విపరీతమైన ధరలు పెంచిన ఆంధ్రప్రభుత్వం మద్య నిషేధం రద్దు చేసి, జూదగృహాలకు పర్మిట్లు యిచ్చి, స్వయంగా లాటరీ టిక్కెట్లు అమ్ముకుని సారాయిదుకాణాలు పెట్టి లక్షలు గడించిన డబ్బంతా ఎవరి పాలు జేశారు?—

బీదల ఆహార ధాన్యాలపై కూడా కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా వసూలు చేసే అమ్మకం పన్ను మినహాయించలేక ఉద్యోగుల జీతభత్యాలు పెంచుటకు చేతగాని ప్రభుత్వం వెంటనే రాజీనామా చేసి పొరుగు రాష్ట్రంలో ఏప్రభుత్వంవారికైనా ఒప్పగిస్తే— ఆహార ధాన్యంపై అమ్మకం పన్ను రద్దు—ఉద్యోగుల జీతాల పెంపు జేయుగలరనడంలో సందేహంలేదు.

ప్రజాక్షేమం గ్రహించలేని ప్రభుత్వం, ఎన్నో రోజులు నిల్వలేదు. ఇప్పటికైనా గ్రహించి మెలగవలెనని విజ్ఞప్తి చేస్తున్నాను—

—కె. చిన్న వేంకట సుబ్బయ్య, అవనిగడ్డ.

* * *

ఇటీవల తెలంగాణాలో జరిగిన ఎన్నికలలో పడిన వోట్ల లెక్కల మీద ఎన్నో వ్యాఖ్యలు జరుగుతున్నాయి. శ్రీ మినూ మసానీగారు కొన్ని లెక్కలని ఆధారం చేసుకుని ప్రధానమంత్రి పార్టీకి సుమారు పదికశాతం ప్రజాదరణ మాత్రమే లభించిందని వాదించినట్లు నాకు గుర్తు. అటువంటి వాదనలే తెలంగాణా విషయములో కూడా జరుగుతున్నాయి! ఇవన్నీ శుష్కవాదాలని నా నమ్మకం. అక్కడ ఇటువంటి ఎన్నికకాక, 'ప్రజాభిప్రాయ సేకరణ' జరపాలి అప్పుడు గాని నిజం ఇదని గట్టిగా చెప్పలేము. 'నిజం మాట'లాగ ఉన్నా ప్రభుత్వం పరిపాలన విషయంలో మాత్రం 'ఆంధ్రప్రదేశ్' అనబడే రాష్ట్రం ఎప్పుడో చీలిపోయింది.—కర్నూలు ఆదాయాలు, వేరు. ప్రమోషన్ల పద్ధతి వేరు. బదిలీలు వగయిరా వేరు. ఇంకా ఎక్కడ ఉంది. విశాలాంధ్ర? పోని 'మహాతెలంగాణా' అనిపేరు పెడితే అంతా మారిపోతుందా?

రా. రా. (మదరాసు)

ఓం నమః శివాయ

30-4-1971 వారపత్రిక ఇవాళ చూశాను హమ్మయ్య! పలికించారు. ఇంతకాలం శివభక్తురాలుగా, అనామధేయిగా తెరవెనక వున్న వ్యక్తి ఇప్పటికి శ్రీమతి సర్వోచ్చగిరిగా రంగంమీదికొచ్చింది. ఇన్నాళ్ళూ అవిడ కోరిక మీద మీరు కాపాడిన చిదంబర రహస్యం చివరకిదన్నమాట. చాలా బాగుంది మీరు చేసిన పని. అభినందనలు.

1. ఈ రచయిత్రి భారతదేశంలో నివారంవరికీ తెలుసునని పెద్ద పబ్లిసిటీ యిచ్చారు మీరింతకాలం. ఈమె తన రచనలద్వారా తెలుసునేమో అని సందే

హించాను. 'రాష్ట్రపతి' భార్యగా అందరికి తెలుసు ననీ మీ అభిప్రాయమని ఇప్పుడు ధ్రువపడింది. మీది అజ్ఞానమో, అమాయికత్వమో మరి, నాకు మాత్రం విచారంగా వుంది. రాష్ట్రపతిగిరి స్వయంగా

ఉత్తరాలు

మనదేశంలో చాలామంది విద్యావంతులకు తెలియనప్పుడు [సర్వీసు కమిషను జనరల్ నాలెడ్జి పరీక్షలు చూడండి] ఆయన భార్య తెలుసుననుకోవడం చాలా పొరపాటు. విద్యావంతులనబడే వారి స్థితి ఇలా వున్నప్పుడు నిరక్షరకుక్షుల సంగతి వేరుగా చెప్పనక్కరలేదు కదా!

2. శ్రీమతి సరస్వతీగిరి శివభక్తురాలయినా, అనామధేయి అయినా మాకేట్టే ఇబ్బంది లేదు. కాని తెలుగు భాషలో గేయాలనీ పద్యాలనీ ఏవో వ్రాతలు మీ పత్రికలో మాకందజేస్తుంటే సహించలేక పోతున్నాము. వాటిని గేయాలనీ, పద్యాలనీ మీరు సంపాదకీయ వ్యాఖ్యలో పేర్కొంటూ వుంటే మీకు తెలుగులో వున్న పరిచయాన్ని సందేహించవలసి వస్తోంది. ఆవిడ గిరిగారిభార్య అని, ప్రచురించకపోతే మీ కొంపమునిగిపోతుందనో, ప్రచురించినంతమాత్రాన మీకేదో ఒరుగుతుందనో అపోహపడి ప్రచురించి వుంటారు. మీలోని ఈ విధమైన దౌర్బల్యం మూలాన ఎంతమంది తెలుగు చదివే వాళ్ళ మనస్సుల్ని కోతపెట్టివుంటారో ఆలోచించండి.

3. ప్రతివారం మీపత్రిక ఎందరు చదువుతారో, వాళ్ళకు మీరుచెయ్యాల్సిన న్యాయంఏమిటో— ఈ విషయాలను గురించి మీ అంతరాత్మను శోధించుకోవడం మంచిది. 'ఈ వో నమః శివాయ' లాంటి రచనలు అర్థంలేని పబ్లిసిటీతో ప్రచురించినట్లయితే ఎంతమంది తెలుగు పాఠకుల్ని ప్రతారణం చేస్తున్నారో యోచించుకోండి.

4. మీరీ వుత్తరంలో రాసిన అభిప్రాయాన్ని సహృదయంతో అర్థంచేసుకొని పాటిస్తే నా ప్రయత్నం సఫలమైందని భావిస్తాను.

5. మీరికనైనా ఆ శీర్షిక ముగిస్తారో లేదో తెలీదు. మీకాపాటి సాహసం వుంటుందో లేదో అనే అనుమానంతో ఇవాళే శ్రీమతి గిరి గారికి కూడా ఒక వుత్తరం రాస్తున్నాను. ఆవిడరచనలోని లోపాలు ఆవిడకే ఎత్తి చూపుతాను. అప్పుడైనా మానుకుంటే మంచిది. లేకపోతే వాటిని ప్రచురించటానికి తెలుగు వాళ్ళ దురదృష్టం కొద్దీ మీరు దొరికారని అనుకుంటాం.

—వి. సూర్యనారాయణ [మహబూబ్‌నగర్]

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 21-5-'71
శ్రీ విరోధికృన్నామ సం॥ వైశాఖమాసం బ॥ ద్వాదశి
సంపుటము: 64 సంచిక: 37

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

విడి ప్రతి వెల 40 పైసలు

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం: శశి వాణిశ్రీ
(ఫోటో: ప్రభాకర్)


ప్రేలుడు పదార్థం
కొత్తమంత్రివర్గంలో చోటు దొరకని పార్టీ సభ్యులు
చల్లబడి మామూలు స్థితికి రా
రష్యావారి సలహా
పాకిస్తాన్
ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి
ప్లానింగ్ మంత్రిత్వశాఖ
తమిళనాడు కొత్త కాంగ్రెస్ వ్యవహారాలు
ఐక్య సంయుక్త సోషలిస్టు పార్టీ!
జార్జి వర్గం
రాజ్ నారాయణ్ వర్గం
OOMMEN

రాష్ట్ర రాజకీయాల్లో మార్పులకి సూచన!

ఇంతవరకు నిజానికి కేంద్రమంత్రి వర్గ విస్తరణ జరిగి, సంఖ్యా రీత్యా పెరిగినా అందులో ఆంధ్ర నుంచి, ముఖ్యంగా కేబినెట్ హోదాస్థాయిలో, ప్రాతినిధ్యం లేకపోవడం, రాష్ట్ర రాజకీయాల్లో మార్పులకు సూచీగా ఇక్కడి రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ మార్పులు ఎప్పుడు వీలావస్తాయో ఏమిటో ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు. మార్పులు సంభవించడానికి సూచనలు లేకపోలేదు. ఉదాహరణకు తెలంగాణా ప్రజాసమితి ముఖ్యమైన కార్యకర్తలలో అధికార కాంగ్రెసులో చేరిపోవాలన్న కోరిక, ఆసక్తి హెచ్చుగా కనిపిస్తున్నది. ప్రధానమంత్రి కనుక ప్రజాసమితి నాయకులను పిలిచి మీరు ఆందోళన తలంపును వదులుకోవాలి అంటే ఎందరు కాదన సమర్థులో చెప్పడం కష్టం. వారిలో ఈ మార్పుకు కారణం లేక పోలేదు. మళ్లీ తీవ్రమైన ఉద్యమాన్ని నిర్మించగలమన్న నమ్మకం వారిలో అంతగా లేదు. ఈ ఉద్యమాన్ని లేవదీసి, రాజకీయ నాయకులను కదిలించి, వారి మనుగడ కోసం రంగప్రవేశం చేయించిన యువకుల్లో కూడా మునుపటివంటి పట్టుదల కనిపించడం లేదు.

పోతే తెలంగాణా సమస్య అంటూ లేదని ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు చేసిన ప్రకటనతో ఢిల్లీ సన్నిహితంగా లేదనడానికి అధికార కాంగ్రెసు అధ్యక్షుడు దామోదరం సంజీవయ్యగారు రాజధానిలో కాలు పెట్టిన వెంటనే చేసిన ప్రకటనే ఆధారం.

సంజీవయ్యగారు ఇదివరకు కూడా కాంగ్రెసు అధ్యక్ష పదవి నలంకరించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు అధ్యక్షునికి, రాష్ట్ర కాంగ్రెసు నాయకత్వానికి మధ్య చుక్కెదురు. ప్రైవేటు సంభాషణల్లో ఒకరినొకరు ఖండన చేసుకొనడమేకాక బహిరంగ విమర్శలు కూడా ఆ రోజుల్లో పరిపాటిగానే ఉండేవి.

ఆరోగ్యకరమైన మార్పు

ఈసారి సంజీవయ్యగారు కాంగ్రెసు అధ్యక్షులుగా స్వరాష్ట్ర రాజధానికి వచ్చినప్పుడు ఆయన హోదాకు తగిన మర్యాదలు జరిగాయి. ముఖ్యమంత్రితోసహా రాష్ట్రమంత్రులు ప్రదేశ్ కాంగ్రెసు అధినేతలు అందరూ విమానాశ్రయంలో సంజీవయ్య గారికి స్వాగతమిచ్చారు. వెళ్లేటప్పుడు వీడ్కోలు ఇచ్చారు. నగరంలో ఉన్నప్పుడు విందులూ ఇచ్చారు. ఇది ఆరోగ్యకరమైన మార్పు. ప్రధాని ఏరికోరి కాంగ్రెసు అధ్యక్ష స్థానంలో ప్రతిష్ఠించిన వ్యక్తిని తగిన విధంగా ఖాతరు చేయడం అవసరమని అందరూ గుర్తించారన్న మాట. అతే ఇంతటితో రాష్ట్ర అధికార కాంగ్రెసు వ్యవహారాల్లో సంజీవయ్యగారి వ్యక్తిగతమైన పలుకుబడి, ప్రభావం పాదుకొనిపోయాయని చెప్పడానికి వీల్లేదు. చిత్రమేమిటంటే సంజీవయ్యగారికి సన్నిహితులైన పలువురు స్థానికకాంగ్రెసు నాయకులు కార్యకర్తలు ప్రస్తుతం అధికార కాంగ్రెసు వ్యవస్థ వెలుపలనున్నారు. లోపలనున్న కొద్ది మందికి పలుకుబడి బహుస్వల్పం.

ఏమైనా తెలంగాణా సమస్యపట్ల, ఆంధ్రప్రదేశ్ భవితవ్యం పట్ల కేంద్రం ఆలోచన రాష్ట్ర నాయకత్వం వైఖరికంటే భిన్నమైనదనడానికి సంజీవయ్యగారు తెలంగాణా సమస్య గూర్చి చేసిన ప్రకటన తార్కాణంగా భావిస్తున్నారు. కేంద్రం ఏం చేస్తుందో మాత్రం చెప్పడం రాజకీయజోస్యులకు దుస్తరంగా ఉంది. శ్రీమతి ఇందిరాగాంధీగారు ఎప్పుడు ఏం చేస్తారో ఎవరు చెప్పగలరు? తెలంగాణా వాదుల్లో మాత్రం, ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి కేంద్రం అంగీకరించకపోయినా తెలంగాణా అభివృద్ధి నిధుల గూర్చిన్నీ, ఆర్థిక అభివృద్ధి గూర్చిన్నీ, ఉద్యోగుల సాధకబాధకాల గూర్చిన్నీ తెలంగాణా ప్రాంతీయ సంఘం నిర్ణయాలను, సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వంచేత కేంద్రం కట్టుదిట్టంగా అమలు చేయగలిగితే చాలునన్న భావం వ్యాప్తి చెందుతున్నది.

సమ్మెచేస్తున్న ఉద్యోగుల సమస్య రాజకీయ తగాదా రూపం దాల్చుతున్నది. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వంపై దెబ్బ తీయడానికి అదనుగా భావిస్తున్నారు. వారి అండనున్న కార్మికసంఘాలు సానుభూతి సమ్మెలు చేయాలని, నగరంలోను వీలయితే రాష్ట్రమంతటా హర్తాల్, జనరల్ స్ట్రైకులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉపాధ్యాయులు కూడా సమ్మెదార్లతోపాటు ధారణ చేయాలని నిశ్చయించుకున్నారు.

ఇరుపక్షాల వైఖరి

సమ్మె ప్రారంభమైనప్పుడు సంతోషించినవారిలో అధికార కాంగ్రెసు ప్రముఖులు కూడా ఉన్నారు. చాలా కాలం తరువాత ఆంధ్ర తెలంగాణా ప్రభుత్వోద్యోగులు కలిసి కొనసాగిస్తున్న ఆందోళన ఇది. ఈ సమ్మెద్వారా వారిలో సమైక్యత సౌభ్రాతృత్వం, మళ్లీ నెలకొంటాయని వారు ఆశించారు. అందుకే సమ్మెపట్ల తెలంగాణా ప్రజాసమితి సానుభూతి ప్రకటిస్తే, ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజాసమితి ఇందులో జోక్యం కలిగించుకోకుండా ఉండమని ఎం. రామగోపాలరెడ్డి ఎం. పి. లాంటి అధికార కాంగ్రెసు వాదులు ప్రకటనలు చేశారు. కాని నానాటికీ ప్రభుత్వం, సమ్మె చేస్తున్న ఉద్యో



భారత ప్రభుత్వం వాషింగ్టన్ జాతీయ జంతుప్రదర్శనశాలకి బహూకరించిన ఆడ సింహపిల్లని ఉంచిన బోను తాళంచెవిని మ్యాడిల్లోని అమెరికా రాయబారి శ్రీ కెన్నెత్ బి కీటింగ్‌కి అందజేస్తున్న ఆహార, వ్యవసాయశాఖ కార్యదర్శి శ్రీ టి. పి. సింగ్. (—యు. ఎస్. ఐ. ఎస్.)

[illegible]
లేకపోయారు. నాలుగువారాలుగా సమ్మె జరుగుతున్నా, సమ్మె విరమణ గూర్చి లేక మరొక పరిష్కారం గురించి మాట్లాడు కొనడం కూడా లొంగుబాటుగా ఇరు పక్షాలు భావించడం శోచనీయం. రాష్ట్ర శాసనసభకు మధ్యంతర ఎన్నికలు వాయిదా పడడం ప్రభుత్వోద్యోగుల దురదృష్టం. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాలేజీ లెక్చరర్ల విషయమై ప్రభుత్వం అవలంబించిన అనుకూల వైఖరిని బట్టి చూస్తే, ఈసారి కూడా ఎన్నికలేవైనా ఉంటే, పన్నెండు లక్షలు కూడా లేవన్న ప్రభుత్వం పన్నెండు కోట్లు కాకపోయినా పది కోట్ల వరకైనా ఉద్యోగులకు అదనపు వేతనంగా ఇచ్చి రాజీ చేసుకొనడానికి సిద్ధపడేది. ఒకవేళ ఖర్చులకు తగినంత ఆదాయం లేదని వాపోయే ప్రభుత్వం, కార్యాలయాలను నెలకుపైగా మూసుకుని కూర్చొనడంలో విజ్ఞత ఏముందో అర్థంకాదు.

రాజకీయ పునరావాసం

రాజకీయ వేత్తలు రాజకీయ ప్రయోజనాలకోసం ఒకొకప్పుడు దూరదృష్టిని కోల్పోయి కొందరు వ్యక్తులను కొన్ని సంస్థలను ప్రోత్సహిస్తూ ఉంటారు. రాష్ట్ర సమైక్యత పేర, పూర్వపు హైదరా[illegible] మతానికి వ్యతిరేకంగాను, వారి భాషా సంస్కృతులకు వ్యతిరేకంగాను, స్వతంత్ర హైదరాబాదు పేర మత ప్రాముఖ్యమైన ప్రధాన రాజ్యాన్ని స్థాపించాలని ఆందోళన చేసిన మజ్లిసె ఇత్తెహాదుల్ ముసల్మీన్‌కు మన నాయకులు మళ్ళీ రాజకీయ పునరావాసాన్ని కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం, నాయకత్వం వైఖరిలో ఈ మార్పు ప్రయోజనాన్ని పూర్తిగా పొంది మజ్లిస్ మళ్ళీ ముస్లిం ప్రజలలో ప్రతిష్ఠను పలుకుబడిని సంపాదించుకుంటున్నది.

ఆంధ్ర ప్రాంతంలో వారికి, తెలంగాణాలో మజ్లిస్ చేసిన దురాగతాలు సరిగా తెలియవుకాని, ఇక్కడి ప్రజలకు అప్పటి అనుభవాలు ఇంకా జ్ఞాపకమే. వీటి గూర్చి జ్ఞాపకం చేస్తే వీరు ఆర్య సమాజీయులు అని ఆంధ్రజాతీయవాదులు విమర్శిస్తారు. కాని మజ్లిస్ కార్యస్థానమైన దారుల్ సలామ్‌లో ఇరవై ఐదు సంవత్సరాల క్రితం ఎలాంటి ప్రసంగాలు, ప్రదర్శనలు జరిగాయో మళ్ళీ అలాంటివే ప్రారంభమయాయి. కోర్టు తీర్పు ఫలితంగా దారుల్‌సలామ్ మళ్ళీ మజ్లిస్ స్వాధీనమైంది. మజ్లిస్ మహాసభలో ఆమోదమైన తీర్మానాలను చూస్తే గాలి ఎటు వీస్తున్నదో అవగాహన మవు[illegible]

[illegible]
మత దేశంలో కూడా స్వాతంత్ర్యాన్ని కోరే శక్తులు— తెలంగాణా, తమిళనాడులాంటివి బలపడ్తాయట.

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దురాగతాల గూర్చి ఒక్కమాట కూడా తీర్మానంలోలేదు. ముస్లిముల ఇబ్బందులను తొలగించేటందుకు ప్రత్యేక ముస్లిం వ్యవహారాల మంత్రాంగం కేంద్రంలో ఏర్పడాలట. అఖిలభారత ముస్లిం మహాసభను మజ్లిస్ హైదరాబాదులో ఏర్పాటు చేస్తుందట.

ముస్లిములకు కొన్ని ప్రత్యేకమైన ఇబ్బందులున్న మాట నిజమే. వారిభాష, మతం, సాంఘిక సంప్రదాయాల పరిరక్షణ జరగవలసిందే. కాని మత దేశంలో ఈ ఆశయాలతో ప్రారంభమైన ముస్లిం రాజకీయాలు ఏ ఫలితాలకు దారి తీస్తాయో ఆధునిక భారతదేశ చరిత్ర అధ్యయనం చేసిన వారందరికీ తెలిసినదే. అందుకు జాతీయవాద రాజకీయపార్టీలు దోహదం చేయడం ఆశ్చర్యకరం. మజ్లిస్ మళ్ళీ తలెత్తడం రాష్ట్రంలో ముఖ్యంగా రాజధానిలో మతసామరస్యానికి దోహదం చేయదు.

—వి. నాగేశ్వరరావు

ఒక వారం విపరీతం

ఫాలాక్షుడు

కర్రలు, కత్తులతో దాడి

'చాప్రా' రాజేంద్ర కళాశాల ప్రిన్సిపాలు భోలా ప్రసాదసింగ్‌ను ఆయన ఆఫీసు గదిలోనే కొంత మంది చంపేశారట. కత్తులతోనూ, కటారుల తోనూ ఆయన గదిలోకి ప్రవేశించిన మూక ఆయన్ను కొట్టి చంపేశారట. ఆ గుంపులో విద్యార్థులు కూడా ఉన్నారట.

స్టవ్ ప్రమాదం

బెంగళూరు తుప్పనూళ్ళికి చెందిన 21 ఏళ్ళ శారోజ అనే ఆమె వంట చేస్తుండగా స్టౌ మంట



ఆమె చీరకు అంటుకుని ఒళ్ళంతా కాలిపోయిందట. బౌరింగ్ ఆసుపత్రిలో చేర్చాక, చికిత్సకు ఫలితం లేక చనిపోయిందటామె.

చిలికిచిలికి గాలివాన

ఢిల్లీ కరోల్‌బాగ్ టాంక్ రోడ్డుకు చెందిన తారాచంద్ అనే ఆయనకు ఆయన భార్య ప్రేమికి 21 న తేదీన చిన్న విషయంమీద వాగ్వివాదం వచ్చిందట. దాంతో తారాచంద్‌కి కోపంవచ్చి తన భార్య ముక్కుమీద, తలమీద శక్తివంచన లేకుండా బాది వదిలాడట. ఆ దెబ్బల దామె ఆసుపత్రిలో చేర్చాక చనిపోయిందట.

పోర్చుకి హద్దు

కొరిగునూరు పాలాని పాలాయం మెయిన్ రోడ్డు మీద 30 వ తేదీ గనేశ్ అని వో 30 ఏళ్ళ వ్యక్తి పెద్ద చురా కత్తి తీసుకుని పిచ్చెత్తిన వాడిలా దారిపోయే వాళ్ళమీద విరుచుకుపడ్డాడట. కొంత మందికి గాయాలు కూడా అయ్యాయట. పారిపోవ ఫోబున ఇద్దరు పోలీసులతో [illegible]


యట. ఇహ లాభం లేదనుకుని, వో 200 మంది కర్రలతోనూ, బుటికలతోనూ అతన్ని చుట్టు ముట్టి చావ బాదారట. విపరీతమైన గాయాలతో విక్టోరియా ఆసుపత్రిలో చేర్చాక, అక్కడ చని పోయాడట ఆ గనేశ్.

గాజుల బహుమతి

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరం విషయంలో కిం అనకుండా నిశ్శబ్దంగా గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నందుకు యునైటెడ్ నేషన్స్ సెక్రటరీ జనరల్ ఉథాంట్‌కు సంయుక్త సోషలిస్టుపార్టీ మహిళలు వో ప్యాకట్టు గాజులు కానుకగా పంపా రట. ఈజిట్.

దర్శకుని సూచనలని పెడచెవిన పెట్టిన పులి

ఒక తమిళ సినిమా షూటింగ్ సందర్భంలో వసుగూర్ అడవుల్లో నటుడు ఆనందన్ ఒక పులితో కలిసి నటించాల్సి వచ్చిందట. షాటంతా సిద్ధం అయ్యాక, రెడీ అనగానే పులి బయలుదేరి, డైరెక్టరు సూచనను పెడచెవినపెట్టి, నేరుగా ఆనందన్ మీదకు లంఘించిందట. ఈ అనుకోని సంఘటనకు ఆనందన్ హడలి, మూర్ఛపోయాడట. పులి ఆయన రొమ్ముమీద నాయుపరచిందట.



పెరియ కొమ్మేశ్వరం పంచాయతీ ఎన్నికలలో రామస్వామి గవుండర్ అనే ఆయన గోవిందస్వామి నాయుడు అనే ఆయన కెదురు నిలబడ్డాడట ఎన్నికలలో రామస్వామిగవుండరే గెలిచారట. అనాటి నుంచీ వా రిద్దరి మధ్యకూ రాజానికి, వచ్చాసక్తికి కూడా భయంగానే ఉండేదట. గోవిందస్వామి నాయుడు ఉమవాలాన్ ప్రాంతానికి వెళ్ళేసరికి రామస్వామి గవుండర్, ఆయన మనుష్యులో అరు గురు ఎదురొచ్చారట. గోవిందస్వామినాయుడున్ని వో ముగ్గురు గట్టిగా పట్టుకున్నారట. రామస్వామి గవుండర్ ఆయన్ను కొడవలితో తుండ్లు తుండ్లుగా నరికాడట. మరో యిద్దరు ఆయన్ని తలో




తూట్లుగా కత్తులతో పొడిచారట. దాంతో గోవింద స్వామినాయుడు రక్తపు మడుగులో విలవిలా తన్ను కుని చనిపోయాడట. సుబ్రహ్మణ్యం అనే ఆయన, గోవిందస్వామినాయుడు చెయ్యి నరికి గోవిందా..... గోవిందా అని అరుచుకుంటూ అంబారు వెళ్ళి పోలీసులకు లొంగిపోయాడట. ఆ చెయ్యి, కొడవలితో సహా.

నగలకోసం 8 ఏళ్ళ బాలికని చంపిన 70 ఏళ్ళ వృద్ధురాలు

తంజావూరుకు సమీపంలోవున్న ఒక వూరిలో 8 ఏళ్ళ రజియాబీగం అనే పిల్ల చక్కగా ఒంటెడు నగలూ పెట్టుకుని స్కూలుకు వెళ్ళిందట. ఆ నగలకు ఆశపడిన 70 ఏళ్ళ ఫాతిమాబీబీ అనే అవ్వ రజియాబీగాన్ని మాయ మాటలతో తన యింటికి తీసుకువెళ్ళి అక్కడా పసిపిల్ల గొంతు పిసికి చంపి, నగలన్నీ ఒలుచుకుని, పెరట్లో గొయ్యి త్రవ్వి ఆ పిల్లను పూడ్చిపెట్టిందట. ●



ముచ్చటొచ్చే క్రొత్త డబ్బా!



పాండ్స్ ఫేస్ పౌడర్


పట్టుమార్దవము,
ఎంతోసేపు
ఎక్కువసువాసన—
ఇవన్నీ ఈ క్రొత్త ప్యాక్‌లో!

మీ ముఖానికి చక్కని ప్రకాశవంతమైన వర్ఛస్సును కలిగించుకోండి. అతి విశిష్టము మీ అభిలషణీయము అయిన ఈ క్రొత్త రకపు ఫేస్ పౌడర్‌తో. గంటలకొద్దీ సుందరంగా వుంటుంది ఈ విస్తృత శ్రేణిలో మీకు సరిగా వుండే ఛాయను వాడండి

క్రొత్త ప్యాకును తెప్పించండి—అది ఇప్పుడు ఎంత విశిష్టమైనదో మీకే తెలుస్తుంది.

ఏ యితర ఫేస్ పౌడర్‌కంటే చాలామంది అందగత్తెలు పాండ్స్ ఫేస్ పౌడర్‌నే వాడతారు

చీస్‌బ్రో పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమిత బాధ్యతతో యు.యస్.ఏలో స్థాపితమైనది) P-5456



పత్రిక సంపాదకులకు—

ఆర్యా!

నా కలం - బలం చవిచూపించాలనే కుతూహలంతో ఈ జాబు వ్రాస్తున్నా. జన్మతః సౌరభాలు విరజిల్లిన అస్మద్రచనా పాటవం వ్యర్థంకావడం నా కెంతమాత్రం ఇష్టంలేదు. పిన్నవయసులోనే 'అఖిలభారత కథానికల పోటీ'లో పాల్గొని ఒక సంతాప సూచక (కన్సొలేషన్) బహుమతిని పొందాను. ఉగాది కథానికల పోటీలో ద్వితీయ బహుమతి గడించుకున్న కథను పదిలంగా నా స్వదస్తూరీలో వ్రాసి పైనుదహరించిన పోటీకి పంపుకున్నాను కథలోని ఇతివృత్తం బాగుందని అభిప్రాయ బడ్డ న్యాయనిర్ణేతలు కథకుని కింకా కథాగమనంలో అనుభవం చాలవను కున్నట్లుగా, రచయితకు మంచి భవిష్యత్తు కలదను కున్నట్లుగా రూఢిగా తెలియవచ్చినది. ఈ జాబుతోపాటు నేను పంపిన కథను పరిశీలించండి. ఇతివృత్తం కొడవటి గంటిది, రచనాశైలి రాచకొండవారికి అనుకరణ, కథా కథనం చలం అడుగుజాడలో. పాత్ర లెంతమాత్రం (స్వ) కల్పితాలు కావు. సజీవమైన ఈ కథలోని పాత్రలుద్వేగపూరితాలు. వాస్తవిక జీవిత దృశ్యాల్ని యథాతథంగా చిత్రించగల్గే విశ్వకవి టాగూరు రచనా శైలి నాకలవడింది. పాఠకునిలో తీవ్రాలోచనలను రేకెత్తిస్తుంది నాకథ. మొత్తంగా అందరి అభిరుచులను ఆకర్షించే ఆయస్కాంతం నా రచన.

రచయిత

'రమణ'

శ్రీ 'రమణ' గార్కి,

అభినందనములతో మీ రచన త్రిప్పి పంపడమైనది. అమూల్యమైన మీ కథా సమయాన్ని సద్వినియోగ పర్చుటలో అశక్తులమగుటకు చింతిస్తున్నాము. మీ సహకారానికి మే మెంతో కృతజ్ఞులము.

సంపాదకుడు.

సంపాదకులకు—

మహాశయా,

మీ తిరస్కృత తిరుగుటపా నాలో నవచైతన్యాన్ని పురికొల్పింది. ప్రసిద్ధులైన ప్రచురణకర్తలకు రేడియో ప్రసారితకథలు పంపి పల్టీలువేయించి అనేక పారితోషికాలందుకొన్న నా ఆప్తమిత్రుని సలహా ఈ సందర్భంలో స్వీకరించవలసి వచ్చింది. ఈ ఉద్యమ మిట్లా నిరాఘాటముగా కొనసాగించాలని నా మిత్రుని సలహా. కథ నెలాగైనా స్వీకరించి మీ వీలునుబట్టి ప్రచురించండి.

భవదీయుడు

'రమణ'

'రమణ'గార్కి,

అయ్యా, మీ రచనను మరల త్రిప్పి పంపడమైనది. మళ్ళీ ప్రచురణకై పంపవద్దని హెచ్చరిస్తున్నాము.

సంపాదకుడు.



సంపాదక మహాశయా,

మీరు కేవలం నా సహనాన్ని పరీక్షిస్తున్నారనే విషయాన్ని గుర్తించాను. వివిధ తరహా రచనలను పరిశీలించే పని యొత్తిడిలో పనికి రాని వట్టి చెత్తను ఉత్తమంగా ఎన్నుకొనే పొరపాటు జరగవచ్చును. కాని చక్కటి ఇతివృత్తం, చక్కటి సన్నివేశాల బరువుతో కూడిన యిట్టి కథలు అరుదుగా లభిస్తాయి. చేజిక్కిన సదవకాశం జారనీయకండి. అందుచేత కథ నెలాగైనా భరించి ప్రచురించండి.

శ్రేయోభిలాషి

'రమణ'

'రమణ' గార్కి,

స్వామీ, మీ కథ మళ్ళీ త్రిప్పి పంపుతున్నాం. వాస్తవానికి మీరంపిన కథ పచు



రణకు తగ్గ స్థాయిలో లేదు. ప్రచురించే పక్షంలో మా పత్రిక స్థాయి దిగజారుతుంది. దయయుంచి ఇకనైనా మీ ప్రయత్నం విరమించండి.

సంపాదకుడు.

సంపాదక మహాశయులకు—

ఆర్యా, మీ చివరి జాబు నాలో ధైర్యాన్ని రగుల్కొల్పింది. ఒక రకమైన అభిప్రాయం నా రచనలపై మీరేర్పరుచుకున్నందుకు ధన్యుడ్ని. ద్విగుణీకృతమైన ఉత్సాహాతిశయములతో, ఆశాభావంతో దానినే మరల పంపుచున్నాను.

సౌభ్రాత్రముగా

'రమణ'

'రమణ'గారూ,

ప్రచురణకై మీరంపిన కథలో పటిమగాని జీవంగాని పాత్రోచితగాని మచ్చుకైనా

కానరాదు. నిజం చెప్పాలంటే మీ కథ కర్థం పర్థం లేదు. అట్టి కథను మేమెంత మాత్రం స్వీకరించలేము.

సంపాదకుడు

సంపాదకులకు

మీ కట్టకడపటి జాబు చూచిన నా ఆనందావధులకు మేరలేకపోయింది. నాగమ్యం దరిదాపుల్లో ఉందని గ్రహించాను. మీ దృక్పథం నన్నెంతగానో ఆకర్షిస్తోంది. అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న ఈ ఉద్యమ బలమే మరల ఒకసారి నా కథ మీకు పంపేటట్లు ప్రోత్సహించినది.

'రమణ'



'రమణ'గారికి,

అయ్యా, దయచేసి ఈ జాబుతో జత పర్చిన పదిరూపాయల చెక్కును స్వీకరించండి. ఇక మీ కథపైన సమస్త హక్కులు మావి. దీనివల్ల మాకు అమూల్యమైన కొన్ని వనాలు కలిసి వచ్చాయి. మీ కథ ఇప్పుడు మా సొంతం. మరల ఇదే కథను మీరంపిన పక్షములో చట్టబద్ధమైన చర్య మీపై తీసుకొనగలమని ఇదే మా హెచ్చరిక. ఈ విషయంలో న్యాయస్థానానికి వెళ్ళినా చట్టం మా పక్షం ఉందనే విషయం విస్మరించకండి.

సంపాదకుడు. ●

ఆప్తబంధువులు



ధర్మపథం: బులుసు వేంకటరమణయ్య

నీతిచంద్రిక చదివినవారికి అందరికీ అందులో చిన్నయ సూరిగారు చెప్పిన 'లోకములో మాతా పితలు, మిత్రుడు అనే ముగ్గురే ఆప్తులు' అనే మాట బాగా జ్ఞాపకం వుంటుంది. వాస్తవంగా మనమేలు కోరేవారు తలిదండ్రులూ, స్నేహితులూ మాత్రమే! తక్కిన బంధువులు కేవలం మేలు కోరేవారని చెప్పడానికి వీలుండదు. ఏదో మేలుకోరినట్లు చెప్పితే — అందులో కొంత స్వార్థం ఉంటుందని అనుకోవలసే ఉంటుంది.

అయితే — ఈ ముగ్గురేనా ? మరే ఆప్తులూ ఉండరా? అని అడగవచ్చు. కొంచెం ఆలోచించి చూస్తే మరి ముగ్గురు ఆప్తులు దొరుకుతారు. వారు — సోదరుడు, భార్య, పుత్రుడున్నూ.

రామునికి లక్ష్మణునివంటి సోదరుడు ఉన్నట్లు, సోదరులలోనూ ఉత్తములు ఉండవచ్చును. అట్టి సోదరులు కష్టాల్లో ఆదుకోవడమూ సహజమే. అందువల్ల సోదరుణ్ణి కూడా ఆప్తుల్లో చేర్చుకోవలసిందే!

ఇక — మానవుడు గృహస్థాశ్రమాన్ని స్వీకరించక ఏకాకిగా ఉండడం అరుదు. వివాహం చేసుకొనడం, సంతానవంతుడు కావడమూ సహజం. ఆ వ్యక్తి గృహస్థుడైన వ్యక్తికి—తనతోపాటు కష్టసుఖాలను పంచుకునే భార్య ఆప్తురాలయి వుండనే వుంటుంది. తన చావి జీవితానికి ఆధారమైన పుత్రుడున్నూ ఆప్తుడుగానే ఉంటాడు. ఈ విధంగా ఆప్తులు ఆరుగురు లెక్కలోకి వస్తారు.

మానవుడు లౌకిక వ్యవహారాలతో సంబంధం పెట్టుకొని ఉన్నప్పుడూ, గృహస్థుగా ఉంటున్నప్పుడూ ఈ ఆరుగురున్నూ ఆప్తులు అగుదురు. కాని, ఇట్టి సంబంధాలు లేక పారలౌకికదృష్టి కలిగినప్పుడు ఉండే ఆప్తులు వేరు. ఆ సంగతినే ఈ శ్లోకం వివరిస్తున్నది.


'సత్యం మాతా పితా జ్ఞానం
ధర్మో భ్రాతా దయా సఖా,
శాంతిః పత్నీ క్షమా పుత్రః
షడేతే మమ బాంధవాః'

నాకు సత్యమే తల్లి; జ్ఞానమే తండ్రి; ధర్మమే సోదరుడు; దయయే మిత్రుడు; శాంతియే భార్య; క్షమయే పుత్రుడు — లోకంలో ఆప్తులయిన ఆరుగురు బంధువులు తల్లి మొదలైన వారయితే — నాకు సత్యం మున్నగునవియే బంధువులు — అని దీని అభిప్రాయం.

పారమార్థిక దృష్టి ఉన్నవారికి తల్లి తండ్రి మున్నగువారు ప్రధానంగా ఉండే ఆప్తులు కారు. వారికి సత్య— జ్ఞాన— దయా—ధర్మ— క్షమా— శాంతులే ముఖ్యమైనవి.

ఇట్టి ఉత్తమగుణాలను అందరూ అలవరచుకోవాలి. మనం ఆత్మబంధువులు ఆరుగురినీ ఏవిధంగా గౌరవిస్తామో, అటువంటి గౌరవాన్నే సత్యము మున్నగు వాటియందు చూపాలి.

వాటిని గౌరవించడమంటే- ఆ ఉత్తమగుణాలను ఆచరణలో పెట్టడమే అన్నమాట! ●


ఉల్లాసకరమైన తాజారుచిని అనుభవించండి
మీ దాహమును తీర్చుకోండి!
GOLD SPOT
గోల్డ్ స్పాట్ యొక్క ఏది అపురూపమైనది. దీనిని త్రాగుట వలన ఎంత మజా వస్తుంది: దాని మధురమైన తాజా రుచిని ఆనందించండి. పర్వతములలోని సెల ఏరుల చల్లని నీటి తాజాదనము గల ఈ పానీయమును త్రాగి సాటిలేని ఆనందమును పొందండి.
మజా మజాగా ఉండండి... గోల్డ్ స్పాట్ త్రాగండి!
mcm/pb/37

ప్రేమా పేరట్టా

ఇచ్ఛాపురపు రామచంద్రం



'వోడిపోయాము. జీవితంలో చిత్తుగా వోడిపోయాము. మరి తేరుకోలేనంత చిత్తుగా వోడిపోయాము.'—అని సోలో పాడుకోవలసిన పొరోపుల్‌స్టేట్‌లో పడ్డాడు అనంత్.

అనంత్ అంటే ఆషామాషీ కాదు.

ఆంధ్రా యూనివర్సిటీలో ఆనర్స్ స్టూడెంట్ అనంత్.

ఆనర్స్ అతనికి క్వాలిఫికేషను కాదు, నిజానికి ఆనర్స్‌కే అతను క్వాలిఫికేషన్. అలా అని నేనడంకాదు—ఆంధ్రా యూనివర్సిటీ ఆనర్స్ క్లాసే అంటుంది. పైక్లాసుల వాళ్ళుకూడా అంటూనే ఉంటారు.

అనంత్ అందంగా ఉంటాడని టూకీగా అనేస్తే—అది అనంత్‌ని చిన్న బుచ్చడం ఔతుంది.

అందం అనంత్‌లా ఉండవచ్చునంటే—కొంత సబవుగా ఉంటుంది. అతను ఆనర్స్‌లో అడుగుపెట్టాక—అమ్మాయిలకు అనుమానం వచ్చింది—కొంపదీసి అందమనేది మొగవాళ్ల సొత్తేమో అని. అంత అందమైనవాడు అనంత్.

అంత అందమైన అనంత్—వోడిపోవడమేమిటి?

అందులోనూ ఆఫ్టరాల్ అనూరాధ ముందు!

అందమైన వాళ్లెవరూ వోడిపోరు. అందానికదో శక్తి ఉంది. అందుకే ఎలక్షన్లప్పుడు—'అనంత్...మీరు పోటీ చేశారంటే యునానిమస్‌గా ఎలక్టవడం ఖాయం.' అన్నారు చాలామంది స్టూడెంట్లు. అయినా అనంత్ పోటీ చెయ్యలేదు—ఎందరి ఆశలనో ఎందుకు త్రెంచివేయడం అని.

యూనివర్సిటీలో అనంత్ అభిమాన సంఘం ఒకటి వెలిసిందని విద్యార్థి జన శ్రుతం. ఎటొచ్చీ రైవల్ అభిమాన సంఘం లేకపోవడాన యీ విషయం అంత పాప్యులర్ కాలేదు.

అనంత్ అందాన్ని అంగీకరించింది అమ్మాయిలే అయితే అదోకతీరు. అబ్బాయిలు కూడా అతన్నే ఏకగ్రీవంగా మిస్టర్ యూనివర్సిటీ అని మనసారా అంగీకరించారంటే—అతనెంత అందమైనవాడో ఆలోచించుకోవలసిన విషయం.

అతను యూనివర్సిటీలో అడుగు పెట్టాక—అమ్మాయిలూ అబ్బాయిలూ ప్రేమ గదులలోనూ, హృదయ కవాటాలలోనూ సినీ హీరోల ఫోటోలు తీసేసి—అనంత్ ఫోటోని ప్రతిష్ఠించుకున్నారంటే అతిశయోక్తి అబద్ధం కాబోదు.

'మీరు ఆఖరికి గర్ల్స్ రిప్రజెంటేటివ్‌గా నిలబడ్డా లేడీస్ మిమ్మల్నే ఎన్నుకుంటా' రనేసింది అమాయకపు అమ్మాయి అరుణ.

'ప్రెట్టీ, ప్రెట్టీ అనంత్' అని అతని గురించి హాస్టల్లో పాటలుకూడా పాడుకునే వారట.

ఏతావతు—అనంత్‌కి తన అందం ఎంత గొప్పదో తెలిసి వచ్చింది.

యులు—అబలలూ, సబలలూ, అందమైన వారూ, అందంగా కనిపించేవారూ, తెలివైనవారూ; తెలివిలేనివారూ—అందరూ తనకోసం—తన కంపెనీకోసం కొట్టుకు పోతూంటారని స్నేహితులనోట విన్నాడు. వాళ్ల కలలలోకి తాను వెళ్లి వస్తూంటా డని—విన్నాడు.

'వేయేల అనంత్...నువ్వు రమ్మంటే —యూనివర్సిటీకి సలాం కొట్టేసి నీతో కలసి జీవితంలోకి ఉరికేద్దామని ప్రతి అమ్మాయీ ఉరకలువేస్తూందంటే నమ్ము' అని కూడా అనేశాడో అబ్బాయి.

అబ్బాయిలలో అనంత్‌లా, అమ్మాయి లలో అపర్ణకూడా అంత అందమైనదానిగా చలామణి ఔతూంది ఆంధ్రా యూనివ ర్సిటీలో. ఆ అమ్మాయికి అందంకంటె గర్వం ఎక్కువ అని తోటి అమ్మాయి లలో కొందరంటూంటారు. అనంత్‌తో ఆమె వారాని కారుసార్లు కాఫీ తాగు తుంది. రెండుసార్లు టెన్నిస్ ఆడుతుంది. వోసారి అతని సరసన నాటకంలో నాయి కైంది. కనుక ఆమె గర్వపడటంలో అపరాధమేమీ లేదని అనేవారు లేకపోలేదు.

యూనివర్సిటీ ఆశించిందేమిటంటే— అనంత్ అపర్ణలు ఆనర్స్ పూర్తి కాకుం డానే సహజీవన సౌభాగ్యపథం పట్టేస్తారని.

యూనివర్సిటీలో ప్రొఫెసర్లు చదువు చెప్తారు అప్పుడప్పుడు.

విద్యార్థులు నేర్చుకునేది మాత్రం— ప్రేమించడం, కథలు వ్రాయడం, నాటకా లాడటం వగైరాలు. కనుకనే—

ఒంటరిగా యిన్ గేటులో ప్రవేశించిన అబ్బాయి—జంటగా ఔట్‌గేటులోంచి వచ్చి వాళ్ళపెద్దల ఆశల్నీ, నమ్మకాలనీ (కట్నాలు గట్రా...) చిత్తు చేసే స్తూంటాడు.

లేదా — స్ఫటికంలా అడుగుపెట్టిన అబ్బాయి — తిరిగి వచ్చేసరికి దేవదాసు పాత్రలో స్థిరపడి పోతాడు.

చదువు మాట మరచిపోయి—చీట్లాటలో వస్తెకెక్కుతాడు.

లేదా— కథలు రాసుకుంటూ అదే జీవిత మనుకుంటూ బయటపడతాడు.

తప్పు—వారిది కాదు.

యూనివర్సిటీలో— కథ వ్రాయడం, నాటకాలాడటం, పేకముక్కలు తిరగెయ్యడం,

ప్రేమా పెసరట్టూ

చిదానందం పొందడం (ప్రాహిబిషనుండే రోజుల్లో కూడా స్టూడెంట్లు హాస్టల్లో బుడ్లు దొరుకుతూండేవిట గెస్టులకి) యివన్నీ కాలేజిండస్ట్రీస్‌గా దినదినాభి వృద్ధి చెందుతున్నాయి.

ఆ వాతావరణం అటువంటిది.

అక్కడ—మొలక మానౌతుంది.

అబ్బాయి— అతనౌతాడు.

అమ్మాయి—ఆమె ఔతుంది.

ప్రేమ—పెళ్లి ఔతుంది.

సముద్రంనుంచి వచ్చే చల్లనిగాలి విశేషం అది.

కొండమీద అందంగా ఉండే ఆ స్థల మహత్యం అది.

ఇళ్లదగ్గరనుంచి వచ్చే మనియార్డర్ల మహిమ అది.

అనంత్—మందు పుచ్చుకోడు ... పేకా టాడడు...కథలు రాయడు...కనుక—అతని స్నేహంకోసం అమ్మాయిలు ప్రయత్నిస్తూం టారనేదికూడా చిన్న నిజం. పైన చెప్పిన వన్నీ డిస్‌క్వాలిఫికేషన్సని కాదు ఎంత మాత్రమూ. పై తరహాల మనుషులకి ప్రేమించడానికి టైముండదని—అమ్మాయిల అభిప్రాయం. కనుక వాళ్ళు అటువంటి అబ్బాయిలజోలికి పోరు(ట) సాధారణంగా.

యూనివర్సిటీలో ఆనర్స్ చదువుతున్నా అనంత్ మంచి అబ్బాయి—అని వాళ్లనాన్నకు కూడా నమ్మకమే.

(ప్రేమ కథలో ఫాదరేమిటి—పానకంలో పుడకలా అని విసుక్కోకు పాఠకమహాశయా... ఈ కథ తిరగబడాలంటే ఫాదరూ మదరూ అత్యవసరం.)

ఓ రోజా అనంత్ నాన్నారు తిన్నగా నాగార్జున హాస్టల్‌లో రూము నంబరు నాలుగు — కివచ్చేశారు—ఇన్ గేటులోంచి — వయా షష్టిపూర్తి మహల్. షష్టిపూర్తి మహల్ దాటుతూంటే ఆయన కనిపిం చింది—తను నాలుగేళ్ల క్రితం షష్టిపూర్తి చేసుకుని ఉండవలసింది మరచిపోయానని.

రిజిస్ట్రారాఫీసు చూడగానే భయమేసింది —యూనివర్సిటీలో జరిగే రిజిస్ట్రే మారేజిలకి కాని ఆఫీసు పెట్టలేదుకదా? అలా అయితే తను యిక్కడికి పనికట్టుకు రావడం అనవసర మైపోతుందని.

'అనంత్ నా కొడుకు...అప్రాచ్యపు పనులు చేయడు అనుకుంటూ ధైర్యంగా నాగార్జున హాస్టల్‌లో రూమునంబర్ ఫోర్‌లో అడుగు పెట్టాడనంత్ నాన్నారు.

అడుగుపెట్టిన మరుక్షణం — ఆ ముసి లాయన గుండె దడదడలాడింది. ఆ గదిలో —కొట్టొచ్చినట్టు కనపడింది—డబుల్‌కాట్ ఆయన దృష్టికది — లక్ష్మీనారాయణులు జాయింట్‌గా ఎంజాయ్‌చేసే శేషతల్పంలా కనిపించింది.

'ఒక్కడికి—యింత మంచమెందుకురా అనంతూ ?' అంటూ అడిగారాయన మనసు ఉండబట్టక.

'ఇద్దరిది నాన్నారూ...ఈగది యిద్దరికి ...పొదుపు కోసమని ఒక్క మంచం చేయించుకున్నాం నేనూ నా రూమ్మేటూ.'

'జోహో మరి ఆ టేబులుమీద అన్ని అలంకరణ సామగ్రులెందుకురా ?,

'ఇక్కడ అంతా అందంగా నీటుగా ఉంటేతప్ప ప్రొఫెసర్లు పాఠాలు చెప్పరు.'

'పుస్తకాలు కనిపించవేం ?'

'పెద్దచదువుకదూ నాన్నా ... పుస్తకాలు కొని చదవాలంటే ఎవడి ఆస్తి పాస్తులూ చాలవు. అందుకని గ్రంథాలయంలో చదివేసు కుని వచ్చేస్తూంటాం.'

ఇంతలో రూమ్మేటువచ్చి--'సారీ—'అనేసి వెళ్ళిపోబోయాడు.

'ఫరవాలేదు రారా ... ఈయన మా నాన్నారు...ఇతను మా రూమ్మేట్' అంటూ పరిచయం చేశాడు అనంత్.

'నమస్కారం సార్...' అన్నా డా రూమ్మేటు—చేతులు జోడించడం మరచి పోయి. యూనివర్సిటీ ప్రాంగణంలో లిప్స్ తప్ప మరేలింబూ కదలదు గ్రీట్ చెయ్య డానికి.

'దీర్ఘాయుష్మాన్ భవ !' అంటూ చేయెత్తి దీవించాడు అనంత్‌నాన్నారు.

'మీరేదైనా మాట్లాడుకుంటారేమో... నేనలా వెళ్లొస్తాను...'

'ఫరవాలేదు కూర్చోరా...' అన్నాడనంత్.

రూమ్మేటు కూర్చుండి పోయాడు.

'మళ్లీ నాకు బండి టైమౌతుంది కానీ— నీకోవిషయం చెప్పాలని వచ్చానురా అనంతూ...' అన్నారు అనంత్ నాన్నారు.

'చెప్పండి నాన్నా...'

'ఈ నెలాఖరులోగా మూడు ముహూర్తా


ప్రతివారికీ
రక్షణ
కావాలి
CINTHOL
TOILET POWDER
సింథాల్ టాయిలెట్ పౌడరు
మీకీ రక్షణలన్నీ ఇస్తుంది.
సింథాల్ —
Interprib/CP/S T-I

"నాఽతిచరామి"

అయ్యా, యూహ్యా యాహ్యా,
శయ్యానికి కాలుదువ్వక
వెయ్యాన్ని కాంక్షించే
నా విన్నపం వింటావా?
నాకలాన్ని కన్నీటిలో ముంచి రాస్తూన్నాను
నాకలాన్ని రక్తాశ్రువులతో నింపి
రాస్తూన్నాను,
నాబలాన్ని నరనరాలలో నింపి
రాస్తున్నాను.
నాకలం హలమై మానవ హృదయ
కేదారాంతరాంతరాలను
స్పృశించే రీతిగా వ్రాస్తూన్నాను—
మరి నా విన్నపాన్ని మన్నిస్తావా?
మరి ఈమారణ హోమాన్నిమాన్పిస్తావా?
మనం మనం పొరుగువాళ్ళం
మన సంసారాల లోటుపాటులు
మరొకరి కంటె మనకే బాగా తెలుసు
మన సంసారాలు పచ్చగా వుంటే
మన పసిపాపలు హాయిగా వుంటే
మన ఇళ్ళ ముంగిళ్ళ రంగవల్లులు
కలకలలాడుతూంటే
మనం మన మస్తిష్కాలను
మింటివైపు సారించి
మన సాటి వారిలో
సగర్వంగా మనగనలుగుతాం.
మనలో మనం పోరాడుకొన్నామా
మనలను మనమే హత్య చేసుకొన్నామా
మన మనుమలూ, మనుమల మనుమలూ
మనలను మాటిమాటికీ శపిస్తూంటారు
మనకష్టల రాక్షసత్వాన్నిమననంచేసుకొంటూ
మన పక్షాల కర్కశత్వాన్ని హననం
చేసుకొంటూ
మన రాక్షసతత్వాన్ని విలువునా
దహనం చేసుకొంటూ
మన అజ్ఞానానికీ, అహంభావానికీ
మరీ మరీ బాధపడుతూ
మళ్ళీ ఇటువంటి పొరపాటు
పునరావృతం కారాదని
శపథం తీసుకొంటూ
ముందుకి, మునుముందుకి సాగిపోతారు—
అయ్యా, యూహ్యా యాహ్యా
ఇది నా సంసారపు గొడవ
నీకెందుకని బుకాయిస్తావా
విధిగా మేం రంగంలోకి
దిగవలసి వస్తుంది.
నా పెళ్ళాన్ని నేను కొట్టుకుంటాను
నీకేం? పో పొమ్మన్నావా
నీపెళ్ళామే నీకు ఎదురుతిరిగే
పరిస్థితులు వస్తాయి
అది నీకూ, మాకూ
ఎవరికీ ఆరోగ్యకరం కాదు—
అవునా—
వెయ్యానికైనా, వియ్యానికైనా
శయ్యానికైనా
తయ్యారుగా వున్నాం,
తరువాత విచారించి లాభం లేదు,
ఇరవై ఐదు సంవత్సరాలుగా
మనం వేరు కాపురాలు చేస్తూన్నాం
మనం తాళికట్టే సమయంలో
మనస్ఫూర్తిగా 'నాఽతి చరామి' అని
పెద్దల ముందు బుద్ధిగా వాగ్దానాలు చేశాం
ఈ పవిత్రబంధాన్ని, ఈ పవిత్ర నియమాన్ని
ఏనాటికీ అతిక్రమించమని ప్రతిజ్ఞ పూనాం
అవునా, ఈనాడు జరుగుతూన్న దేమిటి?
శాంతినిలయాలలా ఉండవలసిన మనగృహాలు
శ్మశానాలలా తయారైనాయి
శాంతి నివాసాలలా వుండ వలసిన
మన గృహాలు
వికారాలకరాళ నృత్యాలతో
కారుచిచ్చులతో, కాకాంతో, ఘూకాంతో
కఠోర ఆక్రందనలతో కన్నుల
రక్తాశ్రువులనువర్షింపజేస్తున్నాయి
అన్నా, యాహ్యా, వింటూన్నావా
నీ సోదరుల అంతిమఘోషలు?
అన్నా, యాహ్యా, కంటూన్నావా
నీ సోదరీ మణుల అంతిమశ్వాసలు?
లే, నీదీర్ఘసుషుప్తినుంచి మేలుకో—
లే, నీకన్నుల దీర్ఘతమస్సునుంచి తేరుకో—
ఇప్పటికైనా ఈరక్తపాతాన్ని ఆపు,
ఇప్పటికైనా సోదరుడు సోదరిని
దారుణంగా హత్య చేసే
పాశవిక శాసనాన్ని అంతం చేయి
అదిగో! అంతరిక్షంలో ఆవేదనతో
ఆకాంక్షతో వీక్షిస్తూన్నారు అన్నిదేశాల
దేవతలూ!
ఆ దేవతల సహనం నన్నగిల్లి
అగ్నికుతారాలు వర్షించక ముందే
ఉన్నదానినిచక్కబెట్టుకోడానికిప్రయత్నించు
కన్న తల్లి కడుపులో కార్చిచ్చు రగల్చకు—
అందరినీ రణరంగంలో దింపి
ఆపైన అగ్నికి చల్లారిన బూడిదను
అపార దుఃఖమనస్కుడవై హతాశుడవై
అవనత శిరస్కుడవై, అశ్రుకణపూరి
తుడవై
ఏకాకివై, భగ్నహృదయుడవై
సేకరించే పనికి పూనుకోకు!
ఇది కేవలం నీకుటుంబ విషయం
మాత్రమే కాదు——
ఇది సమస్త మానవాళి కుటుంబ విషయం
ఈవిషయం శాంతియుతంగా
పరిష్కరించ బడాలి.,
ఈ విషయం అతి సత్వరంగా
పరిష్కరింప బడాలి,
బాంగ్లాదేశ్‌లో అమాయకుల
ప్రాణాలను హరించే
దొంగల దారుణ కృత్యాలకు
చరమగీతం ఆలపింపబడాలి!

—పి. ఎస్. గోపాల్ ●

ఉన్నాయి. నువ్వు పెళ్ళిచేసుకోవాలి. అప్పుడు. మీ అమ్మ ఆరోగ్యంకోసమేనా నువ్వు వెంటనే పెళ్ళి చేసుకోవాలిరా...'

'నాన్నా!'

'ఉన్నవిషయం చెప్పాను. మీ అమ్మకెందుకో అపనమ్మకం—నీ పెళ్ళి చూడకుండా కన్ను మూసేస్తుందేమో అని... మరి...నీయిష్టం'.

'సరేనాన్నా...' అనేశాను ఇష్టమయింది మాటలా.

ప్రేమా పెసరట్టూ


'పిల్లని వెతుకోడం అంతా నీ యిష్టం ప్రకారమే. ఆవిషయంలో మా పట్టుదేమి ఉండదు. ఒకవేళ నీ స్నేహితులలో...' అంటూ ఆగిపోయారు అనంత్ నాన్నారు.

'అనంత్ నాన్నారూ—మీరు పాక్షంతో నుంచి నాన్నారు. అందరికీ మీలాటి నాన్నలుంటే ఈ ప్రపంచంలో ప్రేమ హాయిగా విలసిల్లుతుంది. మీరు—ఆదర్శప్రాయులు నాన్నారు...' అని అరిచేబోయాడు అనంత్ రూమ్మేటు. ఆయన అదే సమయానికి లేచి—

'వో వారం రోజులలో ఏ విషయమూ వ్రాయి. అవసరమైతే నేను మళ్ళీ వస్తాను—' అనేసి వెళ్ళిపోయారు అనంత్ నాన్నారు. అనంత్‌కి—ఆదర్శప్రాయ నాన్నారున్నా

చిన్నపిల్లల ఫ్రాక్


ఇంక వేసవికాలం వచ్చేసింది. ఈరోజుల్లో టెరిలిన్‌లూ, సిల్కులూ కడితే చిన్న పిల్లలకు చాలా చిరాగ్గా వుంటుంది. ఈ రోజుల్లో అందమైన కాటన్ చెక్సూ, చారలూ, సాదాగా వున్నవి ఎన్నో దొరుకుతున్నాయి. చిన్న చిన్న మోటిఫ్‌లు వేసి ప్రింట్ ఫ్రాకులు కుడితే పిల్లలకు హాయిగా వుంటుంది. సింపుల్‌గానూ హాయిగానూ వున్న ఈ నూటు కుట్టడానికి 1 మీటరు బట్ట చాలును. ఫ్రాక్ మధ్యలో ఏవిధంగా డిజైను వెయ్యదల్చుకుంటే ఆ రకమైనది వెయ్యవచ్చును. కొలతల ప్రకారం ఫ్రాకు కట్ చేసేక, కొంత పీస్‌ని క్రాస్‌గా కట్ చేసుకోవాలి. ఈ క్రాసు ముక్కలతో ఫ్రాక్ చేతులూ, మెడకి







సన్నగ పైపింగ్ వేసుకోవాలి. లాగుకి కూడ కట్‌చేసిన భాగం మడిచి కుట్టెయ్యకుండా సన్నగా పైపింగువేసి కుట్టాలి. వోపెన్ వెనక్కి వుంచి, కుడివైపున వున్న పీస్‌కి కాజాలు, ఎడమవైపు బటన్సు కుట్టాలి.

—డి. లీల







రోచ్ అని అసైనం చాటడానికి డ్రైనింగ్ హాల్సులోకి పరుగెత్తాడు అనంత్ రూమ్మేటు.

* *

'అనురాధా...అనూరాధా...'

'వోయ్...వోయ్...' సవినయంగా పలికింది అనూరాధ.

అబ్బాయి పిలవగానే కంయ్యిమంటానికి ఆమేమీ కాలేజి అమ్మాయికాదు. యూనివర్సిటీలో చదువుతున్న అమ్మాయి. మానర్స్ తెలిసిన ఆనర్స్ అమ్మాయి.

'సాయంత్రం వోసారి అలా లాసెన్స్‌బేకి వస్తారూ?'

'రాలేను. సాయంత్రం యింటికిపోవాలి' అంది అనూరాధ అమ్మ వాగ్దానం చేసిన పెసరట్లను తలుచుకుంటూ.

'ప్లీస్...ఒక్కసారి...మీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి...'

'అదేదో యిక్కడే మాట్లాడరాదూ?'

'ఇక్కడా! వాతావరణం సరిగ్గాలేదు.'

'డోన్ట్‌మైండ్. అలా ఆ చెట్లకిందకి వెరదండి. చల్లగా ఉంటుంది—' లాకాలేజీకి వెళ్ళేదారిలో చాలా చెట్లున్నాయి. వాటి దిగువ ఎన్నో నీడలున్నాయి. ఆ నీడలు—ఎండలో చల్లగా ఉంటాయి. చెట్టుకింద చేరుతూ అనుకున్నాడనంత్ — నేను చెప్పబోయే విషయం వింటే—నువ్వు ఒక్కసారి ట్విస్ట్ చేసేస్తావనూరాధా అని.

అనూరాధ అందంగా ఉండదు. అమ్మాయిలా ఉంటుందంతే.

'వో చిన్న కథకు ముగింపుకావాలి అనూరాధా' అన్నాడనంత్ చెట్టుకి జేరబడుతూ.

'నేనేమీ రచయిత్రినికాను—' అనేసిందనూరాధ.

'ఇది—కథకాదు—జీవితం—'

'జీవితాలకి ముగింపు—మృత్యువు. అది నా తరంకాదు. నేను డాక్టర్నికాను.'

ఇక సహించలేకపోయాడు అనంత్. కోకిల పిలిస్తే చులకన చేస్తున్న అనూరాధ నతను క్షమించలేకపోయాడు.

'నేను నిన్ను ప్రేమిస్తున్నాను అనూరాధా,' అనేశాడనంత్ ఆవేశంగా.

(56వ పేజీ చూడండి)

వారఫలం

21-5-1971 శుక్రవారం మొదలు
27-5-1971 గురువారం వరకు

మేషం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. రాజకీయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలుబాగాఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం: అధికవ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

మిధునం: వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. వారం ఆఖరులో తిరిగి అనుకూల పరిస్థితి యేర్పడుతుంది.

స్త్రీలకు— దైవ కార్యాలు నెరవేరతాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం: వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. రావలసినడబ్బు సమయానికి అందుతుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు.

స్త్రీలకు—సాటి వారిలో గౌరవం బాగుంటుంది. అనారోగ్య సూచనలు ఉన్నాయి.

సింహం: అన్నివ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. సంతోషకరమైన వార్తలను వింటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కన్య: కొన్నివ్యవహారాల్లో ప్రయాస మీద ప్రయోజనం [illegible] కాగలదు. ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—అధిక వ్యయం జరుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

తుల: ప్రయత్నించిన ప్రతి పని సులువుగా నెరవేరగలదు. ప్రయాణాలు ఫలిస్తాయి. వారం మధ్యలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో అనుకూలమైన మార్పులు వస్తాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: వ్యాపారంలో సాటి వారిపోటీ పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో మీరు శ్రమ పడినా, ఫలితం దక్కదు.

స్త్రీలకు—దైవ కార్యాలు నెరవేరతాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి.

ధనుస్సు: ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలవల్ల ముందుకు కూడా ఉపయోగం ఉంటుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. దైవ కార్యాలు నెరవేరతాయి. ప్రయోజనం గల పరిచయాలుయేర్పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మకరం: సామాన్యమైన పనులకు కూడా మీరు యెంతో కృషి చేయవలసి వస్తుంది. సాటి వారిలో గౌరవం బాగుంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. [illegible] వ్యవహారాల్లో మీ కృషి ఫలిస్తుంది.


కుంభం: వృత్తిలో అనుకూలవార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థికవ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణించ గలదు.

స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

మీనం: సమయానికి డబ్బు ఒకవిధంగా [illegible] చేతికి రాగలదు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. వారంఆఖరులో అన్నివ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

—[illegible]


Lakmé
VANISHING CREAM
అది సౌందర్యమైన
లక్మె వ్యానిషింగ్ క్రీమ్‌తో

యర్రం చంద్రశేఖరం

జరిగిన కథ

లక్ష్మయ్యగారొక మోతుబరి రైతు. శాంత ఆయనకి ఏకైక కుమార్తె. తల్లిదండ్రులు లేని మేనల్లుడు రామాన్ని చిన్నప్పటినుండి తనే పెంచి పెద్ద చేస్తాడు. రామం చదువు హెచ్.ఎస్.సి.తో ఆపేసి వ్యవసాయపు పనులు చూసుకుంటాడు. శాంతను కాలేజి చదువుకు పంపిస్తారు. కాలేజిలో ఆమెకి శారద అనే బీదవిద్యార్థిని స్నేహితురాలవుతుంది. శారద విషాదగాథ శాంతను కదిలించి వేస్తుంది. శారదకి ప్రభాకరం పరిచయమవుతాడు. రామం మీద విసుగు చెందిన శాంత సుందరంమీద మోజుపడింది. ఇద్దరూ పెళ్ళిచేసుకోవాలనుకున్నారు. ఈవిషయం విని లక్ష్మయ్యగారు బాధపడ్డారు. రామం ఆతనికి సర్ది చెప్పవలసి వచ్చింది. ప్రభాకరం వచ్చాడు. అతను పూర్తిగా మారిపోయినందుకు శారద సంతోషించింది. జ్యోత్స్న పేరుతో వెలువడ్డ రచనలు శారదవేనని తెలుసుకున్న తర్వాత ప్రభాకరం ఆమెకి మరింత సన్నిహితమై పోయాడు. శారద సుందర రామయ్యగారి కుమార్తె అనే రహస్యం తెలుస్తుంది. శారదకూ ప్రభాకరానికి వివాహం చేయాలనుకుంటారు.

19

గ్రామం చేరుకున్న రామం నేరుగా రమణయ్యగారి యింటికి వెళ్ళాడు. అప్పుడు సాయంత్రం ఆరుదాటింది. రమణయ్యగారు అప్పుడే ఎక్కడ నుండో యింటికి వస్తూ తమ యింటి ముందే రామానికి కనుపించారు.

'హైదరాబాదునుండి ఎప్పుడొచ్చావ్?'— రమణయ్యగారు.

'ఇప్పుడే వస్తున్నాను. ఇంకా యింటికి వెళ్ళలేదు. నీతో మాట్లాడిన తర్వాతే యింటికి వెడదామనుకొని యిలా వచ్చాను.'

'అలాగా! అలా కూర్చొని మాట్లాడుకుందాం' అని వసారాలో ఉన్న మంచం వాల్చి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు తీసుకు రావలసిందిగా తన భార్యను కేక వేశాడు.

కాళ్ళు కడుక్కొని మంచం మీద కూర్చున్నాడు రామం.

'బాబాయి. నే చెప్పిన పని సవ్యంగా జరిగిందా?

'ఏమోరా? పనైతే జరిగిందికాని సవ్యంగా జరిగినదీ, లేనిదీ చెప్పడం కష్టం. ఎన్ని విధాల చెప్పి చూసినా లక్ష్మయ్య నమ్మడం లేదు. ఈ రోజు కూడా చెప్పి చూశాను. లాభం లేక పోయింది. నేనే కాకుండా నీ స్నేహితులతో కూడా చెప్పించి చూశాను. అయినా ఫలితం శూన్యం!' నిరుత్సాహం రమణయ్యగారి ముఖంలో కనుపించసాగింది.

'మరిప్పుడేం చెయ్యమంటావు బాబాయి. నాకంతా అయోమయంగా ఉంది. ఎవ్వరికీ చెప్పకుండా ఎటైనా వెళ్ళిపోతే ఎవ్వరికీ ఏ సమస్యా ఉండదనుకుంటాను.'— అన్నాడు విచారంతో రామం.

'పిచ్చివాడా! అలా అని అనుకుంటున్నావు. నీ మామయ్య శాంతను వదిలైనా ఉండగలడేమో కాని నిన్ను చూడకుండా ఉండలేడు. ఈ రెండుమూడు రోజులలో నీ గురించి ఎన్నిసార్లో అన్నాడు. 'రామం ఎప్పుడొస్తాడో?' అని. అతనిని ఈ పండు వయసులో ఒంటరిగా ఒదిలి వెడితే మీ కుటుంబం చిన్నాభిన్నమౌతుంది. శాంత సుందరాన్ని చేసుకుంటుంది. ఆ తర్వాత వారిద్దరూ ఎలాగూ ఈ కుగ్రామంలో ఉండరు. ఇదంతా చూడలేక లక్ష్మయ్య 'హరీ' అంటాడు'.

'పోనీ మామయ్యతో గిల్లికజ్జా పెట్టుకొని వేరుగా ఉంటేనో?' ఆతురతగా రమణయ్యగారి ముఖంలోకి చూస్తూ నిర్లిప్తతతో అన్నాడు.

'మీ మామయ్య నిన్ను వేరుపడనిస్తాడా? అదెలా సాధ్యం? ససేమిరా ఒప్పుకోడు. నీవు హైదరాబాదు వెడితేనే రోజుకు ఎన్నోసార్లు నీ గురించి తలచినవాడు ఈ ఊరిలోనే నీవు వేరుగా ఉంటానంటే సహిస్తాడా?'

'మరి యిప్పుడు నన్నేం చేయమంటావు బాబాయి?'

'ఏమీలేదు. ఇంటికి వెళ్ళు. ఎలా జరగవలసి ఉంటే ఆలా జరుగుతుంది.'

'అంతేనా?'

'అంతే!'

'సరే! వస్తా బాబాయి. అనవసరంగా నీకు శ్రమ కలిగించాను.'

'ఇదొక శ్రమటరా? మీ కుటుంబ శ్రేయస్సుకోసం నేనేకాదు, ఈ ఊరు ఊరంతా పాటుపడుతుంది. మీ నుండి ఉపకారాలు పొందని వారెవరున్నారీ ఊళ్ళో?'

'ఈ విషయంలో ఎవరుమాత్రమేం చేయగలరు?' నిరుత్సాహంతో అని తన యింటివైపు నడిచాడు రామం.

*   *   *

లక్ష్మయ్యగారి యింట్లో రాత్రిపూట భోజనాలు ముగిశాయి. భోజనానంతరం రామం నిద్రపోవడానికి వెళ్ళబోతూ ఉంటే లక్ష్మయ్యగారు పిలిచి ఆపారు.

'ఏమిటి మామయ్యా?' అని తమ మంచంవైపు వెడుతూన్న లక్ష్మయ్యగారిని అనుసరించాడు రామం. లక్ష్మయ్యగారు మంచంపై కూర్చొని రామాన్ని కూడా కూర్చోవలసిందిగా సంజ్ఞ చేశారు. రామం కూర్చున్నాడు.

'ఒరేయ్ రామం! ఏమిట్రా పెళ్ళాం విశేషాలు?' చుట్టకొసను నమిలి ఉమ్మి వేస్తూ అడిగారు లక్ష్మయ్యగారు.

'ఆ వ్యాసాలు, కథలు, నవలలు వ్రాసింది మన శారదే మామయ్యా! ఆమెకు సన్మానం చాలా ఘనంగా జరిగింది.'

'అలాగా...! పాపం ఆ అమ్మాయి ఎంతో బుద్ధిమంతురాలు. అన్నమంతా పట్టిచూడాలా?' చుట్ట నోట్లోపెట్టుకొని అగ్గిపుల్లగీసి ముట్టిస్తూ అన్నారు లక్ష్మయ్యగారు. ఆ మసక వెలుతురులోనే లక్ష్మయ్యగారి ముఖం గంభీరంగా ఉందన్న విషయం గుర్తించగలిగాడు రామం.

'బుద్ధిమంతురాలే కాదు. అదృష్టవంతురాలు కూడా! ఆమె ఒక లక్షాధికారి కూతురు. మరొక లక్షాధికారికి కోడలు కాబోతూ ఉంది.'—జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పాడు రామం.

'ఎంత సంతోష వార్త చెప్పావురా? మంచివాళ్ళ నెప్పుడూ వారి మంచితనమే కాపాడుతూ ఉంటుంది. అయితే ఆ అమ్మాయి వివాహం త్వరలోనే జరుగబోతున్న దన్నమాట.'

'అవును. పదిహేను రోజులలో ప్రభాకరం పుట్టినరోజునాడు వివాహ నిర్ణయం చేసారట. నన్ను తప్పకుండా రమ్మని మరీ మరీ ఆహ్వానించారు శ్రీపతిగారు.'

'రామం శారద వివాహం జరిగిపోతూ ఉంది. కాని మన యింట్లో వివాహం ఎప్పుడు జరుగుతుందో ఏమో? ఆ రంగయ్య తాత, సుందరం వేరొక సన్నాగం పన్నారు. నీవు మంచివాడవు కాదనీ, నీలో చాలా మార్పు వచ్చిందనీ, కనపడిన ఆడపిల్లలందరి వెంటా పడి తిరుగుతున్నావనీ, లేనిపోనివన్నీ కల్పించి నీ స్నేహితుల ద్వారా, రమణయ్యద్వారా నాకు నూరిపోయించాలని వ్యర్థ ప్రయత్నం చేశారు. దుర్మార్గులు. వాళ్ళు ఎన్ని వేషాలు వేసినా నా కంఠంలో ప్రాణముండగా శాంతను ఆ సుందరానికిచ్చి వివాహం జరిపించను. కుర్రవాళ్ళంటే ఏమో అనుకోవచ్చు. రమణయ్య కూడా ప్రతిరోజూ పనిగట్టుకొని నా వద్దకు వచ్చి లోకాభిరామాయణం మొదలెట్టి అది పూర్తయ్యాక వెడుతూ, వెడుతూ నీపై ఏవేవో లేనిపోని కొండాలు చెప్పడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంది. రమణయ్య మన హితవు కోరేవాడు. [illegible] పండినవాడు. అలా ఎందుకు చెబుతున్నాడో ఎంత ఆలోచించినా నాకు అర్థం కాలేదు. నీవు వచ్చాక ముఖాముఖిన నిన్నే అడిగి తెలుసుకోవచ్చని ఊరుకున్నాను. నాకు మాత్రం అతని మాటలపై నమ్మకం కలగలేదు.'

'నిప్పు లేనిదే పొగ రాదనుకొంటాను.' భయం, భయంగా లక్ష్మయ్యగారి ముఖం లోకి చూస్తూ అన్నాడు రామం.

లక్ష్మయ్యగారి భృకుటి ఏో క్షణం ముడి పడి మళ్ళీ యథాస్థితికి వచ్చింది.

'అంటే...?' గంభీరంగా ప్రశ్నించారు లక్ష్మయ్యగారు.

'ఏముంది మామయ్యా? నాకు చెప్పింది నిజంగానే.'

'అవు.' రామం తన మాటలు పూర్తి చేయకుండానే లక్ష్మయ్యగారు గర్జించారు.

ఆ కంఠంలోని కాఠిన్యతకు తన ప్రక్కన బాంబు ప్రేలినట్లు ఉలిక్కిపడ్డాడు రామం.

'ఒరేయ్ నేను పిచ్చివాణ్ణి కాదు. అమాయకుణ్ణి అంతకన్నా కాదు. నన్ను ఎవ్వరూ మభ్యపెట్టలేరు. ఇప్పుడర్థమౌతూ ఉంది. ఇదంతా నీవు పన్నిన పన్నాగమేనని. ఈ విషయంలో నీవే కాదు, నిన్ను సృష్టించిన ఆ బ్రహ్మదేవుడు దిగివచ్చి చెప్పినా నమ్మను. నీ ఈ వ్యర్థ ప్రయత్నాలు మాని బుద్ధిగా శాంతను వివాహం చేసుకో! అసలు యిందులో ఒకరి ననేదేముంది? బాగా చదువుకొని జ్ఞానము, వినయ విధేయతలు,



ర్థతసంపాదిస్తుందనీ, అందునా నీవుబలవంతం చేస్తున్నాననీ, శాంత పై చదువులకు ఒప్పుకున్నాను. కాని ఈ నాటి పెద్దచదువులు యిటువంటి మూర్ఖతను పెంపొందిస్తాయని తెలిస్తే నసేమిరా శాంతను చదివించక పోయేవాణ్ని' విషాదం ఉట్టిపడుతూ ఉంది వారి ముఖంలో.

'ఇందులో శాంత తప్పేముంది మామయ్యా? ఆమె చదువుకున్న యువతి. తన కన్న ఎక్కువ చదివిన మరొక యువకుని పెళ్లాడతాననడం సహజమేకదా!'

'అదంతా నా కననరం! ఈ విషయంతో నీ సలహా సంప్రతింపులు నేను పాటించను. నాకు తోచినట్టే నేను చేస్తాను.'

'అలా అంటే ఎలా మామయ్యా? శాంత చిన్నపిల్ల కాదు. ఆమె ఎంతో బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చినట్టు నాతో చెప్పింది. అటువంటప్పుడు ఆమెకు యిష్టంలేని ఈ వివాహం బలవంతంగా జరిపిస్తే ఆ తర్వాత ఎంతగానో యిబ్బంది పడవలసి వస్తుంది.

'ఒరేయ్ యింతకాలం ఎంతో గాఢంగా నిన్ను ప్రేమించి నిన్నే పెళ్లాడుతుందని అనుకున్న శాంత మనసు అకస్మాత్తుగా ఎందుకు మారింది? ఈ విషయం అర్థంకాక తల బద్దలై పోతూ ఉంది.'

'నాకూ ఆ అనుమానమే కలుగుతూ ఉంది మామయ్యా! బహుశా సుందరం డాక్టరనీ, టీకు టాకుగా ఉంటాడనీ, ఊహించి తన మనసు అతనివైపు మరల్చుకొని ఉంటుంది.'

'అదేమీ కాదు. ఇదంతా నాకే అనుమానాన్ని కలిగిస్తూ ఉంది. ఈ విషయంతో సుందరం ఏదో పన్నాగం పన్ని ఉంటాడని ఊహ! లేకపోతే శాంతకు ఏదైనా మందో మాకో పెట్టి దాని మనసు తిప్పడానికి ప్రయత్నంచేసి ఉండొచ్చు.'

'ఏమిటో మామయ్యా! నా కంతా అయోమయంగా ఉంది. శాంతను ఎలా ఒప్పించాలో, ఎలా నచ్చచెప్పాలో నా కర్థం కావడంలేదు, దృఢనిశ్చయం చేసుకున్నానని అంటున్న ఆమెముందు గట్టిగా మాట్లాడాలంటే భయం కలుగుతూఉంది. ఏ అఘాయిత్యానికి తలపెడుతుందోనని?'

'నేను ఆ భయంతోటే కుమిలిపోతు

మౌ న్లై లం...

న్నాను' అని ఒక్కక్షణంఆగి ఏదో గుర్తుకు వచ్చినవాడిలా తలపంకిస్తూ 'ఏరా రామం! నీవు నన్ను మోసగించాలని చూస్తున్నావు కదూ? నిజంచెప్పు రమణయ్యను నీ స్నేహితులను నీగురించి అబద్ధాలు చెప్పమని ప్రేరేపించింది నీవేకదూ?'

'...............'

'మాట్లాడవేంరా? అలా ఎందుకు చేశావు? నీ గురించి చెడువిని నా మనసు మార్చుకొని శాంతను సుందరానికిచ్చి వివాహం జరిపిస్తానని నీవు ఊహించి ఉంటావు. ఇవన్నీ అబద్ధాలని ఆ వ్యాళే గ్రహించాను. చెబుతున్నది రమణయ్యకాబట్టి ఈ విషయంతో తుణ్ణంగా ఆమాకీ తీశాను. నీ స్నేహితులు తప్ప మిగతా వారెవ్వరూ నీపై పిసరంత చెడు చెప్పలేదు. అయినా విప్పటి కప్పుడు నీ విషయాలన్నీ నేను తెలుసుకుంటూనే ఉన్నాను. ఒకవేళ నీవు చెడుపని చేసినా నిన్ను యింటినుండి తరిమేస్తానని ఎలా అనుకున్నావురా? నిన్ను కాదని నేనెక్కడికి వెళ్లగలను? నన్ను కాదని నీవెక్కడికి వెళ్లగలవు. నిన్ను ఆదరించో, బెదిరించో సక్రమ మార్గాన పెడతాను గాని అలా వదిలేస్తానా ఏమీ పట్టనట్టు. తల్లిదండ్రులులేని నిన్ను కంటికి రెప్పలా కాపాడుతూ పెంచి పెద్ద చేశాను. ఏదో నలుగురు చెప్పిన మాటలు విని ఆవేశంలో త్వరపడి నిన్ను తరిమేస్తానని ఎలా అనుకున్నావురా? ఇంతకాలం నుంచీ నీవు నన్నర్థం చేసుకున్నది యింతేనా?' లక్ష్మయ్యగారి కళ్లు బాధతో, విచారంతో తేమను నింపుకున్నాయి.

తన మామయ్య విన్నడూ కంటతడి పెట్టగా చూసి ఎరుగని రామం కలవరపాటు చెందాడు.

'మామయ్యా! నన్ను క్షమించవూ...?' అని అడుగుతూ వారి విశాల వక్షస్థలంలో తలదాచుకున్నాడు రామం.

'బాబూ రామం!' అని అతనిని యింకా దగ్గరకు తీసుకున్నారు లక్ష్మయ్యగారు.

ఆ విధంగా కొన్ని నిముషాలు గడిచిపోయాయి. మెల్లిగా తేరుకున్న రామం 'నేను తప్పు అంచనాతో ఆలోచించాను మామయ్యా! శాంత, తను సుందరాన్ని గాఢంగా ప్రేమిస్తున్నానని చెప్పినప్పటినుండీ నేనెంతో మానసిక వ్యధ ననుభవిస్తున్నాను. పైకి మాత్రం అలా గంభీరంగా కనుపిస్తున్నాను. నేను సుఖపడక పోయినా శాంత సుఖ సంతోషాలే నాకు కావాలి. అందుకని శాంత వివాహం సుందరంతో జరిపిస్తానని శాంతకు మాట యిచ్చాను. ఎంతో ఆలోచించాను. ఏ మార్గమూ తోచక ఇలా చేయవలసి వచ్చింది. ఇదీ విఫలమైంది.' కన్నీటిని తుడుచుకుంటూ అన్నాడు రామం.

'నీవు ఒకరి మంచిని, మేలును కోరే వాడివని నాకు తెలుసు. యికముందు యిటువంటి పిచ్చి పిచ్చి ప్రయత్నాలేవీ చేయబోకు. భారమంతా ఆ భగవంతుడిపై వేసి నిశ్చింతగా రోజులు గడుపుదాం. వానిని నమ్ముకున్న వారికి అపజయం ఏనాటికీ కలగదు.' అని ఆప్యాయిస్తూ 'బాబూ చాలా ప్రొద్దుపోయింది. నీవు వెళ్లి పడుకో' అని నడుము వాల్చారు లక్ష్మయ్యగారు.

'అలాగే మామయ్యా!'—వెళ్లి పోయాడు రామం.

ఇద్దరి మనసులూ కొద్దిగా తేలిక పడ్డాయి—

* * *

వారం రోజులు ప్రశాంతంగా గడిచి పోయాయి—

ఒకరోజు పంచాయితీ ఆఫీసులో కూర్చుని ఏవో పనులు చూసుకుంటున్నాడు రామం. మధ్యాహ్నం పన్నెండైంది.

'సార్!' అన్న పిలుపు వినపడి తలఎత్తి చూశాడు.

'మీకు రిజిస్టర్డు లెటరు వచ్చింది. సంతకం చేసి తీసుకోండి.' అని స్లిప్పును రామం టేబులు పై ఉంచాడు పోస్టుమాన్.

సంతకం చేసి రామం కవరు తీసుకున్నాడు. ఆఫీసుకు సంబంధించిన ఉత్తరమేమోననుకుని దాన్ని టేబులుపై ఒక ప్రక్కనుంచి మళ్లీ తనపనిలో లీనమయ్యాడు.

పనిపూర్తిచేసి యింటికి బయలుదేరేటప్పుడు అనుకోకుండా రామం దృష్టి ఆ రిజిస్టరు కవరుపై పడింది. కవరుపై వ్రాసిఉన్న దస్తూరి గుర్తించిన రామం వెంటనే ఆ కవరువిప్పి ఉత్తరం చదువుతున్నాడు.

ఆ ఉత్తరం చదివినంతసేపూ అతని ముఖంలో రకరకాల మార్పులు కనుపిం

శాంత పూర్తిగా చదివి దీర్ఘంగా నిట్టూర్చుస్తూ 'సుందరం ఎంతకు తెగించాడు' అని మనసులో అనుకుంటూ బయటికి నడిచాడు.

సాయంత్రం నాలుగు దాటింది. శాంత తన గదిలో కూర్చుని ఆనాటిరాత్రి మామ, అల్లుళ్ల మధ్య జరిగిన సంభాషణను గురించి ఆలోచించసాగింది. ఆ సంభాషణను ఆమె చాటుగా ఉండి పూర్తిగా విన్నది. 'బావ...! నిజంగా నిర్దోషి? అలా అనుకుంటే మరి నే చూసినదంతా ? ఏమో? చూసినవన్నీ యదార్థాలు కావాలని ఎక్కడుంది ? ఒకవేళ నేనే పొరబడుతున్నానేమో ? అలా అనుకోవడానికీ మనసొప్పడం లేదు. కళ్ళారా చూసినదాన్ని కాదని ఎలా అనుకోగలను ? హా ! ఇప్పుడు నేనేం చెయ్యాలి? బావ ఒకవేళ తప్పుడు పనులు చేస్తున్నా అతని విషయంలో యదార్థాన్ని వెల్లడించగల గుండె ధైర్యం ఎవరికుంది ? ఆ పరిస్థితులలో నిజానిజాలు ఎలా వెల్లడౌతాయి? నా మతిపోతూ ఉంది.' ఆ విధంగా ఆలోచిస్తున్న శాంతకు రామం పిలుస్తూ ఉన్నట్లు వినిపించి క్రిందకు వెడదామని లేచింది. అంతలోనే 'శాంతా ! శాంతా!'అని పిలుస్తూ ఆమె గదిముందుకు వచ్చాడు రామం.

ఇద్దరూ గది గుమ్మంముందు ఒకరికి మరొకరు ఎదురయ్యారు—

'శాంతా అలా తోటకు వెడదాం. నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి'— రామం.

'ఆరోజు నీవు, నాన్న మాట్లాడుకున్న విషయాలు నేను విన్నాను. అవికాక క్రొత్త విషయాలేవైనా ఉంటే నేను రావడానికి సిద్ధమే!'— నిర్లిప్తతతో శాంత.

'ఆ సంభాషణంతా విన్నావా ?'— విస్మయంతో రామం.

'పూర్తిగా విన్నాను.'

'ఇప్పుడు మాట్లాడబోయేది ఆ విషయం కాదు సరిక్రొత్త విషయం.'

'అయితే పద వెడదాం!'

ఇద్దరూ యిల్లుదాటి తోటవైపు నడిచారు—

తోట వేసుకున్న రామం ఆస్పత్రిలో సుందరం ఉన్నదీ లేనిదీ తెలుసుకొని వచ్చాడు. పది నిముషాల క్రితమే పొరుగూరి

మల్లెలు...

నుండి ఎవరోవస్తే వారితో పేషెంటును చూడడానికి వెళ్ళాడు.

రామం ఆస్పత్రికి ముందున్నతోటలో ఆస్పత్రికి కొద్దిదూరంలో రెండు కుర్చీలు వేయించాడు.

శాంత, రామం ఇద్దరూ కూర్చున్నారు. పూలచెట్లకు నీరు క్రమంగా పెడుతూవుండడం వల్ల పచ్చగా పెరుగుతూ పత్తుగా పూస్తున్నాయి. మల్లెల మధ్య పూసిన ఎర్ర గులాబీలు రామం మనసును ఆకర్షించాయి. తదేక దృష్టితో వాటిని ఒక్క క్షణం చూశాడు. వాటిని చూడగానే అతనికి శాంతా, శారదల మనస్తత్వాలు స్ఫురణకు వచ్చాయి. దాంతో ప్రస్తుత పరిస్థితులూ అతని మస్తిష్కంలో మెదిలాయి. శారద తన శక్తి సామర్థ్యాలను వినియోగించి ప్రభాకరాన్ని సన్మార్గవర్తనుడుగా మారేట్లు చేసి అతని తలిదండ్రులకు స్నేహితులకు సంతోషాన్ని కలిగించింది.

'మరి శాంతో? సంకుచితంగా ఆలోచిస్తూ మొదటినుండీ పెంచుకున్న తన ఆశలను త్రుంచివేసి, పై మెరుగులకు భ్రమసి ఒక క్లిష్ట సమస్యను సృష్టించింది. ఆ కారణంగా ఆమెకు, ఆమె తలిదండ్రులకు, నాకు మనశ్శాంతి దూరమైంది.

'అవును. మల్లెపూల తెల్లదనం వంటి స్వచ్ఛమైన, నిర్మలమైన మనస్తత్వం శారదది. ఎర్ర గులాబీల ఎరుపులాంటి ఉద్రేకపూరితమై, ఆవేశంతో కూడుకొన్న స్వభావం శాంతది.'



'ఏం బావా? ఏవో విషయాలు మాట్లాడాలని నన్ను తీసుకువచ్చి పూలమొక్కలను చూస్తూ ఏదో ఆలోచనలో పడిపట్లున్నావు?' శాంత ఎగతాళి చేసింది.

ఆలోచనలనుండి తేరుకొన్న రామం శాంతను చిరునవ్వుతో చూస్తూ 'అవును. చివరకు నీవు నాకు మిగిల్చినవి ఆలోచనలే.'

'అలా ఎందుకనుకుంటున్నావు బావా?'

'మరింకేమనమంటావు? మామయ్యా నేను మాట్లాడుకున్న మాటలు విన్నావు కదా! నా ప్రయత్నం విఫలమైంది. మామయ్య నా ప్రయత్నాన్ని పసిగట్టాడు. మరింకేదేనా ఆలోచన చేయవద్దూ ?'

'లాభం లేదు బావా! నాన్న ఒప్పుకోడన్న విషయం తేటతెల్లమైంది.'

'నీవు సుందరాన్ని ప్రేమిస్తున్నావు. బాగానే వుంది. అతను నిన్ను ప్రేమిస్తున్నాడా? లేక నీ వెనుక వున్న లక్షల విలువ చేసే ఆస్తిని ప్రేమిస్తున్నాడా ? ఆ విషయంలో నాకు అనుమానంగా వుంది.'

'నీకు ఆ అనుమానం ఎందుకు కలిగింది? అవును. ఈర్ష్య ఎంత గొప్పవారినైనా ఇట్టే మార్చివేస్తుంది. నీ ఆదర్శ భావాలు ఇంత సంకుచితంగా మారుతాయని నేను కలలోకూడా ఊహించలేను. ఈ విషయంలో నీ వొక్కడివైనా నాకు సహాయంగా నిలుస్తావనుకొన్నాను. కాని ఈ క్షణంలో నాకు ఆ ఆశకూడా అడుగంటి పోయింది. బావా చివరకు నీవుకూడా స్వార్థపరుడివేనని నిరూపించుకొన్నావు. ఇన్ని మాటలెందుకు? నేను సుందరాన్ని వివాహమాడడం నీకూ ఇష్టం లేదు. అలాగని స్పష్టంగా చెప్పరాదూ?' ఆవేశంతో నిష్ఠురపడుతూ అంది శాంత.

'ఎంత మాటన్నావు శాంతా ! త్వరపడి నన్ను అపార్థం చేసుకొంటున్నావు. నీకోసం నే నెటువంటి త్యాగాన్ని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. మామయ్య మనమధ్య అడ్డులేక పోయినట్లైతే మీ యిద్దరి వివాహాన్ని ఏనాడో జరిపించి ఉండేవాణ్ని. ఆయన క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని యింతదూరం ఆలోచించవలసి వస్తూఉంది. నీవు ఎక్కడున్నా, ఎవరిని వివాహమాడినా నీవు సంతోషంగా ఉండాలనే నా కోరిక. ఇంతకాలంగా సుందరం నడవడిని నేను కూడా అనుమానించలేదు. నీవద్ద ఆ ప్రస్తావన తేలేదు, శారద వ్రాసిన ఈ ఉత్తరం

చూస్తే నీకే అంతా అర్థమౌతుంది. ఈ ఉత్తరం చూపించడానికే నిన్ను యిక్కడికి పిలుచుకువచ్చాను' తనకు వచ్చిన రిజిస్టర్డు లెటరును శాంతకిచ్చాడు రామం.

ఆ ఉత్తరాన్ని అందుకున్న శాంత దానిని చదువసాగింది. ఎవరైనా వింటారేమోనన్న భయంతో నలు(ప్రక్కలా చూసిన రామం ఎవరూ లేరని నిర్ధారణ చేసుకొని తృప్తిగా నిట్టూర్చాడు.

'అన్నయ్యా!

నేను అనుకున్నదంతా నిజమైంది. సుందరం అక్కడ శాంత జీవితంతోనూ, యిక్కడ నా చెల్లెలు నీరజ జీవితంతోనూ చెలగాటా లాడుకున్నాడు. సుమారు వారం రోజుల క్రితం నేనూ, చినబాబుగారూ సినిమాకు వెళ్లాం. ఆ సినిమాకు సుందరం నీరజతో వచ్చాడు. ఆ తర్వాత నీరజను ఒంటరిగా కలుసుకొని ప్రశ్నించగా వారిద్దరూ కొంతకాలంగా పరస్పరం ప్రేమించుకుంటూ ఉన్నట్లు తెలిసింది. మరి సుందరం వీరిద్దరిలో ఎవరిని మోసం చేస్తున్నాడో నా కర్థం కావడంలేదు.

నేను, నీరజ, చినబాబుగారూ; ముగ్గురమూ అక్కడికి వస్తున్నాము, అక్కడికి వచ్చిన తర్వాత అన్నివిషయాలూ వివరంగా మాట్లాడుకుందాం. ఈ విషయం ఒక్క శాంతకుతప్ప మరెవ్వరికీ తెలియకుండా జాగ్రత్తపడు. సుందరానికి ఏమాత్రం అనుమానం కలిగినా మన ప్రయత్నాలన్నీ విఫలమౌతాయి.

మామయ్యగారికి, అత్తయ్యగారికి నా నమస్కారములు. శాంతకు నా శుభాకాంక్షలు తెలియజెయ్యి.

నమస్కారములర్పిస్తూ ముగిస్తున్న
నీ సోదరి. —శారద.

ఆ ఉత్తరం చదివిన తర్వాత శాంత రెండు నిముషాలు కళ్ళుమూసుకొని దీర్ఘంగా ఆలోచించింది.

'బావా! సుందరం యిలా చేస్తున్నాడన్న నమ్మకం నా కెందుకో కలగడంలేదు. చిన్నప్పటినుండీ చూస్తున్నాను. నేనంటే పడి చస్తున్నాడు.'

శాంత నమ్మలేదు. ఆలోచనలో పడింది. 'సుందరం యిలా ఎందుకు చేస్తాడు? ఇలా చేయడంవల్ల అతనికి ఏమిలాభం కలుగుతుంది? ఆ అమ్మాయిని మోసగిస్తున్నాడా? లేక నన్ను మోసగిస్తున్నాడా? శారద అనవసరంగా అలా వ్రాయదు. అవుతే సుందరం

ఉద్దేశం ఎలా తెలుసుకోవడం ? శారద వస్తూ ఉంది. భారమంతా ఆమెపై వేసి విశ్రాంతగా ఉంటాను. ఏమో ? శారదను మాత్రం ఎలా నమ్మడం ? మొన్న బావ హైదరాబాదు వెళ్ళి వచ్చాడు. అక్కడ యిద్దరూ ఏమి కూడబలుకుకున్నారో ? భగవంతుడా ! ఏమిటో నాకీ అగ్నిపరీక్ష ?'

'శాంతా ఏమాలోచిస్తున్నావు ?'— రామం.

'ఏం లేదు బావా! శారద, నీరజ వస్తున్నారుగా! వచ్చాక అన్ని సమస్యలూ పరిష్కరించబడతాయి.'—గంభీరంగా శాంత.

'మంచిది శాంతా! ఈ విషయం చెప్పడానికే నిన్ను పిలిచాను. ఇది నిండు జీవితాలకు సంబంధించిన విషయం. త్వరపడి, ఆవేశపడి నిర్ణయాలు చేసుకుంటే జీవితాంతం బాధపడవలసి వస్తుంది. నీవు నన్ను అనవసరంగా అపార్థం చేసుకుంటున్నావు. అందుకు నేను బాధపడను. నీకు రెండవ సారి చెబుతున్నాను. నీ సుఖసంతోషాలు కోరేవారిలో నేను మొట్ట మొదటివాడను. ఆ విషయం మాత్రం గుర్తుంచుకో !' అని ఒక్క నిముషం ఆగి 'సరే ! నేను వెడుతున్నాను. నీవు కూడా వస్తావా ?'—

'లేదు తర్వాత వస్తాను.'

శాంత చల్లగాలిలో, తోటలో పచార్లు చేయసాగింది. ఆమె యిదమిద్ధమని తేల్చుకోలేక అయోమయావస్థలో పడిపోయింది.

రామం తోట దాటి పంచాయితీ ఆఫీసు వైపు అడుగులు వేయసాగాడు.

*　　　*　　　*

'తల్లీ ఎన్నిరోజులకు చూశానమ్మా నిన్ను ? కులాసాగా ఉన్నావా ?' లోపలికి వస్తున్న శారదను ఆప్యాయంగా చూస్తూ ప్రశ్నించారు లక్ష్మయ్యగారు.

'కులాసాగానే ఉన్నాను. మీ ఆరోగ్యం ఎలా ఉంటూ ఉంది ?'

'నా ఆరోగ్యం మామూలుగా ఉంది. శాంత మొండి పట్టుదల నా మనశ్శాంతిని నాకు దూరం చేసింది.' విచారంతో అన్నారు లక్ష్మయ్యగారు.

'శాంత విషయంలో మీరు దిగులు పడకండి.'— శారద.

'రా తల్లీ, లోపలికి వెళ్లి మాట్లాడుదాం.' అప్పుడే లోపలినుండి బయటికి వచ్చిన పార్వతమ్మగారు శారదను లోపలికి తీసుకువెళ్లారు. లక్ష్మయ్యగారు వారిని అనుసరించారు.

ప్రభాకరానికి నీరజకు రమణయ్యగారి యింట్లో బస ఏర్పాటు చేశాడు రామం. ఎవరైనా వారి విషయంలో రమణయ్యగారిని ప్రశ్నిస్తే తమ బంధువులని చెప్పవలసిందిగా వారితో చెప్పాడు. నీరజ సుందరం దృష్టిలో పడకుండా తగిన ఏర్పాట్లు చేశాడు.

రెండవరోజు సాయంత్రం రమణయ్యగారి యింట్లో అంతా సమావేశమయ్యారు. శారద శాంతను నీరజకు, నీరజకు శాంతను పరిచయం చేసింది. ఒకరి ముఖంలోకి మరొకరు ఎంతో పరీక్షగా చూసుకొని చిరునవ్వుతో పరస్పర నమస్కారాలు చేసుకున్నారు.

'శాంతా! వీరు ప్రభాకరంగారు. బెనారస్ యూనివర్శిటీలో బి. ఏ. పరీక్ష వ్రాసి వచ్చారు. మన శారదకు కాబోయే భర్త.' రామం ప్రభాకరాన్ని శాంతకు పరిచయం చేశాడు.

'నీరజా! నీకు సుందరానికి పరిచయం ఎలా ఎప్పుడు జరిగిందో, అప్పటి నుండి యిప్పటి వరకు జరిగిన విషయాలన్నీ తు. చ. తప్పకుండా శాంతకు చెప్పు. ఆ తర్వాత జరగవలసిన కార్యక్రమాన్ని గురించి ఆలోచిద్దాం.'—శారద.

నీరజ మొదటి నుండీ జరిగినదంతా శాంతకు చెప్పి సుందరం తనకు వ్రాసిన ఉత్తరాలను చూపించింది.

శాంత ఒక్కొక్క ఉత్తరాన్నే చదువుతూ చదవగానే వాటిని నీరజకు యిచ్చి వేయసాగింది. ఆ విధంగా ఉత్తరాలన్నీ చదివిన శాంత ముఖం కోపంతో కంపించిపోతూ జేగురు రంగుతో మిలమిల మెరవసాగింది.

'ఛీ...! దుర్మార్గుడు. ఇంతకు తెగిస్తాడనుకోలేదు. నాకోసం ఎంటువంటి త్యాగమైనాసరే చేస్తానని బొంకాడు. ఇటు నన్ను మభ్యపెడుతూనే అటు నీరజ కళ్లు కప్పాలని చూస్తూ ఏక కాలంతో యిద్దరిని యిలా మోసగిస్తాడా ?' ఎంతో ఆవేశంతో అని శారదను చూస్తూ 'శారూ! అదేమిటో యిప్పుడే తేల్చేస్తాను' అంటూనే లేవబోయింది.

'అబ్బ! ఎందుకే నీకంత తొందర? ఈ నీ ఆవేశమే యింతమందిని యిన్ని చిక్కులపాలు చేసింది. కొంచెం శాంతించు. ఇది ప్రత్యక్ష సాక్ష్యం కాదుకదా? అతను తన తప్పు తాను సరిదిద్దుకొనే పరిస్థితి తీసుకువద్దాం.'

'అతను తప్పు దిద్దుకుంటే ఎవరికి కావాలి. దిద్దుకోకపోతే యెవరికి కావాలి?' కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ రామాన్నుద్దేశించి 'బావా! వెంటనే అతనిని ఉద్యోగం నుండి తీసివేయి. ఇంతకన్న ఎక్కువ అనుభవమున్న డాక్టరును మన ఆస్పత్రిలో నియమిద్దాం' అంది.

'శాంతా! ఒక ప్రక్క శారద నీ ఆవేశాన్ని తగ్గించుకోమని చెబుతున్నా వినిపించుకోవటం లేదేమిటి? ఈ విషయంలో ఆమె ఏం సలహాయిస్తుందో తెలుసుకున్న తర్వాత నీ కోపం చూపుదువుగాని' — చిరునవ్వుతో రామం.

'శాంతా! అన్నీ ఆలోచించి, ప్లాను వేసుకొనే యిక్కడికి వచ్చాం' అని తమ ప్లానును వివరించింది శారద.

'అవును ఆ విధంగానే తగిన శాస్తి జరిపి తెల్లముఖం వేసేలా చేయాలి. ఎంత చక్కని ప్లాను ఆలోచించావే శారూ? జరగబోయే పరాభవాన్ని ఎన్ని జన్మలకైనా మరచిపోలేడు.' శారదను ఎంతగానో శ్లాఘిస్తూ అంది శాంత.

శారద రామాన్ని చూస్తూ 'అన్నయ్యా! నేను, శాంత, చినబాబుగారు అలా మన తోటకు వెళ్ళి వస్తాం' అంది.

'అలాగే వెళ్లి రండి' అని రామం తనకేదో పని ఉందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

శారద, శాంత, ప్రభాకరం తోటవైపు బయలుదేరారు—

(ఇంకా ఉంది)



సింపిల్‌గా 'చిటా' పెట్టుకున్నందుకి మహా అంత రాద్ధాంతం చేస్తారే గదయ్యా!!
మీ రేనా?? నెంబరు 441?
అవును ఏం?
మీ నాన్న ఈ జవాబుల్ని కాపీ చెయ్యడానికి పంపాడు త్వరగా తీసుకోండి..



స్టెతస్కోపు టేబిల్‌మీద పెట్టి కుర్చీలో కూర్చుంటూ 'ఒక్కసారి మీ వారిని తీసుకు రావాల్సింది' అన్నాడు మాధవరావు.

'వారు రారండీ. ఎంతో చెప్పాను' అంది మాలతి డాక్టర్‌వైపు చూడలేక.

'ఏం? ఏం చేత?' ఆశ్చర్యపోయాడు మాధవరావు.

'వారికి డాక్టర్లన్నా మందులన్నా ఇష్టం వుండదు.'

'ఐసీ, తమాషాగా వుందే! పెళ్ళయి ఎన్నేళ్ళయింది?'

'నాలుగేళ్ళు.'

'పెళ్ళికి ముందునుంచేనా?'

తలవంచుకునివున్న మాలతి కళ్ళు ఎర్రబడ్డాయి. తలెత్తలేక, అయిష్టంగానే 'అవును' అంది సమాధానం చెప్పాలన్నట్టుగా.

'మీకెవరికీ తెలీదా?'

డాక్టర్ ప్రశ్నలొక్కొక్కటి ఈటెల్లా హృదయానికి తగిలి రక్తాన్ని చిందిస్తున్నాయి. చీరెకొంగుతో కళ్ళొత్తుకుని, ఎగసెగసిపడుతున్న వుద్వేగాన్ని ఆపుకోవడానికి విఫలప్రయత్నం చేసింది. ఆమె పరిస్థితి అర్థంచేసుకున్న మాధవరావు బాధపడ్డాడు అనవసరంగా గాయాన్ని కెలికానేమో ననుకుంటూ.

'మిసెస్ మాలతీ! అయాం వెరీసారీ! మీ మనసు నొచ్చుకునే విషయాలు అడిగాను' అన్నాడు సానుభూతి ధ్వనిస్తున్న స్వరంతో.

'ఫర్వాలేదు డాక్టర్. అది మీ వృత్తి ధర్మం' అంటూ తలెత్తి మొదటిసారిగా మాధవరావు వైపు చూసింది. వర్షించడానికి సిద్ధంగావున్న మేఘాల్లా వున్నాయి ఎరుపెక్కిన మాలతి నేత్రాలు. కొన్ని వందలమంది రోగులకు గుండెధైర్యం చెప్పిన మాధవరావుకు ఆ క్షణంలో పిరికితనం వెన్నుపూసలో కదిలినట్టనిపించింది. అతని హృదయం కరుణతో చెమ్మగిలింది.

'మీకు ఎలా ధైర్యంచెప్పాలో నాకు తెలియడం లేదు. ఇంత చిన్నవయసులో రగులుతున్న అగ్నిపర్వతాలను మీ గుండెల్లో, ఎలా చిరునవ్వుతో మోస్తున్నారో నా వూహకు అందడంలేదు. మీ కెవరిమీదా కోపంలేదా?'

'కోపమా? దేనికి?' అంది మాలతి పేలవంగా, నవ్వడానికి ప్రయత్నంచేస్తూ.

'పండంటి మీ పాతికేళ్ళ జీవితం పండిపోయే దశకు వచ్చినందుకు! మీ నెత్తిన నిప్పులకుంపటి పెట్టిన వాళ్ళమీద! చూస్తూ చూస్తూ మిమ్మల్ని నరకంలోకి లాగిన వ్యక్తిమీద!' అన్నాడు మాధవరావు కొంచెం ఆవేశంగా. అతనంత ఆవేశంగా మాట్లాడ్డానికి కారణం లేకపోలేదు. ఏడాదిక్రితం— రూపంలో కాకపోయినా పోర్మిలో సరిగ్గా మాలతిలానేవుండే అతని చెల్లెలి దారుణ మరణం; నాలుగు నెలలుగా అతనికి మాలతితో వున్న చనువువల్ల ఏర్పడిన ఆత్మీయత అతన్ని అలా మాట్లాడించింది.

'మన జీవితాలిలా అవడానికి కారణం మరెవరో అనే పెసిమిజంమీద నాకు అవగింజంత నమ్మకంలేదు. మనమొక పెద్ద యాపిల్‌పళ్ళ కుప్పదగ్గరికెళ్ళామనుకోండి. ఎవరికి దొరికిన యాపిల్ వాళ్ళు తీసుకుంటున్నారు. మనకు దొరికిన యాపిల్ మన ప్రక్కవాడి దానికంటే చిన్నదనో, వాడిపోయిందనో అని అనుకుంటే మన కసలు తృప్తే వుండదు. మనకు ప్రాప్తమున్నదింతేనని సరిపెట్టుకుని, ఆ వున్నదానిలోంచే ఆనందాన్ని పుట్టించుకోవాలి' అంది మాలతి, కళ్ళలో సుడులు తిరుగుతున్న కన్నీళ్ళతో.

'అలాంటివాళ్ళు నిజంగా సంతోషించ లేక, సంతోషంగా వున్నామని యితరులు అనుకోవాలని సంతోషిస్తున్నట్టు నటిస్తూ వుండి వుండొచ్చుగా?

సజీవ్ గారి వేయడానికి తగిన పదం దొరకని వ్యక్తిలా ఫిలిక్కిపడ్డట్టు మాధవ రావును చూసింది. ఏం చెప్తాలో తెలియ నంత కంగారుపడింది. కదులుతున్న పెదాల మధ్య మాటలు నలిగి బయటికి రాలేక పోయాయి.

'గుండెలమీద చెయ్యివేసుకుని, మీ అన్న య్యతో మాట్లాడుతున్నా ననుకుని నాకో ప్రశ్నకు సమాధానం చెప్తారా?'

భూమి కంపించినట్టు మాలతి నిలు వెల్లా కంపించింది. డాక్టర్ అడగబోయే ప్రశ్న కళ్ళ ముందు కదిలినట్టు అని పించింది.

'అడగండి' బరువెక్కుతున్న గుండెల్లో మంటల్ని చల్లార్చుకోవాలన్నట్టు అంది,

'నిజంగా మీ వారిమీద మీకు కోపం లేదా ?'

'దేనికి?'

'మీకే తెలియాలి! నాక్కావాల్సింది జవాబు, ప్రశ్నకాదు'

'మళ్లీ ఎప్పుడు రమ్మంటారు ?' వానిటీబాగ్ గట్టిగా రెండు చేతులతో వలుపుతూ లేచింది.

'మీ యిష్టం. సమాధానం చెప్పనే లేదు.'

'త్వరలో చెప్తాను. నేను వెడతాను డాక్టర్'

'మీ వారిని ఎలాగైనా ఒకసారి నా దగ్గ రికి తీసుకురండి. రమ్మంటే నేను మీ యింటికి వస్తాను.'

'ఆ సంగతి ఆలోచించి చెప్తాను'

'మంచిది ఆఫీసుకా?'

'ఏది తప్పినా అదిమాత్రం తప్పదుగా. వస్తా నండీ' అంది తనకు మనశ్శాంతి దొరి కేది ఆఫీసులోనే ననుకుంటూ మెట్లుదిగి వెడుతున్న మాలతిని చూస్తున్న మాధవ రావు అనుకున్నాడు— ఇలాంటి అమ్మాయిలు ఈ కాలంలోకూడా యింకా అక్కడక్కడ వున్నారు.

* * *

మాధవరావు ఆస్పత్రినుండి, నేరుగా మాలతి ఆఫీసుకు వెళ్ళింది. మెజనైన్ ఫ్లోర్లోవున్న టాయిలెట్ రూంలోకివెళ్ళింది. అద్దంలో మొహం చూసుకుంది. వుబ్బినట్టు న్నాయి కళ్ళు, కనురెప్పలక్రింద నల్లటి పీడలు, చవడ ఎముకలు కనిపిస్తున్నాయి. అలసిపోయినట్టుగా వుంది. పెళ్ళికిముందు తనలోవుండే చలాకీతనం, కళాకాంతులు ఏమ య్యాయి? పెళ్ళితో మాయ మయ్యాయా? డాక్టర్ మాటలు జ్ఞాపకం వచ్చాయి. తనకు ఆయనమీద కోపమా? కట్టలుతెంచు కున్న సముద్రపు వుప్పెనలా వచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక రెండు చేతులతో మొహం కప్పుకుని వలవల ఏడ్చింది. ఎవరో వస్తున్నట్టు అడుగుల చప్పుడవడంతో దబ దబ మొహం కడుక్కుని బ్యాగ్లోంచి రెండు టాబ్లెట్స్తీసి మింగింది. ఈ టాబ్లెట్స్ వల్లనే తను యింకా బ్రతక గలుగుతోందేమో ననిపిస్తుంది అప్ప డప్పుడు.

'మీరిక్కడున్నారా?' అంటూ తలుపు తెరుచుకుని వచ్చింది లలిత.

'ఇప్పుడే వచ్చానండీ' అంటూ నవ్వింది మాలతి.

'భలేవారే! అవతల మన యమధర్మరాజు ఫైరింజన్లా గొడవచేస్తున్నాడు. పదండి.'

కూనిరాగం తీస్తూ లలిత చేత్తో తల వెంట్రుకలు సగిచేసుకుని, చెరిగిన బొట్టు దిద్దుకుంది.

మాలతి ఆ ఆఫీసులోచేరి రెండేళ్ళ యింది. తన పని తను చూసుకుని మిగతా సమయాలలో తలవొంచుకుపోయే రకం మని షవడంవల్ల ఆమె అంటే ఆఫీసులో అంద రికీ మంచి అభిమానం, గౌరవం వున్నాయి. మాలతితో చాలా చనువుగా వుండేది లలిత, జానకి.

మిగతా వాళ్ళకు దూరంగా వుండాలని మాలతి ఎప్పుడూ అనుకోకపోయినా, వాళ్ళు మాలతితో అంత స్నేహంగా వుండలేక పోయారు. బహుశా మాలతి గంభీరత వాళ్ళను ఆమెకు దగ్గరగా రానివ్వకపోయి వుండొచ్చు.

లేడీస్రూంలో ఆఫీసులోవుండే అమ్మా యిల జనాభా అంతా జమ అవుతారు లంచ్ టైంలో. సినిమాలు, చీరెలు, సీరియల్సు, జోక్స్, కూనిరాగాలు మొదలయినవన్నీ ప్రతి నిత్యం వుంటాయి వాళ్ళ కార్యక్రమంలో.

— 'లలితా మీకొక సంగతి చెప్పడమే మర్చి పోయాను' అంది మాలతి నవ్వుతూ.

'ఇప్పుడు జ్ఞాపకం వచ్చినందుకు సంతోషం' అంది లలిత.

'ఎల్లుండి మా బాబు పుట్టినరోజు పండుగ చేసుకుంటున్నాం. మీరిద్దరూ మా యింటికి రండి.'

'అవశ్యం.' అన్నట్టు యివాళన్నా ఆ ఫోటోలు తెచ్చావా?' అడిగింది జానకి.

'తీసుకు రాకపోతే నన్ను చీల్చి చెండాడ తావని తెలుసు కాబట్టే. రాత్రి తీసి బ్యాగ్లో పడేశాను ఇదం చూడండి' అంటూ బ్యాగ్లోంచి పెద్ద కవరు తీసి వాళ్ళకిచ్చింది. దాదాపు ముప్ఫై ఫోటో లున్నాయి. ఒక్కొటొక్కటే చూస్తున్నారు శ్రద్ధగా.

'మీ ఆయనేమిటి యింత సన్నగా వున్నారు?' అంది లలిత.

'సరిగ్గా తిండిపెట్టదేమో? చెప్పినమాట వినదేమో!' అంది జానకి చిలిపిగా.

జానకి మాటలకు లలిత, మాలతి నవ్వు కున్నారు.

గేట్వే ఆఫ్ ఇండియా, మెరీన్డ్రైవ్, జూహూబీచ్, జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ, మల బార్ హిల్స్, చౌపాతీ, ఫ్లవరాఫ్ఫౌంటెన్ మొదలయినచోట్ల తాము తీయించుకున్న ఫోటోలగురించి, వాళ్ళ బాబు ఎంత అల్లరి చేసింది వివరంగా చెప్పింది మాలతి.

'ఫర్వాలేదు. మీవారికి కెమెరా పిచ్చివున్న దన్నమాట. నిన్నూ, బాబును చాలా చక్కగా తీశారు. నీకంటే నీ ఫోటో వెయ్యిరెట్లు అందంగా వుంది. ఏదో వాస్త రెకమెండ్ చేయించి మాఫోటోకూడా తీయించిపెట్టు. మీవారు తీస్తే కొంచెం బాగా కనిపిస్తా మేమో!' అంది లలిత.

'అవునవును ఈవిడగారిని చూసి ఎవరూ చేసుకోవడం లేదు, కనీసం మీవారు తీసిన ఫోటోను చూసయినా ఎవరన్నా ముందు కొస్తారేమోనని ఆశ' అంది జానకి కొంటెగా.

'షటప్' అంది లలిత గుర్రుగా.

ఇతరుల్ని ఏడ్పించడమంటే జానకికి చాలా సరదా. ఆవిద్య ఆమెకు వెన్నెతో పెట్ట కుండానే వచ్చింది. వాళ్ళిద్దరి సమక్షంలో ఎంతో వుషారుగావుండే మాలతి, తన సీటో చాలా పరధ్యానంగా వుంటుంది. పలువిధాల మనసులో ఆలోచనలు పరుచు కుంటాయి. ఆఫీసులోచేరిన కొత్తలో లలిత

నంగోత అడిగింది.

'మీరెందుకలా పరాకుగా, ఏదో పోగొట్టు కున్నట్టు వుంటారు?'

'అబ్బే ఏమీలేదండీ. రాత్రి సరిగా నిద్ర పట్టకపోవడంవల్ల కొంచెం బడలికగా వుంది' అంది మాలతి పెదాలమీద చిరునవ్వు అతి కించుకుని.

'మీకేదయినా విచారం ఉంటే అందులో కొంచెం మాకు యివ్వండి, పంచుకొంటాం. మీ రెప్పుడూ ఏదో అర్థం కాని సమస్యను గురించి ఆలోచిస్తున్నట్టు కనిపిస్తుంటారు' అని జానకికూడా అంది.

'అలాంటి దేమీ లేదండీ. పనిలేక అలా ఉంటాను' అంది మాలతి, హెళ్ళను మభ్య పెడుతున్నావ్ సుమా అని అంతరాత్మ ఆక్రోశిస్తున్నా.

వాళ్ళిద్దరు మళ్ళా ఆ విషయం ఎత్త లేదు. మాలతి తన స్వంత గొడవ లెప్పుడూ వాళ్ళకి చెప్పలేదు. వాళ్ళు అడగలేదు; అడ గాల్సిన అవసరమెప్పుడూ కలగలేదు కాబట్టి.

మల్లేపల్లి మెలికల మూల ఉన్న మాలతి ఇల్లు కనుక్కోడానికి వాళ్ళకి యించుమించు చిక్కు దారాల్ని సరిచేసినంత కష్టమైంది. బాబుకోసం కొన్న ప్రెజెంటు తీసుకొని రిక్షాకు డబ్బులిచ్చారు.

'ఇల్లు కనుక్కోగలరో లేదోనని భయపడు తున్నాను. జాగ్రత్తగా ఆ మెట్లు ఎక్కి పైకి రండి.'

'నీకా భయం అవసరం లేదు. రాజధాని నగరంలో ఇలాంటి వీధులు కూడా వున్నా యని అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి నువ్వూ, మీ బాబు మాకు యిచ్చిన ఈ మహత్తర అవకాశానికి ఇవే మా కృతజ్ఞ తలు' అంది జానకి సగం వంగి కుడిచెయ్యి పొట్టదగ్గర పెట్టుకుని.

'మీవారింకా విచ్చేయలేదా?' అంది లలిత ఆ యింటివి అన్ని కోణాల్లోంచి చూస్తూ.

'ఫ్యాక్టరీలో పనెక్కువగా వుందట. పర్మి షన్ తీసుకొని వస్తానన్నారు. ఈపాటికి రావాల్సిందే' అని మాలతి చెప్తుండగా ప్రకాశం వచ్చాడు.

మాలతి పరిచయం చేసి 'మాట్లా డుతూ వుండండి. ఇప్పుడే వస్తాను' అంటూ వంటింట్లోకి వెళ్ళింది. ముగ్గురే మిగిలారు కుర్చీల్లో. వాళ్ళకంటే ప్రకాశం మరీ బిడి యస్తుడు కావడంవల్ల సంభాషణ కళ్ళెం వేసిన గుర్రంలా బిగుసుకుపోయింది.

'బాబు నిద్ర పోతున్నట్టుంది.' నిశ్శ బ్దాన్ని చీల్చింది జానకి.

'ఊఁ' అన్నాడు ప్రకాశం.

ప్రకాశం సన్నగా, ఉఫ్‌మంటే కదిలేట్టు వున్నాడు. ఉక్కపోస్తుంటే, గొంగళిలాంటి ఆ బ్లేజర్‌కోటు, ఉలెన్ మఫ్లర్ ఎందుకు వేసుకున్నాడో వాళ్ళకి అర్థం కాక ఫ్యాషన్ కాబోలనుకొన్నారు.

'ఏ కంపెనీలోనండీ మీరు పని చేసేది?' ఈసారి లలిత వంతయింది.

'సనత్‌నగర్‌లో వో స్కార్ఫ్ ఫ్యాక్టరీ ఉంది. అందులో.'

'మీరు ఎమ్మే అటగా, మాలతి చెప్పింది. ఐ. ఏ. ఎస్. ట్రై చేయాల్సింది.'

'పిహెచ్‌డీ చేస్తున్న రోజుల్లో ఆ అయి డియా వచ్చింది. ఎక్కడెక్కడో తిరగాల్సి ఉంటుందని అమ్మగారు వద్దంటే ఆ ప్రయత్నం మానుకొన్నాను.'

ఫోల్డింగ్ టేబిల్‌మీద, ఫోటో స్టాండ్‌లో క్యాబినెట్ సైజు ఫోటో కనిపించింది వాళ్ళకి. ఆ ఫోటో పెట్టిన తీరు చూస్తే, ప్రకాశం తల్లికి ఎంత ప్రాముఖ్యత ఇస్తాడో తేలిగ్గా తెలిసిపోతుంది.

'మీ అమ్మగారు యింట్లో లేనట్టుందే?' ఆ మూడు గదుల యింటిని పరిశీలిస్తూ, ప్రకాశం జీతం ఎంత ఉండివుంటుందో అంచనా వేయసాగింది జానకి.

'మా సిస్టర్ ఢిల్లీలో ఉంది. మొన్నీ మధ్యనే వాళ్ళదగ్గరి కెళ్ళారు.'

మూడు ప్లేట్ల విజిటబుల్ పులావ్ ట్రేలో పెట్టుకుని వచ్చింది మాలతి. ప్లేట్లు ముగ్గురికీ యిచ్చి నీళ్ళు తీసుకు రావడానికి వెళ్ళింది.

చేతిలో వున్న ప్లేట్లో చెంచా కదు పుతూ 'నువ్వు కూడా వచ్చి కూర్చో కూడదూ?' అన్నాడు ప్రకాశం. మాలతి బాగా అలసిపోయినట్టు కనిపిస్తోంది. హృదయం తలంటిపోసుకుందేమో నల్లటి కురులు వెంపలమీదికి ప్రాకాలని చూస్తు న్నాయి.

'ఫర్వాలేదు, మీరు కానివ్వండి' అంది మాలతి.

'ఇవండీ వరస. మన మాట వినిపించు కోదు. రాత్రంతా జ్వరంతో బాధపడింది. చీకటితో లేచి, చన్నీళ్ళ స్నానం చేసింది. ప్రతి శుక్రవారం కాళ్ళకు పసుపు రాసుకుని తల స్నానం చేస్తుంది. ఆరోగ్యం సరిలే నప్పుడు అవన్నీ ఎందుకు చెప్పండి. తన మతమే తనదంటుంది. ఇవాళ మీరొస్తు న్నారని ఏవేవో అయిటమ్స్ చెయ్యాలంది. ఒక్కదానికి కష్టంగా వుంటుంది పని పిల్లను సాయంగా వుంచుకో అని చెప్పాను. తన చేతులమీదుగా చేసి మీకు పెట్టాలని ఈవిడ పట్టుదల. బాబుతో ప్రొద్దస్త మానం సతమతమవుతూ ఈ వంటొకటి పైగా' అన్నాడు ప్రకాశం నిష్ఠూరత ధ్వనిస్తున్న స్వరంతో. భార్యంటే అతనికి వున్న అనురాగం తొంగి చూస్తోంది అతని ప్రతి మాటలో.

'వూరుకోండి మీారు మరీనూ' అంటూ వంటింట్లోకి వెడుతున్న మాలతి మాటల్లో ఏదో అస్పష్టమైన కృత్రిమత్వం తొంగి చూసింది. ఇదమిద్ధమని జానకి నిర్ణయిం చుకోలేకపోయింది.

మైసూర్‌పాక్, కాఫీ కప్పులతో వచ్చిన మాలతిని చూసి లలిత అంది 'నువ్వింత ఆర్భాటం చేస్తావని తెలిస్తే మేము అసలు వచ్చేవాళ్ళం కాదు. నీకెందుకింత శ్రమ.'

మాలతి నవ్వింది. అలసటను కప్పిపుచ్చు కోవాలని తెచ్చిపెట్టుకున్నట్టుగా వుంది లలితకు ఆ నవ్వు. లలిత ప్రక్కనే కూర్చుంది మాలతి. ఒకసారి దీర్ఘంగా ఆయాసపడుతున్నట్టు శ్వాస విడిచి కఫ్ లింక్స్ విప్పుకుంటూ ప్రకాశం లేచి ప్రక్క గదిలోకి వెళ్ళాడు.

'మీ బాబేడీ ?'

వుయ్యాలలో పడుకుని నిద్రపోతున్న బాబును తీసుకుని వచ్చింది మాలతి.

'అచ్చు నీ పోలికే' అంటూ లలిత బాబు బుగ్గలు నిమిరింది.

అంతవరకు నిద్రపోతున్న బాబు కళ్ళు తెరిచి నవ్వసాగాడు.

పాలబుగ్గలు, పచ్చటిరంగు, బొద్దుగా, అందంగా, ఎత్తుకోవాలనిపించేట్టు వున్న బాబును చూసి చేతులు చాపింది జానకి. పదినిమిషాలు బాబుతో కాలక్షేపం చేశాక—

'వీడికోసం తెచ్చాం. ఏదమ్మా చెయ్యి చాపు. తీసుకో' అంటూ జానకి తాము తెచ్చిన ప్యాకెట్ వాడి చిట్టి చిట్టి చేతు

నకు అందించినట్లు చేసింది నవ్వుతూ.

'ఇహ మేం వస్తాం' అంటూ యిద్దరూ లేచారు.

ముగ్గురూ మెట్లవద్ద కొచ్చేసరికి, ప్రక్కగదిలోంచి విపరీతమయిన దగ్గుల శబ్దానికి జతగా ఏదో వస్తువు క్రిందపడిన శబ్దమయింది. అలానే నిలబడిపోయింది మాలతి కొయ్యబారిపోయినట్టు. మొహంలో ఆందోళన కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఏదో నేరం చేసినదానిలా వాళ్ళ వైపు చూసింది. వాళ్ళిద్దరికీ అర్థంకానట్టు ఒకరి నొకరు చూసుకుంటుండగా 'ఇప్పుడే వస్తాను' అంటూ మాలతి కంగారుగా పెద్ద పెద్ద అంగెలేసుకుంటూ ఆ గదిలోకి వెళ్ళింది.

మాలతి వెంట తామూ వెళ్ళడమా మానడమా అని వాళ్ళు అనుకుంటుండగా—

'...నాకేం ఫర్వాలేదు ... నువ్వెళ్ళు... వాళ్ళేమనుకుంటారు?' అస్పష్టంగా గుస గుస లాంటి ప్రకాశం కంఠం వినిపించింది. మరో నిమిషం తర్వాత మాలతి వచ్చింది.

'ఏదో సూట్‌కేస్ పడిపోయింది' అంది తనే. అది అబద్ధమని ఆమె మాటల్లో వున్న అసందర్భత్వం చూపుతోంది. అను మానాలు అల్లుకుంటున్న మనసులతో ఏవేవో పిచ్చిగీతల్లా వంకర్లు తిరిగిపోతున్న ఆలోచ నలతో వాళ్ళు మెట్లు దిగుతూ 'మేం వస్తాం. నువ్వు వుండిపో' అన్నారు.

రిక్షా ఎక్కబోతూ జానకి ఒకసారి మేడమీదికి చూసింది. బాల్కనీలో నిల్చబడి కళ్ళు తుడుచుకుంటున్న మాలతి గబు క్కున అక్కణ్ణుంచి తప్పుకుంది, తనను జానకి చూసిందేమోననుకుంటూ.

* * *

మర్నాడు ఆఫీసులో. నిన్నటి సంఘటన గురించి అడుగుదామనుకుంది జానకి. మాలతి కావాలని ఏదో దాస్తుందా? తనడిగితే చెప్తుందా? ఏదో వుండివుంటుందని తను భ్రమపడుతుందేమో? తెలుసుకుంటే? స్నేహితురాలిగా తన కర్తవ్యం తను నెర వేర్చాలి. పదకొండున్నరయినా ఆ రోజు మాలతి ఆఫీసుకురా లేదు. లీవ్ పెట్టిందని లంచ్ టైంలో తెలిసింది. ఇంత హఠా త్తుగా సెలవెందుకు పెట్టినట్టు? నిన్న జరిగినదానికి ఈ లీవ్‌కు ఏదయినా సంబంధం వుందా? ఆ విషయం రేపు అడిగితే? ఏమను కుంటుందో?—మరుసటిరోజు మాలతి ఆఫీ సుకు వచ్చింది. కానీ, మాలతి మొహం చూశాక అడగడానికి తటపటాయించింది జానకి. రాత్రంతా నిద్రలేనట్టు కళ్ళు ఎర్రగావున్నాయి.

'నీ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు నేనెప్పుడూ అడగలేదు. ఇవాళ ధైర్యం చేసి అడుగుదామనుకుంటున్నాను నువ్వేమీ అనుకోనంటే' అంది జానకి.

క్రింది పెదవిని మునిపంటితో నొక్కి పట్టి 'ఏమీ అనుకోను' అన్నట్టు తల వూపింది.

'నిజం చెప్పు మాలా! నువ్వేదో దాచి పెడుతున్నావు. మానసిక సంక్షోభాన్ని కప్పి పుచ్చుకుని మా ముందు చిరునవ్వుతో వుంటావు. నిన్నింతగా కలవరపెడుతున్న ఆ బాధ ఏమిటో మాకు చెప్పు. ప్లీజ్.'

'అరె! ఏమిటి నీ వెర్రి ప్రశ్నలు. ఈ దిన్నగావుండి రాత్రి అసలు నిద్రపట్ట లేదు. బహుశా అందువల్ల అలా కనిపిస్తు న్నానేమో!'

'మభ్యపెట్టాలని చూస్తున్నావు గదూ?'

'నామాటమీద నీకు నమ్మకం లేదన్న మాట?'

'నమ్మమంటావా?'

'ఒట్టు' అంటూ నవ్వింది మాలతి.

ఒట్టుమీద జానకికి గట్టి నమ్మకం వుండడంవల్ల, విశ్వాసం, గూడుకట్టుకున్న కళ్ళతో నిజాన్ని ఒత్తి పలికినట్టుగా చెప్పిన మాలతి మాటలు నమ్మడంవల్ల జానకి ఆ విషయం మరెప్పుడూ ఎత్తలేదు. క్రమక్రమంగా మరిచిపోయింది.

నాలుగునెలలు గడిచిపోయాయి ఒడి దుడుకులు లేకుండా.

ఆరోజు మాలతి ఆఫీసుకురాలేదు.

రెండోరోజు వచ్చింది. నీరసంగా, అలి సటగా కనిపించింది.

'నిన్న రాలేదేం?' అడిగింది జానకి.

'రెండురోజుల్నుంచి మావారికి సుస్తీ చేసింది. ఇవాళకూడా లీవ్ అప్లయిచేసి పోదా మనివచ్చాను. అరె! పత్రిక వచ్చినట్టుందే!' అంటూ ఆతృతగా పేజీలు తెరిచి సీరియల్ నవల పదినిమిషాల్లో పూర్తిచేసింది. తెలుగు వారపత్రికలంటే మాలతికి చాలా యిష్టం. ఆదరా బదరా ఆఫీసులోనే పైపైన పేజీలు తిప్పేంత వరకు ఆమె మనసు మనసులో వుండదు.

'డాక్టర్‌గారి దగ్గరికి వెళ్ళారా?'

'పుదయమే డాక్టర్ మాధవరావుగారు వచ్చి చూసిపోయారు. రేపు ఆఫీసుకువస్తాను' అంటూ లేచింది మాలతి.

మూడోరోజు—బుధవారం— మధ్యాహ్నం ఒకటిన్న రయింది.

'మాలతమ్మగారు మీకు ఫోన్ చేశారు' అంటూ ప్యూన్ వచ్చాడు.

రాస్తున్న పెన్ మూసి లేచింది జానకి. రిసీవర్ అందుకుని 'హలో' అంది.

నిమిషంపాటు అవతలి వైపునుంచి మాలతి చెప్పిన మాటలు విన్న జానకి అవ యవాలు చెమటతో ముద్దయిపోయాయి.

'సరే' అంటూ వణుకుతున్న చేతులతో రిసీవర్ క్రెడిల్‌మీద పెట్టి, తొందర తొందరగా లలిత వద్దకెళ్ళింది. ఫైల్సు సర్దుతున్న లలిత, జానకి వాలకం చూసి విస్తుపోయింది. దీర్ఘంగా నిట్టూర్చి 'మాలతి ఫోన్ చేసింది. డాక్టర్ మాధవరావు గారిని అర్జంటుగా తీసుకురమ్మంది' అంది జానకి.

'ఎందుకని? ఏం చెప్పింది?'

'ఏడుస్తూ చెప్పింది అతి కష్టం మీద. నాకు సరిగా బోధపడలేదు. మనం వెంటనే డాక్టరుగార్ని తీసుకునిపోదాం పద.'

'మరి ఆఫీసు...'

'ఆఫీసరుగారికి చెప్పి పోదాం.'

ఆఫీసరు అనుమతి తీసుకొని యిద్దరూ అక్కడికి దగ్గర్లోనే ఉన్న డాక్టర్ మాధవ రావు ఆస్పత్రికి వెళ్ళేసరికి, అదృష్ట వశాత్తు ఆయన తీరిగ్గా కూర్చుని వున్నాడు. ఒకటి రెండుసార్లు మాలతితో వచ్చి వుండ డంవల్ల మాధవరావు గుర్తుపట్టి 'ఏమి టండీ చాలా కంగారుగా వున్నారు?' అన్నాడు.

'మిమ్మల్ని అర్జంటుగా వెంటబెట్టుకు రమ్మని మాలతి ఇప్పుడే ఫోన్ చేసింది. పదండి సార్' అంది జానకి.

'సరే' అంటూ మాధవరావు డిస్పెన్సరీ మూశాడు.

'టాక్సీలో వెడదాం.'

'నా సొంత కారుంది.' వెనక సీట్లో యిద్దరూ కూర్చున్నారు.

మాధవరావు కారు స్టార్ట్ చేశాడు.

'మాలతి చాలా భయపడు తున్నట్టుంది.

ప్రకాశంగారికి మీరు ట్రీట్ చేస్తున్నారు గదండీ?'

'డాక్టర్లు ట్రీట్ చేసే దశను ఆయన ఎప్పుడో దాటిపోయాడు.'

'అంటే...?'

'ఆయనకు పల్మనరీ ట్యూబర్ క్యులోసిస్ వుంది.'

పిడుగు పడ్డట్టు వాళ్ళిద్దరు షాక్ తిన్నారు. నమ్మలేనట్టు డాక్టర్ వైపు చూశారు.

'మీరు చెప్పేది మాలతి భర్త విషయమేనాండీ?'

'యస్. అతనే. అతనికి టీబీ—అదీ చాలా అడ్వాన్స్డ్ స్టేజిలో వున్నట్టు మీకు తెలియదా?' అన్నాడు మాధవరావు ఆశ్చర్యంతో.

'మా కసలు తెలియదండీ! మాలతి మా కెప్పుడూ చెప్పలేదు!' అంది జానకి ఇంకా షాక్‌నుంచి తేరుకోలేక.

'ఏడాది క్రితం భర్తను నా దగ్గరికి తీసుకొచ్చింది, చూడమని. అప్పటికే బాగా ముదిరిపోయి వుంది. అన్ని రోజులు అశ్రద్ధ చేసినందుకు కోప్పడి శానిటోరియంలో చేర్పించమన్నాను. ఉద్యోగం, పిల్లాడితో కష్టమండీ అంది. అలా అయితే అతన్నొకణ్ణే చేర్పించమన్నాను. మాలతిని వదిలి ఒక్క క్షణంకూడా వుండలేను, శానిటోరియంలో చేరను అన్నాడు అతను. మంచి మందులు, యింజక్షన్లు, పుష్టికరమైన ఆహారం, ఫ్రీక్వెంట్ మెడికల్ చెకప్స్ తీసుకుంటూ వుండాలని చెప్పాను. మందులు, యింజక్షన్లు అంటే అతనికి అసహ్యమట. చచ్చినా మందులు తినను అని మొండి పట్టు పట్టాడు. అతని విచిత్ర మనస్తత్వానికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. నేను ఎంతో చెప్పాను. శానిటోరియం, మందులపట్ల తీవ్రమయిన విముఖత్వం చూపాడు. టీబీ చాలా ప్రమాదకరమయిన వ్యాధి అనీ, తొందరగా యితరులకు వ్యాపించే గుణం వుందనీ అందువల్ల కొంచెం జాగ్రత్తగా వుండాలనీ, ఆ అమ్మాయికి హెచ్చరించాను. నాలుగేళ్ళనాడే నా జీవితం నాశనమయిపోయింది డాక్టర్! నిండా మునిగిన నాకు జీవితమంటే తీపి ఏనాడో చచ్చిపోయింది అంది. ఆ అమ్మాయి పరిస్థితి నాకు చాలా బాధ కలిగించింది...'

అంటూ మాధవరావు కారు ఆపాడు. చౌరాస్తాలో ట్రాఫిక్ జాం అయినట్టుంది. పోలీసులు హడావిడిగా సైకిల్‌వాళ్ళను, రిక్షా వాళ్ళను ఆపేస్తున్నారు.

మాలతి జీవితంలో యింత విషాదం దాగి వుందనీ; అది కనిపించనీయకుండా కప్పిపుచ్చుకుంటుందనీ, మాధవరావు చెప్పిన కథ విన్న వాళ్ళకు గుండెలు బిగుసుకు పోయినట్టయింది. మాలతి గుండె ధైర్యం వాళ్ళను విభ్రాంతుల్ని చేసింది. తమతో ఎంతో స్నేహంగా వుంటూ ఈ రహస్యాన్ని ఎందుకు దాచిపెట్టినట్టు? ఇతరులు చూపే సానుభూతిని స్వీకరించడం యిష్టంలేని ఆత్మాభిమానంవల్లనా? ఏమైనా సరేననే మొండి ధైర్యం చేతనా?

'అతనికి ఎంతకాలంనుంచి ఈ టీబీ వుందండీ?' అడిగింది లలిత.

'ఐదారేళ్ళనుంచి వుండి వుండాలి.'


'అంటే...పెళ్ళికి ముందునుంచేనా?'

'అవును. అలాంటి భయంకరమైన వ్యాధితో వున్న అతనితో పెళ్లిచేసి ఆ అమ్మాయి తలిదండ్రులు ఆమె జీవితం నాశనం చేశారు' అన్నాడు డాక్టర్ కారు స్టార్ట్ చేస్తూ.

'బహుశా వాళ్ళకు తెలిసి వుండదు. చూస్తూ చూస్తూ ఏ తండ్రీ అలాంటి ఘోరం చెయ్యడు. అతని తలిదండ్రులు అసలు అతనికి పెళ్ళి చేయకుండా వుండాల్సింది' అంది జానకి.

'తమ కొడుకు పెళ్ళి జరగాలి, కోడల్నీ, మనుమరాళ్ళను చూసుకుని ఆనందించాలని ప్రతి తలిదండ్రులు అనుకోవడం సహజం. కానీ చదువు, సంస్కారం వుండీ అతను మరీ అమాయకురాలి మెడలో తాళి కట్టడానికి ఎలా అంగీకరించాడో నాకు అర్థం కావడంలేదు. తనొక నిండు జీవితాన్ని అగ్నిగుండంలోకి ఈడుస్తున్నాననే ఆలోచన అతనికెందుకు తట్టలేదో?' అంది లలిత.

'మాలతి లాంటి ఆడపిల్లలు ఈ కాలంలో చాలా తక్కువమంది వుంటారు. భయంకరమైన రోగంతో వున్న భర్తతో కాపరంచేస్తూ ఒక్కనాడు కూడా ఆ అమ్మాయి తన దురదృష్టాన్ని గురించి విలపించలేదు. తన ప్రాప్తంకొద్దీ తనకు దొరికిన గరళాన్ని అమృతంగా మింగక తప్పదని ఆమె నాతో ఎన్నోసార్లు అంది. కనీసం బాబు భవిష్యత్తును గుర్తు పెట్టుకుని, బాబును దూరంగా ఎవరి దగ్గరయినా వుంచమని చెప్పాను. తనకెవరూ లేరంది. నాలుగు నెలల తర్వాత మొన్న ప్రకాశాన్ని మళ్ళా నా దగ్గరికి తీసుకొచ్చింది. వూపిరితిత్తులు పూర్తిగా శిథిలమైపోయాయి. ఒకటి రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకడని చెప్పాను. నైంటీనైన్ పాయింట్‌నైన్ పర్సెంట్ ఆశలు వదులుకోవాల్సిందే. మజిలీలో చివరి అడుగులు వేస్తున్న మనిషికి మందులు పనిచేయవు' అంటూ మాలతి యింటి ముందు కారు ఆపాడు.



ఆహుతి

మెట్లెక్కి ముగ్గురూ పైకి వచ్చారు. చెదిరిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని తలెత్తి జానకి గదిలోకి చూసింది. ముందు గదిలో యిద్దరుముగ్గురు ఆడవాళ్ళు నిలబడి వున్నారు.

ప్రక్కగదిలో మంచంమీద ప్రకాశం పడుకుని వున్నాడు. గచ్చుమీద మంచం పట్టెను ఆనుకుని మాలతి కూర్చునివుంది. ఆమె మొహంలో ఎలాంటి భావాలు కన పడడంలేదు.

డాక్టర్నిచూసి లేచి 'రండిడాక్టర్. ఇప్పుడే అలా నిద్రపోయారు' అంది మాలతి.

డాక్టర్ ఒకసారి మాలతివైపు చూసి ప్రకాశం వొంటిమీద చెయ్యివేసి అంతా అయిపోయిందన్న అర్థం స్ఫురించేలా తల వూపాడు. పిడుగువిరిగి మీదపడినట్టు జానకీ, లలిత స్తంభించిపోయారు నోటమాటరాక.

'నే వస్తాను. మీరు ఆమెకు కొంచెం ధైర్యం చెప్పండి' అంటూ తలవొంచుకుని డాక్టర్ వెళ్ళిపోయాడు నిశ్శబ్దంగా.

'మాలతీ పద ఆ గదిలో కూర్చుందాం' అంటూ ప్రకాశం మృతదేహంవున్న గది లోంచి మాలతిని తీసుకొచ్చారు వాళ్ళు.

'వారు యిప్పుడే పడుకున్నారు. ఉక్క పోస్తున్నట్టుంది, ఫ్యాన్‌వేస్తాను' అంది మాలతి. కళ్ళలో అరబొట్టుకూడా కన్నీరు లేకుండా, భర్త యింకా బ్రతికే వున్నాడన్న భ్రమతో మాట్లాడుతున్న మాలతి ధోరణి చూస్తుంటే జానకి గుండెలు బ్రద్దలయాయి.

'మేం చూస్తాంలే. నువ్విక్కడే కూర్చో' అంది లలిత.

'ఉష్ ఉక్కగా వుంది. బాగా అలిసి పోయారు. నీ తీయంలో ఫ్యాన్ పెట్టు. నొప్పులుగా వున్నాయి కాళ్ళుపట్టు మాలా అంటే యిప్పటిదాకా కాళ్ళుపట్టి పాదాలకు అలిక్ నూనెరాసి హార్లిక్స్ యిచ్చాను' అంటూ మాలతి పిచ్చిదానిలా ఏదేదో మాట్లాడు తోంది. లలితకు భయంవేసింది. ఇన్నేళ్ళ నుంచి మాలతి తన గుండెల్లో దాచుకున్న కన్నీరంతా ఏమయింది?

'మీరు తొందరపడకండి ఆమె ప్రాణాలు పోయాయి తల్లీ. అప్పటినుంచి

(48 వ పేజీ చూడండి)

మనమూ – మన తలనొప్పి

సాధారణంగా మన నిత్య జీవితంలో తరుచూ సంభవిస్తూ వుండే రోగాల్లో జలుబు, రొంప, దగ్గు, తలనొప్పి అంటూ రానివారెవరూ వుండరు. ఇవేవీ ఆధివ్యాధులు కాకపోయినా వచ్చినవి పోయే వరకూ మనిషిని నానా హైరానా పెడతాయి. (నిజమే మరి! ఇలాంటివి మన కొస్తుంటేనే కదూ మెడికల్ షాప్స్, కంపెనీలు వృద్ధిచెందేది). 'మీరు తలనొప్పిచే బాధపడుచున్నారా?' 'ఆస్ప్రో లిజీయే,' 'గుణవణింగలే' అంటూ మందులకు పత్రికల్లోను, రేడియోల్లోను ప్రసారాలు సాగుతూండటం మనందరకూ విదితమే. వీటివల్ల మనకి ప్రాణభయం ఏ మాత్రం లేకపోయినా — ఏ పనీ చేయబుద్ధి పుట్టదు. తినే పదార్థాలు సయించవు. మనసంతా విసుగ్గా వుంటుంది. పారిశ్రామికంగా ఎన్నోగంటల కాలం (మాన్‌అవర్స్) తత్ఫలితంగా మనం నష్టపోతూంటాం.

వైద్యుల అంచనా ప్రకారం ప్రపంచ మానవ జనాభాలో సుమారుపదిశాతం ఎపుడూ 'తలనొప్పి'చే ఖచ్చితంగా బాధపడుతూంటారట. మనలను తరుచుగ పరామర్శించే ఈ 'తలనొప్పి' సోదరుడు మరోవాడు 'అరతలనొప్పి'. అంటే తలనొప్పివల్ల కలిగే బాధలో సగం మాత్రమే దీనివల్ల వుంటుందని కాదు అర్థం. నిజానికిది భరించరానంతటి, ఒక్కొక్కసారి తల పగిలేంతటి తీవ్రంగా వచ్చే తలనొప్పితరం. ఆంగ్లంలో దీన్ని 'మైగ్రెయిన్' అంటారు. గ్రీకు భాషలో 'హెమి' అంటేసగం అని 'క్రేనియో' అంటే 'కపాలం' అని అర్థం సూచిస్తూ రూపాంతరం చెందిన ఈ పదం నిజానికి ఫ్రెంచివాళ్ళస్వంతం.

శతాబ్దాల క్రితం నుండీ మానవ సమూహాన్ని పట్టి పీడించే ఈ'తలనొప్పి'మరియు'అరతలనొప్పి' నేటి శాస్త్ర పరిశోధనల్లో పరిశోధకుల నాకర్షించిన అంశాలేనని చెప్పవచ్చు. నిజానికి కొన్ని ఆహార పదార్థాలు (చాకొలెట్లు, ఆల్కహాలు, గుడ్లు, వెన్న ఇత్యాదులు.) మితిమీరి తినటం వల్ల తలనొప్పి వస్తుందన్న నమ్మకం చాలకాలంపాటు మధ్య ఐరోపావాసుల్లో వుండేది చాలమంది దీన్నొక మూఢనమ్మకంగా కొట్టి పారేసే వారు. కానీ ఈ అంశంపై ఒక లండన్ హాస్పిటల్‌లో ప్రయోగాలు గావిస్తున్న 'వెల్కంట్రస్టు'కు చెందిన డాక్టర్ ఎడ్డా హానింగ్‌టన్ పరిశోధనా ఫలితాలు పై నమ్మకం. నిజమేనని ధృవీకరించాయి. అంతేగాక చాల ఆహార పదార్థాల్లో ప్రకృతి సిద్ధంగానే లభ్యమయ్యే 'టైరమీన్' అన్న పదార్థం ప్రధానంగా రోగుల్లో 'శిరోవేదన' సంభవించటం ఆవిడస్వయాన గమనించిందట. మరియు డాక్టర్ బార్జర్, ప్రొఫెసర్ డేల్‌లు జీవకణాల్లో ఉత్పన్నమయ్యే స్రావాల్లో ఒకటయిన 'హిస్టమైన్' అన్నపదార్థం తలనొప్పికీ, తత్సంబంధమయిన బాధలకూ కారణమని వెల్లడించారు. ఇలా వెల్లడించబడ్డ అంశాలు నిజానికి శాస్త్రీయంగా కూడా ఏ మాత్రం సత్యదూరం కావు. ఎందుకంటే రక్తనాళాల ఆకారపరిమాణాల్లో మార్పులకొందించే ఈ జీవరసాయనాలవల్ల, శిరోభాగంలోని రక్తనాళాలు మొదట సంకోచించి తర్వాతిగ వ్యాకోచించటంవల్ల తలనొప్పి వచ్చే అవకాశాలు లక్షణంగా వున్నాయి.


సుమారు 125 గ్రాముల ప్రమాణంగల టైరమీన్ టాబ్లెట్లు ఒక్కొక్క వ్యక్తికి ఇస్తూ రోగులపై ఈ మధ్య డాక్టర్ హానింగ్టన్ చేసిన ప్రయోగాల్లో 85 సందర్భాలపై సుమారు 65 సార్లపైగానే శిరోవేదన రావటం గమనించబడింది. కానీ అదే ప్రమాణంలో ఇవ్వబడ్డ లాక్టోస్ టాబ్లెట్లు ఆ వ్యక్తుల్లో (ముచ్చటగ) మూడుసార్లుమాత్రమే తలనొప్పిని కలిగించాయట. అంతేగాక ఈ తలనొప్పులు— ముఖ్యంగా 'అరతలనొప్పి' సాధారణంగా వస్తూండే వారి మూత్రంలో 'టైరమీన్' ప్రమాణం సాధారణ వ్యక్తుల్లో కన్నా తక్కువగానే వుంటుందని గమనించబడ్డది. ఈ అంశం ఆధారంగా ఆ రోగుల శరీర ధర్మాల్లో టైరమీన్ మెటబాలిజం తప్పక లోటు పాట్లను కలిగి వుంటుందనీ, ముఖ్యంగా శిరోవేదనచే బాధపడేవారిలో ఈ 'టైరమీన్' అవశ్యకంగా శరీర భాగాల్లోనకే నిలిచి వుంటుందని డాక్టర్ హానింగ్టన్ దృఢమైన విశ్వాసం.


ఆహార రూపంగ మన శరీర ధర్మాల్లోను, మెటబాలిజంలోను ఇలాంటి పరిస్థితులకు దారితీయించే పదార్థాలు 'టైరమీన్' లాంటివే గాక మరింకా ఎన్నో ఈ మధ్యే కనుగొనబడ్డాయి. అంతేగాక రకరకాల ఐసోటోపులుగ 'అమైన్' పదార్థాలను రోగులకిస్తూ వారి 'అమైన్ మెటబాలిజం'లోని అన్నిరకాల జీవరసాయన చర్యలపైనా ఈనాడు ఎన్నో అమెరికన్ మరియు బ్రిటిష్ వైద్య బృందాలు ప్రత్యేక పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. (ఒక్క తలనొప్పి మీదే ఇన్ని పరిశోధనలు చేసేవారు చంద్రుడిపై కాలిడటంలో ఆశ్చర్యం ఏముంది?)

ఈ సందర్భంగా గత సంవత్సరమే వెలువడ్డ మరొక ఆసక్తికరమైన వార్త! లండన్ యూనివర్శిటీ—ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ న్యూరాలజీలో కెమికల్ పాథాలజీ విభాగానికి చెందిన డాక్టర్ హెరాల్డ్ కర్జ అభిప్రాయం ప్రకారం మనకు వయస్సు మీరే కొద్దీ 'అమైన్ల' ప్రభావం శరీరంలో తగ్గుముఖం పట్టటంవల్ల 'తల నొప్పి' వృద్ధుల్లోవచ్చే అవకాశాలు తక్కువగ వుంటాయట తరుచుగ. ఇదెంతవరకూ నిజమో ముమ్ముందు కొనసాగే పరిశోధనలే ధృవీకరించాలి మరి ! వెయిట్ వెయిట్ ఎండ్ సీ!

నేడు జీవరసాయనికంగానూ, శరీర ధర్మ విజ్ఞానరీత్యానూ తలనొప్పిని గూర్చి తీవ్రంగా కొనసాగే శాస్త్ర పరిశోధనలు ఫలవంతాలై త్వరలోనే ఈ బాధను పూర్తిగ తొలగించే రీతిగ పరిణమిస్తాయని ఆశిద్దాం! (ఇవే ఫలవంతాలయితే ఆస్ప్రో లాంటి కంపెనీల భవిష్యత్తేమిటి ???)

—పి. రమేష్‌నారాయణ ●





2

భగవంతుని లీలలు చాలా చిత్రంగా వుంటాయి. అందులో ఈ వివాహాలు కుదర్చడంలో కొంత కరుకుదనం మిళితమయే వుంటుంది. కొందరు కష్టాలనుభవించడానికే పుట్టారా అనిపిస్తుంది. ఎవరో ఒక గొప్పవ్యక్తి అన్నట్లు కొందరి జీవితాలలో కష్టాలు వివాహంతో అంతమవుతాయి, మరి కొందరికి వివాహంతో ప్రారంభమవుతాయి.

పార్వతి రెండోరకానికి చెందిన వ్యక్తి. పార్వతి తండ్రి వెంకటశాస్త్రి మద్రాసులో పెద్ద లాయరు. ఆయన గొప్ప సంస్కారి. ఉన్నత భావాలు గల మనిషి. ఆయన భార్య రాజమ్మ కూడా భర్తకి చేదోడు వాదోడుగా వుంటుంది. ఆయనకి అన్ని విషయాల్లోనూ సలహాలనిచ్చి అభిప్రాయాలను పంచుకునే మనిషి. భర్త ఏంచేసినా తన మంచి, బిడ్డలమంచి కోరేనని ఆవిడ అభిప్రాయం. వెంకటశాస్త్రిగారామెను కట్నంలేకుండా వివాహం చేసుకున్నారు. వారిది సుఖప్రదమైన సంసారం.

వీరికి ముగ్గురే సంతానం. పెద్దవాడు రామకృష్ణ డాక్టరు. తలిదండ్రులమీద ప్రేమతోబాటు భక్తి, గౌరవాలున్న మనిషి. చెల్లి పార్వతంటే అతనికి ఆరోప్రాణం. చామనచాయలో, పొడుగ్గా బలంగావుంటాడు. పార్వతి ముగ్ధ. చదువులో బాగా చురుకు. అన్నా చెల్లెళ్ళిద్దరిమధ్య స్నేహం ఎక్కువ.

మూడోవాడు శేఖరం, కుర్రాడు. తన చదువేమో, ఆటేమో అంతే. గాలిపటంలా తిరుగుతాడు. ఎప్పుడూ క్రికెట్ ఆటమీదే ధ్యానం. మంచి ఆటగాడు. ఎలాగో బి. ఎ. అయిందనిపించాడు. ఎప్పుడూ ఊర్కు తిరుగుతూ వుంటాడు.

వెంకటశాస్త్రిగారు బాగా సంపాదించారు. మద్రాసులోనే ఇల్లుకొని అక్కడే స్థిరపడి పోయారు. కొడుక్కి డాక్టరు చదువు చెప్పించారు. రామకృష్ణ కూడా బాగా సంపాదిస్తున్నాడు.

రామకృష్ణది ప్రేమవివాహం. కాలేజీలో చదువుతున్నప్పుడే స్నేహితుడు శర్మచెల్లెల్ని చూడడం తటస్థించింది. మొదటిచూపుతో సందేశాలంపుకుని రెండోచూపుతో సరేనను కున్నాయి వారిద్దరికళ్ళు. భారతి చక్కని చుక్క కాకపోయినా అందవికారంగా వుండదు. సంసారపక్షం. చిలిపిగా నవ్వే కళ్ళు, నవ్వినప్పుడు కొద్దిగా నొక్కుపడే బుగ్గలు ఆమెకివున్న సొమ్ములు.

పెళ్ళికిముందే రెండు సంవత్సరాలనుండి భారతి, రామకృష్ణ తరుచు కలుసుకుంటూ ఒకరి అభిప్రాయాలు మంొకరు అర్థం చేసుకున్నారు. భారతిని వివాహం చేసుకుంటానంటూ రామకృష్ణ ఇంట్లో చెప్పినప్పుడు వెంకట శాస్త్రిగారు అభ్యంతరం పెట్టారు. 'చెల్లెలికంటె ముందు నువ్వు పెళ్ళిచేసుకుంటే ఎలాగురా? వచ్చేకోడలెలాటిదో?' అని.

రామకృష్ణ ఆవిషయంలో తండ్రికి చాలా నచ్చచెప్పాడు. ఈ సందర్భంలో పార్వతి కూడా అన్నగారి ప్రక్కన నిలబడి చాలా సహాయం చేసింది. అసలు పార్వతి కూడా భారతి అంటే చాలా యిష్టపడింది. తల్లితో భారతిని గురించి ఎంతో మంచిగా చెప్పింది పార్వతి.

రామకృష్ణ చదువయిపోగానే భారతితో అతని వివాహం జరిగిపోయింది. ఒక్క పైసా కట్నం లేకుండా భారతి శాస్త్రిగారింట అడుగుపెట్టింది. అంత సంస్కారం వున్న ఇంట్లో పడడం భారతి అదృష్టం. ఇంట్లో అందరూ భారతిని చాలా ఆప్యాయంగా ఆదరించారు.

ముఖ్యంగా భారతీ, పార్వతీ చాలా సన్నిహితులయ్యారు. పుట్టింట్లో భారతికి తమ్ముళ్ళు చెల్లెళ్ళు ఎవరూ లేకపోవడం వల్ల వదినా, వదినా అంటూ తిరుగుతున్న పార్వతి అంటే ఎంతో అభిమానం.

'పార్వతి చాలా మంచిపిల్ల. మంచి భర్తని సంపాదించాలి. మరి ఎలాంటి వ్యక్తిని తెస్తారోగానీ' అనేది భారతి నలుగురు కూర్చున్నప్పుడు రామకృష్ణనుద్దేశించి.

'నేనే సంపాదిస్తానులే. నువ్వే చూడు ఎవరినేనా. నువ్వు పెళ్ళిళ్ళు కుదర్చడంలో గట్టిదానవుగా' అనేవాడు చిలిపిగా రామకృష్ణ.

అసలేమిటంటే భారతి అన్న శర్మకి స్నేహితురాలు పద్మతో వివాహం కుదిర్చింది. అప్పటినుంచి భారతి స్నేహితురాళ్ళందరూ ఉడికించేవారు భారతిని 'పెళ్ళిళ్ళ పేరమ్మ' అని.

'అవును లెద్దురూ! అసలు అన్నయ్యకి పెళ్ళయిపోయింది గానీ లేకుంటే పార్వతి లాంటిదాన్ని వదిలేదాన్నా?' పిగ్గుపడేది పార్వతి.

పిల్లల కబుర్లువింటూ ఆనందించేది రాజమ్మ. శాస్త్రిగారికెప్పుడు కేసులు, గొడవలూ, అవే వ్యాపకాలు. పిల్లల మంచి చెడ్డలు రామకృష్ణ పెద్దయ్యే వరకూ చూశారు. తరువాతిభారం రామకృష్ణదే.

* * *

పార్వతి చదువు పూర్తయిన సంవత్సరమే రాజారావు సంబంధం వచ్చింది.

ఇంటర్మీడియేట్ దాకా చదివాడు. కట్నం చాలా కావాలని విని నిరుత్సాహపడింది పార్వతి. కట్నం కావాలన్న వ్యక్తికి మనసంతా డబ్బు మీదే వుంటుంది. కానీ పిల్లమీద వుండదని పార్వతి అభిప్రాయం. భారతికూడా పార్వతితో సంపూర్ణంగా ఏకీభవించింది ఈ విషయంలో.

రామకృష్ణతో గట్టిగా వాదించింది భారతి. రాజా ఎలాంటివాడో అతని మంచి చెడ్డ లేమిటో తెలుసుకోవాలని, లేకపోతే పువ్వులాంటి మనసుగల పార్వతి సుఖపడదు.

'కట్నం ఇవ్వనంటే మానేస్తాడు కదా మన సంబంధం.' అంది భారతి రామకృష్ణతో.

'నువ్వుకూడా ఇలా అంటే ఎలా భారతీ! చూడు. తప్పేముందీ? ఎందరో డబ్బు తీసుకుంటున్నారు. పిల్లవాడేం తినేస్తాడా డబ్బు. అతనసలు డబ్బుసంగతే మాట్లాడడం లేదు. అంతా అతనితల్లి, అతని మామయ్య అడుగుతున్నారు. పిల్లాడేమో అందమయినవాడు. చదువుకున్నాడు, సంపాదిస్తున్నాడు. మంచి సంబంధం పార్వతికి నచ్చచెప్పు.'

'ఏం నచ్చచెప్పాలి? ముందు మనకి నచ్చాలికదా?'

'ఏం నచ్చలేదు నీకు? అందంతక్కువా? చదువుతక్కువా? ఇప్పుడు కాదన్నామంటే నిమిషంలో తన్నుకుపోతారతన్ని ఎవరైనా రెట్టింపు కట్నమిచ్చి.'

'డబ్బు, అందం, చదువు, ఇవేనా కావలసింది? మంచి కుటుంబం అదీ అక్కరలేదా?' భారతి అడిగింది.

రాజమ్మకూడా కోడలి తరపునే వాదించింది.

'ఏమిటమ్మా. నువ్వుకూడా! నాన్నగారు అంతా వాకబుచేశారు. మంచి గౌరవంకల కుటుంబంలోంచి వచ్చాడు కుర్రాడు. కావలిస్తే నాన్నగారి నడుగు' ఖస్సుమన్నాడు రామకృష్ణ.

'అదికాదే రాజం. మన నారాయణ లేడూ? వాడి బంధువులే వీళ్లు. వాళ్ల వంశం మంచిదికదూ!' అన్నారు వెంకటశాస్త్రి.

'అసలు వాళ్లవంశం; వాళ్ల గొప్పలు ఎందుకమ్మా? కుర్రాడిని చూడరాదూ? ఎంత వినయం! అతనితో మాట్లాడాను కదమ్మా!'

'ఎంతసేపు మాట్లాడారు? మహావుంటే మూడుగంటలు గడిపా రతనితో' భారతి అంది.

వెంకటశాస్త్రిగారికి కోడలిమీద కోపం ముంచుకువచ్చింది. కొడుకును చూశారు కోపంగా. రామకృష్ణకి అభిమానం దెబ్బతింది.

'అయితే ఏమంటావ్?' కోపంగా అడి



కాడు భార్యని.

'నే నతనితో మాట్లాడాలి.'

'నువ్వు?' ఆశ్చర్యపోయా డతను భారతి అరిందాతనానికి.

'ఏం? అలా ఆశ్చర్య పోతున్నారు? కూడదా ?'

'కూడదు'

'అయితే పార్వతి మాట్లాడుతుం దతనితో.'

విస్తుపోయా రందరూ. పెళ్లిచూపుల తతంగం అంతా ముగిసిపోయాక ఇప్పుడిదేమిటి మళ్ళీ అనుకున్నారు.

'భారతీ, నీకేమైనా మతిపోయిందా?' రామకృష్ణ గట్టిగా అన్నాడు.

'పోలేదు. పార్వతి ఊహలు నాచేత మాట్లాడిస్తున్నాయి అంతే.'

ముందు గందరగోళపడ్డా పార్వతి అభిప్రాయం అని తెలిసేసరికి అందరూ చప్పబడ్డారు.

ఊర్లోనే బంధువులింట్లో దిగాడు రాజారావు. అక్కడికివెళ్ళి వెంటబెట్టుకు వచ్చాడతన్ని రామకృష్ణ. టిప్‌టాప్‌గా ముస్తాబయి వచ్చాడు రాజారావు. కాఫీ, టిఫిన్లయ్యాక 'అలా షికారువెళ్దామా?' అన్నాడు రామకృష్ణ.

'అలాగే, మీ పెళ్లికూడా రమ్మన కూడదూ! చూడండీ నాకేం అభ్యంతరం లేదు. స్త్రీలు ఫార్వర్డ్‌గా వుండడం లైక్ చేస్తాను.' అని అంటూ గట్టిగా నవ్వాడు రాజా. ఆడబోయిన తీర్థం ఎదురయినట్లు ఫీలయ్యాడు రామకృష్ణ.

షికారునుంచి వచ్చిన పార్వతి తన సమ్మతి తెలిపింది. సంభాషణ సారమంతా విన్న భారతి బాధపడింది. పెళ్లి ఆ నెల లోనే జరిగిపోవాలన్న అతని తొందర పాటేమిటో భారతికి అర్థంకాలేదు. పిల్లని చూడగానే మోజుపడ్డాడు. మళ్ళీ మళ్ళీ రావడానికి సెలవుదొరకదు అన్న వాళ్ళ మాటలకు అందరూ ముచ్చటపడ్డారు కానీ భారతికి మాత్రం ఆ తొందరేమిటో నచ్చలేదు. అసలు రాజాని చూచిన క్షణమే భారతికి అతనిమీద సదభిప్రాయం కుదరలేదు.కారణం ఆమెకే తెలీదు.

పార్వతి ఒప్పుకున్న వెంటనే వివాహ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

కానీ భారతిమాత్రం ఉత్సాహంగా లేదు.

ముగింపు...

అది గమనించిన రామకృష్ణ భారతిమీద మండిపడ్డాడు ఆ నాటి రాత్రి.

'భారతీ, పార్వతినిచూసి కుళ్లుకుంటున్నావు. ఎన్నోవిధాల ఎన్నోరెట్లు నీకంటె ఎక్కువగా పార్వతి సుఖపడుతోందని కళ్లల్లో కారం రాసుకుంటున్నావు ...' అంటూ పరుషవాక్యాలతో భారతిని బాధించాడు.

పెదవి విప్పలేదు భారతి.

మరో పదిరోజుల్లో పార్వతిపెళ్లి అతి వైభవంగా జరిగిపోయింది.

* * *

నాలుగు రోజుల్లో బయలుదేరి వస్తున్నట్లు నాగమ్మ టెలిగ్రామిచ్చింది. అది చూసుకున్న రాజా మురిసిపోయాడు.

'రాణీ మా అమ్మ వస్తోంది' అన్నాడు గబ గబ వంటింట్లోకివెళ్లి.

'అలాగా, ఎంత మంచివార్త చెప్పారు' అంది పార్వతి.

నిజంగానే పార్వతికి సంతోషం వేసింది, ఇంటికి పెద్దదిక్కంటూ వుంటే తనభర్త కాస్త ఇంటిపట్టునే వుంటాడని పార్వతి ఉద్దేశం. పెద్దావిడకాబట్టి కాస్త ఆచార వంతురాలయి వుంటుంది — రాజా ఆటలు ఇక సాగవనీ సంతోషపడింది.

'మా అమ్మ ఎంతమంచిది తెలుసా ? నీలాగా ఏమిటి? కోడిగుడ్డు ఆమ్లెట్ వెయ్యమంటె వేధన ఏడుపు మొహం పెడ్తావు. మా అమ్మయితేనా...'

'అవునవును. బాగా చేస్తారేమో కదూ! ఎందుకు కోతలు? పెద్దవారిని అలాంటి మాటలనకండి. బావుండదు' నవ్వుతూ అంది.

'సరేలే, మా అమ్మసంగతి తెలుస్తుందిగా, అవునుగానీ, చూడూ ... మా అమ్మ నాకు దేవత.. నువ్వేమీ ఆవిడతో పోట్లాట పెట్టుకోకూడదు. ఆవిడేమన్నా నువ్వు పడుండాలి' నవ్వుతూ, నవ్వుతూ గబుక్కున కఠినంగా మొహంపెట్టిన రాజానిచూసి బిత్తరపోయింది పార్వతి.

* * *

నాగమ్మ అదోతరహా మనిషి. ప్రాణం అంతా రాజామీద నిలుపుకుంది. నాగమ్మ పెద్దకూతురు కావేరి మేనమామ రంగనాథం దగ్గిరేవుంటోంది. కృష్ణాజిల్లాలోని ... పల్లెలో తనకున్న కొద్దిపొలం వ్యవసాయం చేసుకుని కాలం గడుపుతున్నాడు రంగనాథం. అతనికి చెల్లెలు నాగమ్మంటే పంచప్రాణాలు. సలహాలు చెప్పడంలో నాగమ్మ సిద్ధహస్తురాలు.

'నాయకురాలు మా నాగమ్మ' అంటుంటాడు రంగనాథం.

అత్తగారొస్తున్నందువల్ల పార్వతికి ఒకవైపు సంతోషంగానే వున్నా, మరోవేపు విచారంగావుంది. ఎందుకంటే 'ఆవిడేమన్నా నువ్వు పడుండాలి' అన్నమాట, ఏదో మాటవరస కన్నట్లు లేదు. అందులో ఎంతో అర్థం స్ఫురించింది పార్వతికి. ఆ మాటే ఆ రోజంతా చెవుల్లో గింగురుమంటూవుంది.

ఆలోచనల్లోంచి తేరుకుని వీధిలోకి వచ్చేసరికి టాక్సీఒకటి ఆగడం, అందులోంచి అత్తగారు, తనభర్త దిగడం జరిగింది.

'ప్రయాణం కులాసాగా జరిగిందా ? కావేరి ఎలాగుంది ? బాబయ్యగారు బాగున్నారా' అంటూ ఎంతో ఆప్యాయతతో అడిగింది అత్తగారిని పార్వతి.

'అబ్బ...అబ్బబ్బ...ఏమిటా ప్రశ్నలు ? వెళ్లి ముందు కాఫీపట్రా. తర్వాత చెబుతుందిలే సమాధానాలు' విసుక్కున్నాడు రాజారావు.

పార్వతి మొహం ముడుచుకుంది.

'చూడనమ్మాయ్. మా వాడికి నాకేం కావాలో అన్నీతెలుసు. నాకు కాఫీ అంటే చాలా ఇష్టం: అందులో బండి దిగగానే నేను కాఫీ తాగుతాను లేకపోతే తలకాయ నొప్పి దంచేస్తుంది. కాస్త కాఫీ పట్టుకురా' పురమాయించింది నాగమ్మ కొడుకు వైపు అతి అనురాగంతో చూస్తూ.

'ఒక్కక్షణంలో కాఫీ వస్తుందమ్మా, నువ్విలా పడుకో.'

మంచం చూపిస్తూ అన్నాడు రాజా.

పార్వతి వంటింట్లోకి వెళ్ళింది.

బొంబాయి జీవితం, రాజారావు ప్రపంచం నాగమ్మకి బాగానచ్చింది. రెండు నెలలు తమ్ముడి వూర్లోవుండి ఇప్పుడు రెక్కలు కట్టుకు వాలింది కొడుకుదగ్గరకి.

తన కొడుకు ఇంత బాగా పైకివచ్చి సంఘంలో ఎలా మెలగాలో తెలుసుకున్నాడు, ఆవిడ కదే ఆనందం. రాజా తను పైకి









PRICKLY HEAT POWDER
GERMICIDAL

[illegible] బాగా ఆధునికభావాలు నేర్పేశాడు. అందుకే తమ్ముడింట నాగమ్మకేమీ తోచలేదు.

పార్వతి తెచ్చిన కాఫీతాగి ప్రేద తీర్చుకుంది.

'వినమ్మాయ్. నే నెంతో మంచిదాన్ని. అందరి అత్తల్లాంటి దాన్నికాను. నల్లని వన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు అనుకునే స్వభావం నాది. సరేనా, నువ్వేమీ భయపడకు. అత్తవొచ్చి నెత్తిన కూర్చుందేమా అని. నాకేం పెద్ద ఆచారాలు, మడీ, దడీ ఏమీ లేవు... తెలిసిందా?' అంది నవ్వుతూ నాగమ్మ పార్వతిని ఉద్దేశించి.

'ఏదీ స్నానాలగది' అడిగిం దావిడ.

పార్వతి వింతగా ఆవిడ్నిచూస్తూ ఆవి డడిగిన గదిని చూపింది.

'ఇదుగో రాణీ, నేను స్నానంచేసి రాగానే, భోజనం చేసేస్తాను. అన్నీ సిద్ధం చెయ్యి.' అంది నా గ మ్మ పెట్టెలోంచి బట్టలు తీసుకుంటూ.

'నాపేరు పార్వతి, నన్ను రాణి అని పిలవకండి' అంది పార్వతి వంటింట్లోకి పోబోతున్నదల్లా ఆగి 'అదేమిటి? రాణి అని పిలవ్వద్దనడ మేమిటే నువ్వు. పార్వతిపేరు మా వాడికి నచ్చలేదుట.'

'అయినా మీరు పార్వతీ అనే పిలవండి'

'ఆలా ఏం పిలుపడదే కోడలుపిల్లా. మా

ముగింపు...

వాడి కెలా ఇష్టమో అలాగే చెయ్యాలి నేను, లేకపోతే వాడికి కోపం వస్తుంది. అసలే వాడిది పిచ్చికోపం. ఆ కోపంలో వాడేం మాట్లాడుతాడో, ఏం చేస్తాడో వాడికే తెలీదు. అయినా, నే నొకటి చెబుతాను విను. పెళ్ళయ్యాక ఇంక ఆడదానికి యిష్టాయిష్టాలు ఏమిటి? వాడిష్టం మొచ్చినట్లే చెయ్యాలే రాణమ్మా' అంటూ గట్టిగా నవ్వి స్నానాలగదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

పార్వతికి తలకొట్టేసినట్లయింది.

అవును. తనకి వ్యక్తిత్వ మేమిటి? వున్న ఆశయాలు, ఆశలు అలా అలా గాలిలోకి ఎగిరిపోతాంటే పార్వతికి దుఃఖం వచ్చేసింది. తనని ఏడిపించడానికి ఒకరికి ఇద్దరిని ప్రసాదించాడు భగవంతుడు. అనుకుంది పార్వతి.

'ఏమిటి రాణిగారు. ఆలోచన...పద ... పద...వడ్డించు'

కసిరాడు రాజా. ఛ. చిన్న విషయానికెందుకింత బాధపడాలి అనుకుంటూ వంటగదిలోకి వెళ్ళింది పార్వతి.

చెట్టుకి పురుగుపడితే ఆదిలోనే తుంచెయ్యాలి. కాకపోతే చెట్టుకే నష్టం.

'రాణీ...రాణీ...' రాజారావు వీధిలోంచే అరుస్తూ వచ్చాడు. వంటింట్లోవున్న పార్వతి పలకలేదు.

'పిలుస్తుంటె పలకవేం?'

'అలవాటుకి విరుద్ధంగా వుంటే'

'అంటే?'

'ఏమీలేదు. పొరపాటున మీ అమ్మగారిని పిలవబోయి నన్ను పిలిచారేమో నని'

'సంతోషించాంలే తెలివికి. ఇంతకీ అమ్మేది?'

'ఎదురింటి ప్రసాదరావు గారితో మాట్లాడుతున్నారేమో చూడండి.'

'వాడింటి కెందుకు? నే నింటికి రాగానే కనబడకపోతే చిరాకని ఆవిడకి తెలీదూ?' బూట్లు విప్పుకుంటూ అన్నాడు. నాగమ్మ నవ్వుకుంటూ వచ్చింది లోపలికి.

'ఏమిట్రా అబ్బాయ్? ఎప్పుడు వచ్చావ్? ఇది విన్నావిట్రా ప్రసాదావికి పెళ్ళిట.' అంది.

'నిజమా అమ్మా ?'

'అవున్రా, ఇరవైవేలిచ్చి, ఇంటెడు సామానూ ఇస్తారట. పెళ్ళి అయిదు రోజులు చేస్తారట...'

పార్వతి తల్లీ కొడుకు లిద్దరికీ టిఫిన్, కాఫీ తెచ్చిపెట్టింది.

'మనకూ దొరికింది సంబంధం ... ఎందుకూ? ఏం చేసుకోను? అందం ఎందుకురా? డబ్బులోవున్న సుఖం ఎందులో వుందిరా...చెప్పితే విన్నావు కావూ...'

'అదేమిటమ్మా? నువ్వు కావాలన్నావు కనకగానీ నాకెందుకమ్మా... ఈ పంచదార బొమ్మ...ఉత్త నాటురకం.'


ఏ పరిస్థితులలో పార్వతిని పెళ్ళి చేసుకున్నాడో మర్చిపోయి అన్నాడు :

'అవును... కర్మ అలా తోసుకువచ్చి నీ బంగారంవంటి జీవితం ఇలా అయిందికదా!' అంటూ కళ్ళ నీళ్ళొత్తుకుని రాజా దగ్గరగా వచ్చి అతని మొహం గట్టిగా చేతుల్లో వొత్తింది. గర్వంగా కళ్ళెగరేశాడు రాజా తల్లిని గట్టిగా వాటేసుకుంటూ.

నోట మాట రాక పార్వతి బొమ్మలా నుంచుండిపోయింది.

ఇలాంటి దృశ్యాలు పార్వతికేం కొత్త కాదు. అయినా ఏవిటో బాధగా వుంటుంది.

'అమ్మా, చూడమ్మా. నీకోసం ఏం తెచ్చానో! పట్టుచీర నువ్వు కావాలన్నావుగా... ఇదిగో తీసుకో... నీ సంతోషమేనమ్మా నాకు



కావలసింది...' అన్నాడు రాజా.

నాగమ్మ కళ్లు మెరిశాయి. అడిగిన ఇరవయినాలుగ్గంటల్లో పట్టుకొచ్చేశాడు... తన కొడుకు—తన రక్తం... తన ప్రాణం.

మళ్లీ కొడుకుదగ్గర కెళ్లి బుగ్గలు నిమిరింది.

పార్వతి కళ్లు వర్షించాయి... ఒక రకమయిన ఈర్ష్య కసి... ఏమిటో తెలియని బాధ.

అక్కడనుంచి చటుక్కున లేచి లోపలికి వెళ్లిపోయింది పార్వతి.

అప్పుడే వీధిలోంచి 'పార్వతీ ... పార్వతీ' అంటూ రేణుక లోపలికి వచ్చింది. వెనకాలే మధుకూడా వచ్చాడు. రేణుక గొంతు వినగానే చటుక్కున నాగమ్మ కొడుకుమీదనుంచి చేతులు తీసేసింది.

'హలో...కమాన్...రండి ... రండి...' అంటూ ఆహ్వానించాడు రాజారావు వాళ్ళని.

రేణుక పార్వతికోసం లోపలికి వెళ్లింది. పార్వతిని చూసిన రేణుక మనసు జాలితో నిండిపోయింది.

'అదేమిటే పారూ, ఏడవకు...లే.'

పార్వతికి ఎన్నాళ్ళకో ఆప్తుల్ని చూసినట్లయింది. దుఃఖం ముంచుకొచ్చింది. కానీ ఎంతో కష్టంమీద నిగ్రహించుకుంది. వివర్ణగా కందిన మొహంలోకి నవ్వు తెచ్చుకుంది.

'రేణూ...ఎన్నాళ్ళయింది నిన్ను చూసి.'

'కొన్ని యుగాలయింది...అందుకే నిన్ను చూడాలని వచ్చాం నేనూ, అన్నయ్యా.'

'ఏమిటే...మధు బాబుగారు కూడా వచ్చారా?'

పార్వతి మొహంలోకి వెలుగొచ్చింది.

'అవును! పద...వీధిలోకి వెళ్దాం... మొహం కడుక్కురా.'

రేణుకని హాల్లోకి వెళ్ళమని పార్వతి నీళ్ళ గదిలోకి వెళ్లింది.

రేణుక సావడిలోకి వచ్చేసరికి 'ఇది నీ చెల్లెలా?' అంది రేణుకని చూపిస్తూ నాగమ్మ.

రేణుక తల ఎత్తి ఆవిడని చూసింది. ఎందుకో ఆవిడని చూడగానే మంచి అభిప్రాయం కలగలేదు రేణుకకి. మొహం చిట్లించింది.

'అవునండీ......రేణుక నా చెల్లెలు...' అన్నాడు మధు.

'మధు ఆరవ ప్రాణంకూడా,' రాజారావు అన్నాడు.

ఓం నమః శివాయ

కం. వివాహితుడవా విన్ననా
వివేకులే ఉన్మత్తులై ఊహించి పూజించుచున్నారు
విని నే నమ్మజాలన్
వివరింపుమో, వందనం బర్పించెద వరుణాసి॥

కం. విశ్వరూపా, పావనా
విశ్వనాథా, స్వయంభువునికా, స్వయంవరమా
విశ్రాంతి నొంది గుందితిన్
విధి విధాతా యథార్థమా, గూఢార్థమా॥

కం. వినరు, కనరు, నమ్మరు నన్
విచిత్ర కల్పిత కవినని కరుణించరు కవుల్
విన్నవించెద వ్యాకులత
విందువో, ఊరడించెదవో, ఉమేశ నీ వొక్కడున్॥

కం. వికసిత కాంతి వెలిగింపు
వినోద వీచిక వ్యామోహ వాంఛితుల్
విశ్వసాధన, విఘ్నమయ్యె
విఫల విరాగినై విషాదిత హృదయ స్పందనమయ్యెన్॥

రచయిత్రి: శ్రీమతి సరస్వతీగిరి

('శివభక్తురాలు, అనామధేయి' పేర్లతో రాసినవారు రాష్ట్రపతి శ్రీ గిరిగారి సతీమణి శ్రీమతి సరస్వతి గిరిగారు. ఈ సంగతి పాఠకులకి తెలియచెయ్యవచ్చునని వారే అన్నారు కాబట్టి 'ఓం నమః శివాయ' శీర్షిక కింద ప్రచురణ అవుతున్న పద్యాలతోబాటు వారి పేరు వేస్తున్నాము. —సం॥)

'అవును మరి చెల్లెళ్ళంటే ప్రేమ వుండాలి కదా!'

'అమ్మాయికి ఎక్కడన్నా సంబంధాలు చూస్తున్నావా బాబూ?' అంది నాగమ్మ మధు నుద్దేశించి.

రేణుకకీ ప్రసంగం రుచించటం లేదు.

'ఏదండీ, ఇంకా చిన్నపిల్లే కదా, చూడాలి ఇకమీద. మీ ఎరిక నేదేనా సంబంధాలుంటే చూడండి పిన్నిగారూ' అన్నాడు మధు చిరునవ్వుతో.

రాజా గట్టిగా నవ్వేశాడు.

రేణుక మొహం కొద్ది కొద్దిగా ఎర్రబడింది.

ఇంతలో పార్వతి లోపలనుండి కాఫీ, టిఫిన్‌లతో నున్న పళ్లెం తెచ్చి బల్లమీద పెట్టింది.

'అరె! ఇంత చురుకుగా చేసిందే కోడలు పిల్ల...ఏదో విశేషమే' నాగమ్మ వేళాకోళంగా నవ్వుతూ అంది.

అదేదో జోక్‌లాగా రాజారావు పెద్దగా నవ్వాడు.

మధు కళ్ళు పార్వతి వైపుకి తిరిగాయి. ఒక్కసారి నాలుగు కళ్ళు కలిసాయి. అదీ ఒక్క క్షణమే.

పార్వతి తెప్పరిల్లి 'కాఫీ తీసుకోండి' అంది.

'రాజారావుగారూ! పార్వతిని రేపు మా ఇంటికి తీసికెడలాను' అంది రేణుక.

రాజారావు అనుమతి కోసం తల్లి వైపు చూస్తూ—'ఏమ్మా, పంపుతావా?' అని అడిగాడు.

రేణుక విస్మయపడింది. పార్వతి ఇల్లు కదలాలంటే నాగమ్మ ఇష్టమన్నమాట.

'అదేమిటమ్మా, నన్నడుగుతావు. దానిష్టం దానికి వెళ్లాలనుంటే వెళ్ళమను...'

తల్లి ఆయిష్టాన్ని గుర్తించాడు. రా

'ఇప్పుడొద్దులెండి రేణుకా; మరోసారి చెప్తే బైనా వస్తుంది. ఏమంటావు రాణి.'

'అలాగే, మీ ఇష్టం.'

రేణుక మొహం చిన్నబోయింది.

'రాజారావుగారూ! మా చెల్లెలు మనసు పడింది. వాళ్ళిద్దరూ స్నేహితు లయ్యారు. ఈసారికి మా మాట మన్నించకూడదూ?'

రాజారావు కేం చెయ్యాలో తోచలేదు. ఇటు నాగమ్మ అటు రేణుక. ఇద్దరి మన సుల్నీ కష్టపెట్టాలని లేదు అతనికి.

'క్షమించండి మధూ, మరోసారి వస్తాను. ఈరోజు ఏమిటో వంట్లో బాగా లేదు కూడాను. మా రేణుకి కోపం రాదుగా ? ఏం రేణూ?' అంది పార్వతి నవ్వుతూ.

రాజారావు మనసు తేలికైంది.

'సరేలే పార్వతీ, నీకు వంట్లో బాగా లేనప్పుడేం చేస్తాం. అభిమానవతివి. నీసంగతి నాకు తెలీదూ ? మరి వస్తాం ...... రే అన్నయ్యా.'

'అరె...అప్పుడే వెళ్ళిపోతారా? కాసేపు వుండండి' అన్నాడు రాజారావు లేస్తూ.

'లేదండీ, పనుంది ... వెళ్ళాలి.. వస్తాం పార్వతీ' అంది రేణుక.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

* * *

పార్వతి మనసు బాగాలేదు. వాళ్ళు వెళ్ళి పోగానే భోజనం చేసి అత్తగారు పెత్తనా నికి, రాజారావు వూళ్ళోకి వెళ్ళిపోయారు. ఇది రోజూ జరిగే కార్యక్రమమే. ఇందులో

ముగింపు...

కొత్తేమి లేదు. ఇంట్లో ఒక్కత్తీ దిక్కు దిక్కుమంటూ కూర్చుంది పార్వతి. మామూలే...

ఉదయం తొమ్మిది గంటలకు లేస్తాడు రాజారావు. గబగబ లేచి ముస్తాబయి తొమ్మి దిన్నరకి ఆఫీసుకంటూ వెళ్ళిపోతాడు. ఇష్ట మైతే టిఫిన్ తింటాడు. లేకపోతే అదీ లేదు. అతనింట్లో ఉన్నంతసేపు అతనికి కావలసిన వన్నీ అందివ్వాలి. లేకపోతే ఊరు కోడు. గట్టిగా అరుస్తాడు.

సాయంత్రం రాజారావు వచ్చాక అతనికి కావలసినవన్నీ టిఫిన్ కాఫీ వగైరాలు అమ ర్చాలి. తరువాత తల్లీ, కొడుకు కలిసి షికారుకో, సినిమాకో వెళ్ళిపోతారు. మాట వరసకేనా పార్వతిని రమ్మని పిలవరు.

ఒకసారి సిగ్గు విడిచి 'ఏమండీ. సిని మాకు వెడదామా ఇవాళ?' అంది రాజాకి కాఫీ అందిస్తూ.

'ఏవిటీ, సినిమాకా? ఈనెలలో ఎంతని ఖర్చు? మీ వాళ్ళని అడిగి ఓ నాలుగు వందలు పట్టుకురా, సినిమాకి తీసికెడతాను. నాకేం అభ్యంతరం లేదు' అన్నాడు ఫెళ్ళున నవ్వుతూ.

'బాగా చెప్పావురా' అంది నాగమ్మ సేళ్ళ గదిలోంచి. అత్తగారు స్నానం చేస్తున్నారు కదా అని అనుకుంది పార్వతి.

కాని ఆవిడ 'ఇందుగలడందులేడని' లాగ సరిగ్గా భర్తతో ఏకాంతం కలిగించుకునే వేళకి ప్రత్యక్షమవుతుంది. అది ఆనాటి సంఘటన.

వాళ్ళిద్దరూ కలిసి వెళ్ళకపోతే అత నొక్కడే వెళ్ళిపోతాడు షికారుకి, నాగమ్మ మరోవేపు పెత్తనాలకి వెడుతుంది. వాళ్ళిద్దరూ గూటికి చేరేసరికి వంట సిద్ధంగావుండాలి.

భోజనాలయాక రాజారావు ఇరుగు పొరుగువారితో ఒక గంట, గంటన్నరా కాల క్షేపం చేస్తాడు కులాసాగా. వాళ్ళకేదైనా సహాయం కావలసివస్తే నిమిషాలమీద చేసే స్తాడు. 'రాజారావుగారు బంగారంలాంటి మనిషి 'ఎంత మంచివాడు!' 'ఇతరుల కష్టం చూసి సహించలేడు' 'చాలా మెతక మనిషి' అని వాళ్ళందరూ అనుకోడం కద్దు.

నాగమ్మ ఇంకా వాళ్ళతో కాలక్షేపం చేస్తూండగానే రాజారావు ఇంట్లోంచి వెళ్ళి పోతాడు. మళ్ళీ రాత్రి ఏ పన్నెండుకో, ఒంటిగంటకో, రెండుకో, మూడుకో, అత నిష్టం.. తిరిగిరావడం.

ఒకోరోజు అతనెక్కడికీ వెళ్ళడు.

ఆరాత్రి పార్వతికి ఇష్టమున్నా లేక పోయినా రాజా పక్క చేరాల్సిందే. ఇదీ ఆ యింట్లో జరిగే కార్యక్రమం. రాజారావు ఎక్కడికీ వెళ్ళని రోజు నాగమ్మ అతను కలిసి పేకాడుకుంటారు. కబుర్లు చెప్పు కుంటారు.

ఇదీ జరిగే కార్యక్రమం ఆయింట...

రాజారావు ఇంట్లోంచి బయటపడ్డాక ఆరాత్రంతా అతను ఎక్కడ గడుపుతాడో, ఏంచేస్తాడో పార్వతికి బాగా తెలుసు. మదిరా, మదవతీ మరగిన మనుషులకు మరో ప్రపంచం తెలీదు. రూపాయలతో పేకాడతాడు...వచ్చిన రోజు పండగ...లేని రోజు...ఆ విషయమై పార్వతి ఏ ప్రశ్న వేయకూడదు. అడిగితే చెయ్యి చేసుకుం టాడు. అందుకే భయపడి ఆ వూసెత్తదు. ఏ విషయం అతనితో మాట్లా డటమన్నా భయమే పార్వతికి.

* * *


ఆలోచనలు...ఆలోచనలు...ఇదే జబ్బు... ఇదో వ్యసనమై పోయింది. జీవితం విసి రమై పోయింది. వంట్లో ఏ మాత్రం సత్తువ ఉండటం లేదు. వచ్చిన నాలుగు నెలలకే ఈ బ్రతుకికక ఈడ్చలేను అను కుంది.

ఆవలింతలతో నిద్ర ముంచుకువచ్చింది.

(ఇంకా ఉంది)

గోపికా లోలుడా ఆయనగారు

కె. రామలక్ష్మి




కోరుకున్న భార్య అందరినీ ఏకకాలంలో కట్టుకుందుకు అవకాశం యిచ్చే వైవాహిక వ్యవస్థే కనక ఉండివుంటే ప్రతి పురుషుడూ ఐదుగురిని పెళ్ళాడే వాడే! పెళ్ళి అనే భాగస్వామ్యం గురించి చర్చించేటప్పుడు యిలాంటి యిబ్బందికర మైన అంశాలను కూడా చర్చించడం భావ్యం కదా? కొంచెం చూపు నలువైపులా ప్రసరించే భర్త కనక వుంటే — అదో తమాషా కాదు...సంసారం గబ్బెక్కడానికిది నాంది కావచ్చు. 'స్వతహాగా మగవాడి లక్షణం అది.' బొరవిరుచుకుని కాలరు సర్దుకుని చెప్పాడో జల్సారాయుడు. 'ఈ రూల్సూ గట్రా కట్టిపడేశాయి గాని లేకుంటే — పోషించకల శక్తి ఉన్న పెద్ద మనిషి ఎంతమందిని పెళ్ళాడితే మీకెం దుకు?' అని కోప్పడ్డాడు కూడా. ఇలాంటి భర్తగారుంటే కట్టుకున్న భార్య ఏం చేయకలదు— అందులోనూ భర్తగారిలాంటి ఉదాత్తమైన దృక్పథం కల్గివుంటే— ఏం చేయకలదు ?

'ఏం చేస్తాం చెప్పండి మేడమ్. వ్యభిచ రించడానికి ముఖ్యం అవకాశాలు. అంతే కాదు. ఇంకో ఆడదాన్ని గెలిస్తే మగవాడికి గర్వంగా ఉంటుంది. పదేళ్ళ వయస్సులో చిన్నవాడైనట్టు ఫీలవుతాడు.' అన్నాడాయన. భర్తగారిలా చేస్తున్న సంగతి భార్య కని పెట్టినా కనిపెట్టకపోయినా వివాహంలో, సంసారంలో అతిముఖ్యమైన ఒక అంశం చస్తుంది— అదే నమ్మకం.

ఎప్పుడో దారి తప్పిన పెద్దమనిషి వేరు. కాని అలా దారి తప్పకుండా ఉండలేక పోవడం అన్నది యింకోటి. 'ఎందుకిలా చేస్తారు!' అని అడిగితే 'మీరేం అపార్థం చేసుకోకండి. మగవాడికి గొప్పగా చెప్పకోవా లనిపిస్తుంది; తన ఆడదాన్నే కాదు— అసలు ఆడదాన్ని అవమానించి చిన్నతన పరిచి పరాభవించాలన్న తీవ్రమైన వాంఛ అంతరాంతరాల్లో ప్రతి మగవాడికీ ఉంటుంది. కాని ఒప్పుకోరు' అన్నాడో పెద్దమనిషి. ఈ రకం మనిషికి వ్యభిచ రించడంకంటే ముఖ్యం గెలుపు అనిపిస్తుంది. నిజానికిలాంటివారికి తమలో తమకి నమ్మకం ఉండదు. తమ వ్యక్తిత్వం మీద నమ్మకం వుండదు— ఒకరకంగా చెప్పాలంటే నిజంగా పయోజనులుగాని పెద్దలు వీళ్ళు!

ఇంకో రకం ఉంటారు. 'ఏం చెయ్యను. నా భార్య నన్ను అర్థం చేసుకోలేదు' అంటూ బీదార్పులు అరుస్తారు. ఇలాంటి మాటలు నమ్మి పెళ్ళయిన పెద్దమనుష్య అని ప్రేమించేసే అమ్మాయిలెంతమందో— చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ అమ్మాయి లిలా 'నా భార్య నన్ను అర్థం చేసుకోదు' అనేవారి మాటకి 'నా భార్య బాగానే అర్థం చేసుకుంది— నేనో జోకర్‌ని కనిపెట్టేసింది నువ్వేమైనా సహాయం చెయ్యగలవా?' అని అడుగుతున్నారని అర్థం చెప్పకోవాలి.

ఏదేమైనా సంసారం సాఫీగా సాగాలని కోరుకునే స్త్రీ అయితే బాధ్యత తెలియని నాగన్నలా తన భర్త ప్రవర్తిస్తున్నాడని గ్రహించి తన నేర్పువల్లా, నోదార్పువల్లా అతగాడేమైనా ఎదుగుతాడేమో నని వేచి చూడాలి. బహుశా అతగాడు మారకపోవచ్చు. అయినా సంసారాన్ని రచ్చకెక్కించ దలచని పక్షంలో అతగాడి ఈ గోపికా లీలను చూసీ చూడనట్టు ఊరుకోవాలి— ఇంకోదారి లేదు కనుక. అలాకాదు ఈ మోసాలు, ఈ నమ్మక ద్రోహం, ఈ అవ మానం ఇక ఆపాలి అనుకుంటే — దారీ తెన్నూ తోచని అయోమయస్థితిలో నిర్ణ యం చేసుకోవడమే. ఎక్కువ ప్రేమ చూపీ, ప్రత్యేకత చూపీ భర్తని తిరిగి తనవాణ్ణి చేసుకోవాలనుకుంటే సత్ఫలితాలకి చాలా వ్యవధి కావాల్సి వస్తుంది. 'అంతకంటే సూటైన దారి యింకోటుంది సుమీ' అందొక స్నేహితురాలు. 'వ్యక్తిగతంగా బాధ్య తలని పెంపొందించుకుని, స్వతంత్రంగా అత గాడిపై ఆధారపడకుండా ఉండడం అల వాటు చేసుకోవడం మంచిది. అతగాడి అవ సరం లేకుండా నేను బతకగలనని కనక ఆడది చెప్పగల్గితే... మరుగున వెనక్కి రాగల డతగాడు!' అంది. మనమే వ్యక్తిగతంగా మా నసికంగానూ మానా భార్య తన అండ లేకుండా బతికేయ కల్గుతోందంటే అవ మానంగా ఫీలవుతాడు పురుషసింహం. దాన్ని వృద్ధి చెందించడం కోసం మనం తప్పు దారి తొక్కడం కాదు—కాళ్ళమీద నిలబడ్డం ముఖ్యం—అదే మీ గోపికాలోలునికి తగిన మందు.



జయలలిత విదేశ పర్యటన



ప్రసాద్ స్టుడియో మూడవ ఫ్లోర్‌లో ఒక తమిళచిత్రం షూటింగు జరుగుతున్నట్లు తెలిసింది. ఫ్లోర్‌బయట జయలలిత ప్రిమత్‌కారు కనిపించింది. సెట్లోకి వెళ్లాను. నటి జయలలిత, హాస్యనటి మనోరమల పిచ్చాపాటీ జరుగుతూ వుంది.

ప్ర: మీరు ఎక్కువగా తమిళంలో నటిస్తున్నారే? హిందీ చిత్రాలను అంగీకరించరా?

జ: 'ఇజ్జత్'లో ధర్మేంద్రతో నటించాను. ఆ తర్వాత మంచి పాత్రలు హిందీలో రావడంలేదు. వటిష్టమయిన పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తాను.

ప్ర: నటిగా మీ లక్ష్యం ఏమిటి? వ్యక్తిగా మీ ఆశయం ఏమిటి?

జ: అన్ని పాత్రలను నటించగలదు అనే పేరు సంపాదించాలి; 'ఆమె ఎవ్వరికీ యేలాంటి కీడు చెయ్యలేదు; చేతనయిన సహాయం చేసింది' అనే పేరు తెచ్చుకోవాలి.

ప్ర: మీరు ఎక్కువగా నవ్వేది ఎప్పుడు? మీరు ఎప్పుడయినా ఏడ్చి వున్నారా?

జ: నేను చాలా ఎమోషనల్ ఆర్టిస్టును. సహజంగా ఆర్టిస్టులందరికీ ఎమోషన్ వుండి తీరుతుంది.

నేను నవ్వినా విపరీతంగా నవ్వుతాను. ఏడ్చినా అంతే. కానీ నా ఏడుపు యెదుటివారికి తెలియదు.

ఒంటరిగా కూర్చుని గంటల తరబడి ఏడుస్తాను.

ప్ర: మీకు హీరోయిన్ పాత్రలంటేనే యిష్టమా?

జ: ఎవరన్నారు అలా; చక్కటి నటను ప్రదర్శించే అవకాశాన్ని కలిగించే ఏ పాత్రనయినా ధరిస్తాను. 'క్యారెక్టర్ ఆర్టిస్టు'గా పేరు తెచ్చుకోవడమే నా ధ్యేయం.

'అమ్మ' గా కూడా నటిస్తాను

ప్ర: అంటే 'అమ్మ' పాత్రను కూడా.

జ: హో. ఎస్. ఇఫ్ యిట్‌గివ్స్ స్కోప్‌ఫర్ యాక్టింగ్.

ప్ర: వర్ణాంతర వివాహంపై మీ అభిప్రాయం?

జ: నాకు 'జాతి, మతం, కులం, గోత్రం' పై పట్టింపు లేదు. అందరూ సమానులే అనేది నీతిని మా అమ్మ చిన్నప్పుడే నూరి పోసింది.

ప్ర: పెండ్లి అంటే మీ అర్థం?

జ: అన్యోన్యానురాగ బద్ధమయిన దాంపత్య జీవితాన్నే 'పెండ్లి' అంటాను.

ప్ర: మీకు ఆప్తమిత్రులెవరు? వారిచ్చే సలహాను పాటిస్తారా?

జ: ఆప్తులనబడే వాళ్లు నలుగురయిదుగురుంటారు. వారి సలహాలు నాకు మంచినే చేస్తాయి. అందుకే పాటిస్తాను. అలాగే నేను యిచ్చే సూచనలను వారు స్వీకరిస్తారు.

కలకాలం నిలిచేది కృషి

ప్ర: కృషి గొప్పదా? అదృష్టం గొప్పదా?

జ: రెండూ గొప్పవే. అదృష్టం తాత్కాలికంగా సహాయపడుతుంది. కృషి కలకాలం ఫలితాన్ని యిస్తుంది. కృషిలేని అదృష్టం రాణించదు.

ప్ర: గ్లామర్‌కు, అందానికి గల తేడా ఏమిటి?

జ: బాహాటంగా కనిపించే అందాన్ని గ్లామర్ అంటారు; అంతర్గతంగా వున్న అనురాగాన్ని అందం అంటారు.

ప్రపంచ పర్యటన

ప్ర: మీకు గ్లోబల్‌టూర్ చేసే వుద్దేశ్యం వుందా?

జ: 1972 లో ప్రపంచ పర్యటన చెయ్యాలని వుంది. నేను + నా డ్యాన్సు ట్రూపుతో వెళ్తాను.

ప్ర: మీరు తమిళంలో నృత్య నాటిక ప్రదర్శిస్తున్నారుగా. మరి తెలుగులో...?

జ: ఇప్పుడు నేను కొత్తగా ప్రాక్టీసు చేస్తున్న డ్యాన్సు డ్రామాను తెలుగు, తమిళ ప్రేక్షకులకు ప్రదర్శిస్తాను.

ప్ర: మీకు పరిపూర్ణ తృప్తిని యిచ్చిన పాత్ర ఏది? మీ స్వభావానికి దగ్గరగా వచ్చిన పాత్ర ఏది?

జ: పరిపూర్ణ తృప్తిని యిచ్చిన పాత్ర యింకా రాకపోయినా, 'మనుషులు—మమతలు', 'శ్రీకృష్ణ విజయము' పాత్రలు యించుమించుగా నా స్వభావానికి దగ్గరగా వచ్చినవే.

ప్ర: దక్షిణాది చిత్రాలకు విదేశీ మార్కెట్టు లభించక పోవడానికి గల కారణం?

జ: 'మన కట్టు, బొట్టు, తిట్టు, ఒట్టు' వాళ్ళకు అర్థమయ్యేలాగా సబ్ టైటిల్స్ తయారు చెయ్యకపోవడం; విదేశీయులతో సంబంధ బాంధవ్యాలు పెంచుకోకపోవడం లాంటి కారణాలు మరెన్నో వున్నాయి.

ప్ర: ఫిలిం పరిశ్రమను జాతీయం చేస్తే?

జ: పరిశ్రమలో కాంపిటీటివ్ స్పిరిట్ అదృశ్యమవుతుంది. ఎవ్వరికీ యింటరెస్టు లేకుండా పోతుంది; పరిశ్రమ దెబ్బ తింటుంది.

ప్ర: ఒక ఆర్టిస్టుయొక్క జాతకం ఎవరి చేతిలో వుంది.

జ: ప్రజల చేతుల్లో వుంది. వాళ్ళు ఆదరించే వరకే ఎవరయినా ప్రకాశించగలరు. మా జాతకాలకు ప్రేక్షకులే సరయిన జ్యోతిష్యులు.

—ఇంటర్‌వ్యూ: శ్రీనివాస్ ●

ప్రశ్నావళి

...కె. రామలక్ష్మి...

ఎస్. కె. ఎస్, కాకినాడ

ఇద్దరమూ ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. కాని మతాలు కులాలువేరు. ఈ సమాజంలో మా పెద్దలతో నెగ్గటం ఎలా?

ప్రేమించుకొందుకు అడ్డురాని కులమతాలు పెళ్ళిచేసరికి అడ్డురావడం— మీలాంటి వారికి లజ్జాచేటుగా. పరవాలేదు. ప్రేమత్యాగం చెయ్యండి!

పి. ఆర్. ఆర్. బి. ఎమ్, ఏర్యూరు

ఆడదాని వయసు అడగకూడదు. మగవారిని జీతం అడగకూడదు అంటారు. నిజమేనా. ఎందుకు?

ఆడదాని వయస్సు ఎక్కువ అయితేనూ, మగవాడి జీతం తక్కువ అయితేనూ చెప్పుకుందుకు సిగ్గుపడతారు కనుక!!

పొగరుశ్రీ, అర్లగడ్డ

ప్రేమలోకానికి గమ్యమేది?

పాపం! వివాహం. ఫలిత మేమిటో తెలుసా? వచ్చేదాకా మోయవలసిన బాధ్యతలు! చూసి ప్రయాణం కట్టండి!

ఎల్. ఆర్. ఎస్. ఆర్, అనకాపల్లి

మిమ్మల్ని విమర్శించే వాళ్ళను చూస్తే మీకు ఎలా వుంటుంది?

వారి విమర్శ గురించి ఆలోచించి— నాదే లోపం అయితే దిద్దుకుందుకూ, ఒప్పుకుందుకూ వెనుకతియ్యను. వారి విమర్శలో సహృదయత లోపించి ఉన్న ఆడిపోసుకోవడమే ప్రధానంగా కన్పిస్తే— అసలా విశాతోపాటు సరదాగా చదివేసి ఊరుకుంటాను.

ఎం. ఆర్. ఎమ్, సాగర్‌కర్నూలు

జీవుడు సాక్షాత్తు పరమాత్మయేనా?

కాదు జీవునిలో ఉండేది పరమాత్మలోని అంశ మాత్రమే.

ఎమ్. పి, కుర్దా, ఎం. పి.

నా దృష్టిలో నేను మంచివాడినే. కాని నన్ను ప్రజలు అమాయకుడు అని అంటున్నారు.

ఈ లోకంలో మంచివాడినే బాబూ అమాయకుడు అంటారు! తప్పుగా తీసుకోకు.

ఎమ్. డి, హైదరాబాదు

మావారు ఎంతో మంచివారు ... కాని ప్రొద్దస్తమానూ ఇంట్లో ఉండడం నాకిష్టం వుండదు. సరికదా చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళ చిన్నపిల్లలను చుట్టూ కూర్చోపెట్టుకుని కబుర్లాడుతూ హాస్యాలు చేస్తూ ఉంటారు. పనివాళ్ళతో మగవాళ్ళు ఎక్కువగా మాట్లాడితే వాళ్ళు మనమాట ఏం వింటారు? వంటింట్లోంచి అన్నీ తీసుకు తినడం, రోజుకు రెండు చీరలు మారుస్తావా? రోజా పువ్వులా?...

ఇవన్నీ ఆడంగి రేకుల మగవాడి లక్షణాలు. ఏ ఆడదీ ఇంత సౌఖ్యం భరించ లేదు. నిజమే. కాని నెమ్మదిగా మార్చడానికి మీ స్వంత పద్ధతి ఏదో కనిపెట్టాలి గాని ఇలాంటి వాటికోసం వీధిన పడకూడదు. మా పక్కింటి మామిని చూడండి. ఆయన బట్టలుతుకుతుంటే హాయిగా కుముదం చదువుతూ కూర్చుంటుంది!

సూర్యశ్రీ, కాశీబుగ్గ

మీరు రచయిత్రులు, మీ శ్రీవారు కవులు. మరి చిరంజీవులు?

పండిత పుత్రులు మటుకు కాదు!

ఎస్. ఎస్. ఆర్, విశాఖపట్నం

అక్కయ్యగారూ మీ పరిచయభాగ్యం లభిస్తుందా?

తరవాత బాధపడతావు తమ్ముడూ, జాగ్రత్త!

టి. కె. ఆర్, భిలాయ్

స్త్రీపురుషులు సమాజంలో సమాన హక్కులంటారు కదా? దాని వ్యత్యాస మేమిటి?

మీ అనుమానం కూడా అయోమయంగా ఉంటే ఎలాగ స్వామీ. సమాజంలో స్త్రీపురుషులు సమాన హక్కులు కల్గివుంటారని. ఇంకా దాంట్లో తేడా ఏమిటి? నా ముఖం! మీతోపాటు సమానంగా మీ చెల్లెలికీ అక్కకీ ఆస్తి యివ్వడం అన్నమాట. చదువులు చదివించడం అన్నమాట. ఆడదానివి అని కొన్ని వుద్యోగాలకి పనికిరావు అవకూడదన్నమాట. ఏం చేదుగా వుందా?!

వి. ఎస్ ఆర్, వేటపాలెం

మీ ప్రశ్నావళి శీర్షిక ముందు చదువుతాను. కాని మిమ్మల్ని ప్రశ్న అడుగుదామంటే తోచదు. ఎందుచేత?

మీది వినే స్వభావం కాబోలు సోదరీ. సాంసారిక జీవితంలో యీ లక్షణం కొరవడితేనే గొడవలు రేగేది. ●

ఆహుతి

(34వ పేజీ తరువాయి)

ఈ అమ్మాయి ఏదేదో పలవరిస్తోంది. మాకు కంగారుగా వుందమ్మా' అంది అక్కడ నిలబడ్డ ఒకావిడ.

'దుఃఖం బయటికి రావాలి. ఇలానే వుందంటే మెదడుకు ఎఫెక్ట్ యిస్తుంది. ఆ అమ్మాయి ఏడిస్తే మంచిది' అంది మరో ఆవిడ.

గూట్లోవున్న జి. పుల్లారెడ్డి స్వీట్స్ ప్యాకెట్ తెరిచి 'తీసుకో జానకి. నిన్ననే మా మ్యారేజి యానివర్సరీ' అంది మాలతి.

గుడ్ల నీరు కుక్కుకుంటూ 'వద్దు' అంది జానకి.

'ఈ ఒక్క బర్ఫీ తీసుకో. ప్లీజ్' అంది మాలతి బ్రతిమాలుతూ.

'మాలతీ!' అంటూ జానకీ మాలతిని గట్టిగా హృదయానికి హత్తుకుని వుద్వేగంతో వెక్కి వెక్కి ఏడ్చింది.

'ఏయ్ పిచ్చిదానా! ఎందుకలా ఏడుస్తావ్? ఎవరు చచ్చిపోయారని? వూరుకో' అంది మాలతి. మాలతికళ్లలో, మొహంలో, చేతుల్లో ఎలాంటిభావం అంతు చిక్కడం లేదు. ఆఫీసు సంగతులు, బొంబాయి సంగతులు, తను చదివిన సీరియల్ నవలగురించి యింకా ఏవేవో విషయాలు చెపుతున్న మాలతిని చూస్తుంటే వాళ్లకు కాళ్లు చేతులు ఆడలేదు.

ప్రక్కగదిలో భర్త శవం!

ఈ గదిలో మాలతి ఏవేవో కబుర్లు చెబుతోంది. లోపల మంచుపర్వతాలు పెట్టుకుని, అరగంటసేపు బ్రతిమాలాక వాళ్లనాన్న అడ్రసుతో పాటు నగరంలోనే వుంటున్న మరో యిద్దరు ముగ్గురు బంధువుల అడ్రసులు యిచ్చింది. ప్రకాశం జిల్లాలోని, మాలతి తండ్రికి టెలిగ్రాంలు పంపారు. గంటలో చిక్కడ్‌పల్లి, అమీర్‌పేటలో వున్న బంధువులు వచ్చారు. మాలతి యింకా ఏవేవో సంగతులు మాట్లాడుతూనే వుంది. మధ్య మధ్య 'ఆయన్ని డిస్టర్బ్ చెయ్యకండి. ఇప్పుడే పడుకున్నారు' అంటోంది. సాయంత్రం నాలుగున్నరకు ఆఫీసులో పనిచేసే తోటి వుద్యోగస్తులు చాలామందివచ్చి పరామర్శించారు.

'మిస్టర్ శేఖరంగారు, దయచేసి మీరు డాక్టర్ మాధవరావుగారిని రమ్మనండి. ఆయన ఏదయినా యింజక్షన్‌యిస్తే మాలతి రెండు మూడుగంటలు నిద్రపోతుంది ఈ కండిషన్‌లో ఆమె ఎక్కువసేపు వుండడం మంచిదికాదు' అని చెప్పింది జానకి.

బయటవున్న యిరానీ హోటల్నుంచి డాక్టర్‌కు ఫోన్‌చేసి, గార్డినాల్ టాబ్లెట్స్ రెండు కొనుక్కుని వచ్చి జానకికి యిచ్చి 'ఈ టాబ్లెట్స్ ఎలాగైనా ఆమె చేత మింగించండి. ఓ రెండుగంటలపాటు నిద్ర పోతుంది' అన్నాడు శేఖరం.

జానకి గ్లూకోన్ నీళ్లలో ఆ టాబ్లెట్స్ కలిపి మాలతికి యివ్వబోయింది.

'నాకెందుకు ఈ టాబ్లెట్స్?' అంది మాలతి.

'ఏ టాబ్లెట్స్?' అంది జానకి అమాయకంగా.

'నేను నిద్రపోవాలని యిందులో స్లీపింగ్ పిల్స్ కలిపావ్లే. నాకొద్దు మీ వప్పాలేం వుడకవు మనదగ్గర' అంది మాలతి.

ఎంతమంది ఎన్నివిధాల బ్రతిమాలినా, మాలతి ససేమిరా తీసుకోనంది. ఐదుగంటలకి డాక్టర్ మాధవరావువచ్చాడు. జేబులోంచి రెండు టాబ్లెట్స్ తీసి 'వేసుకోమ్మా, కళ్లు మూసుకుని' అన్నాడు.

'వద్దండీ. మరేదన్నా మందు యివ్వండి, మావారి దగ్గరికి పోవడానికి' అంది నవ్వుతున్నట్టు.

'ఇది అదే, తీసుకోమ్మా' అని రెండు టాబ్లెట్స్ మాలతిచేత మింగించాడు.

అంతవరకు నిద్ర పోతున్న బాబు లేచాడు.

'బాబూ యిలా రారా. చూడు మనింటికి ఎంతమంది చుట్టాలొచ్చారో!' అంది మాలతి.

ఐదున్నరకి డాక్టరుతోపాటు అందరూ వెళ్ళిపోగా, లలిత, జానకి మాలతి బాబూకు నలుగురు బంధువులు మిగిలారు.

'ఈ రాత్రికి మీరిద్దరూ ఇక్కడే ఉండండమ్మా. మీరు ప్రక్కన వుంటే అమ్మాయికి కాస్త ధైర్యంగా వుంటుంది' అన్నాడు ఒక పెద్దాయన.

సరే నన్నారు వాళ్ళిద్దరూ. ఇళ్ళకి టెలిఫోన్ చేసి సంగతంతా చెప్పారు.

'వారికి కొంచెం కాళ్ళు పట్టాలి. తర్వాత హార్లిక్స్ ఇవ్వాలి' అంటూ లేచింది మాలతి.

'మేం చూస్తాంలే. నువ్వు కొంచెం రెస్ట్

తీసుకో.'

'భలే చుట్టాలేనే! చుట్టాలి కెవరన్నా వస్తే చెప్తారా? వద్దమ్మా! నేనే మాస్తాను' అంది మాలతి. బలవంతాన మాలతిని ఆప డానికి చాలా కష్టమయింది.

'జానకీ! మా బాబుకూడా నీలా ఎర్రగా అందంగా వున్నాడు. వాడిని నీకు యిస్తాను పెంచుకోరాదూ?' అంది మాలతి జానకి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

'అలాగేలే. నువ్వు కాసేపు పడుకో.'

రాత్రి ఎనిమిదయింది.

వాళ్ళిద్దరి మధ్య మాలతి పడుకునివుంది కళ్ళు మూసుకుని.

కొన వూపిరితో కొట్టుకొంటున్న రోగి గుండెలా టేబిల్ మీది కింబిల్ సన్నగా కొట్టుకుంటోంది.

జానకి, లలితలకు కునుకు పట్టింది.

బాబు మంచం మీద తనకేమీ పట్ట నట్టు నిశ్చింతగా నోట్లో వేలు పెట్టుకుని నిద్రపోతున్నాడు.

వాళ్ళకు కొద్ది దూరంలో మాలతి బంధువులు పడుకుని నిద్రపోతున్నారు.

ప్రక్క గదిలో నిశ్శబ్దపు తెరలమాటున మృతదేహం తెల్లవారడంకోసం నిరీక్షి స్తోంది.

అటునుండి యిటు పొర్లిన మాలతికి రేడియం డయల్లో తళుక్కున తొమ్మిదిన్నర కనపడింది. ఒకసారి తన పక్కన వున్న వాళ్ళిద్దర్నీ చూసి నిశ్శబ్దంగా లేచి, తలు పులు నెట్టుకుని భర్తవున్న గదిలోకి వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది.

అప్పుడే కళ్ళు తెరిచిన జానకి 'ఏం కావాలి?' అంది.

'అబ్బె ఏం లేదు. బాత్‌రూంకు వెళ్ళి వస్తాను' అంది మాలతి.

'సరే. తోడు రానా?'

'అక్కర్లేదు' అంటూ మాలతి ఆ గది లోంచి బయటికెళ్ళింది.

ఐదు...పది ... పదిహేను నిమిషాలు... గడిచిపోయాయి. ఏదో గ్లాసు చప్పుడయి నట్టు వినిపించి జానకి వంటింట్లోకి వెళ్ళింది. నేలమీద మాలతి పడివుంది! ప్రక్కన ఖాళీ గార్డినాల్ స్లీపింగ్ పిల్స్ బాటిల్!! ఏం జరిగిందో తెలిసిపోయిన జానకి బిగ్గరగా కేకవేసింది. అందరూ లేచారు. రెండు మూడు సందులు గొందులు

ఆహుతి

తర్వాత వున్న డాక్టర్ని వెతికి పిల్చుకొచ్చే సరికి అరగంట పైనే అయింది.

'పిల్స్ లోపలికి పోయాయి. వెంటనే వుస్మానియా హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి' అన్నాడు ఆ డాక్టర్. టాక్సీలో వుస్మానియా హాస్పిటల్‌కు వెళ్ళేసరికి రాత్రి పదకొం డయింది.

* * *

తెల్లారింది — గురువారం — వుదయం తొమ్మిది.

హాస్పిటల్లో మాలతిబెడ్‌చుట్టూ చాలామంది గుమిగూడివున్నారు. అందులో మాలతి తలిదండ్రులు కూడా వున్నారు. వొంట్లోకి గ్లూకోజ్, ముక్కుల్లోకి ఆక్సీ జన్ ఎక్కిస్తున్నారు. అపస్మారకంగా పడి వుంది మాలతి. అందరి గుండెలు బరువుగా వున్నాయి. అందరి చూపుల్లో ఆందోళన చోటు చేసుకునివుంది.

'సెర్పెక్సా?' అడిగాడు డాక్టర్.

'కాదు గార్డినాల్'

'ఎన్ని మింగింది?'

'చూళ్ళేదు.'

'అసలామెకు ఆ పిల్స్ ఎలా దొరికాయి?'

''ఆ అబ్బాయికి ఈ అమ్మాయే యింజ క్షన్‌లు, మందులు యిచ్చేదండీ! రాత్రులు అతను విపరీతమయిన బాధతో, దగ్గుతో మెలికలు తిరిగిపోతూ వుండేవాడు. అతని బాధచూసి ఈమె ఏడ్చేది. అతను మందులు తీసుకోడు. అందుకని అతనికి తాత్కాలి కంగా బాధపోయి నిద్ర పట్టడానికి స్లీపింగ్ పిల్స్ యిస్తుండేది. వాళ్ళింట్లో చాలా రకా లయిన మందులూ యింజక్షన్లూ వున్నా యండీ. ఆ అమ్మాయికి మందుల సంగతి బాగా తెలుసండీ! ఒక్కోరాత్రి రాత్రంతా అతని మంచందగ్గరే కూర్చునేది. తన కష్టం ఎవరికీ చెప్పుకుని ఏరగదు మహా యిల్లాలు. ఒంటరితనం...బాధ...అలసట... నిద్రపట్టక తను కూడా అప్పుడప్పుడు నిద్ర మాత్రలువేసుకోవడం అలవాటు చేసుకుంది' అని ప్రక్కింటావిడ చెపుతుంటే వాళ్లం దరూ నోళ్ళు తెరిచి విన్నారు. మాలతి యింతకాలం తనకు చెప్పకుండా దాచి పెట్టిన విషయాలన్నీ ఒక్కొక్కటే బయ పడడంవల్ల జానకి దుఃఖం కట్టలు తెంచు కుని బయటపడాలని ప్రయత్నించ సాగింది. మాలతంటే సానుభూతి, జాలి రెట్టిం పయ్యాయి లలిత హృదయంలో.

ఇందువల్లనా మాలతి ఆఫీసులో పర ధ్యాన్నంగా వుండేది?

మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీ ప్లేన్‌లో ప్రకాశం తల్లి, చెల్లెలు వచ్చారు. రెండు గంటలకు మాలతి యింకా అపస్మారకంలో వుండగా ప్రకాశం దహనకాండ జరిగి పోయింది. కళ్ళు తెరిచాక ఈ సంగతి తెలిస్తే మాలతి ఏమనుకుంటుందో?

మైలస్నానాలు ముగించుకుని అందరూ ఆస్పత్రికి వెళ్ళారు.

'స్పృహ ఎప్పుడొస్తుంది డాక్టర్?'

'కనీసం పదిహేను పిల్సయినా తీసుకుని వుండాలి. లేటయి పోవడంవల్ల రక్తంలో కలిసిపోయింది. బి. పి. చాలా వీక్‌గావుంది. చెప్పలేం. మరో ముప్పైగంటలు పట్టొచ్చు' అన్నాడు డాక్టర్. కనీసం మాలతిదక్కితే బాగుండునన్న ఆతృత అందరి అంతరాత్మల్నీ మూగగా దేవుని ప్రార్థింప చేసింది. మాలతి తండ్రిమోహం చూస్తుంటే వాళ్ళగుండెలు అవిసిపోయాయి.

ఆ రాత్రంతా మాలతి యింకా కళ్ళు తెరవలేదు.

డాక్టర్లంతా హడావిడిగా, ఆతృతగా, ఆందోళనగా ఆమె బెడ్ చుట్టూ చేరారు. ప్రతి పావుగంటకి పల్స్, బి.పి. చూస్తూనే వున్నారు.

రిపోర్ట్ షీట్‌లో పేజీలు నిండిపోతున్నాయే తప్ప మాలతి పరిస్థితిలో కొంచెం కూడా మార్పు రాలేదు.

'అలాంటి భర్తతో నేనైతే అసలు కాపరం చేసివుండేదాన్ని కాదు. ఎప్పుడో వదిలి పెట్టేదాన్ని' అంది మారియా లంచ్ రూములో. మారియా గోవనీస్. రిసెప్ష నిస్టుగా చేరి రెండు నెలలైంది.

'మా హిందువుల్లో స్త్రీ జీవితం—మాం గల్యం చుట్టూ తిరుగుతుంది. అది మీకు అర్థం కాదు. ఒకసారి ఒక వ్యక్తితో కలిసి ఏడడుగులు వేసి అగ్నిసాక్షిగా తాళి కట్టించు కొన్న తర్వాత ఆమెకు అతనే సర్వస్వం. అపూర్వమైన భార్యాభర్తల అనుబంధం మీరు వూహించుకోలేరు' అంది జానకి.

జానకి మాటలకి మారియా నవ్వి 'టు హెల్ విత్ యువర్ సెంటిమెంట్స్. ఒకరి

అంది తేలిగ్గా కొట్టేస్తూ.

గురువారం జరిగిపోయి శుక్రవారం వచ్చింది.

ప్రొద్దున బయలుదేరిన చిన్న ముల్లు తన ప్రయాణం ముగించింది ఆ రోజుకు. మాలతి ఇంకా అలానే వుంది. డాక్టర్లలో కనిపిస్తున్న ఆత్రుత చూస్తూంటే వాళ్ళ గుండెల వేగం హెచ్చుచేసినట్లుయింది. నిర్విరామంగా పోరాడసాగారు డాక్టర్లు మృత్యువుతో.

శనివారం — సాయంత్రం — నాలుగైంది.

మొహంలో ఆశ అంతరించసాగింది.

సరిగ్గా నాలుగున్నరకి మాలతిని మృత్యువు తన కౌగిట్లోకి లాక్కుంది.

ప్రకాశం చితి ఆరిపోయి ఇంకా డెబ్బయి రెండు గంటలు కూడా కాకుండా, దాని ప్రక్కన మరో చితి మండుతోంది. భయంకరంగా అగ్ని జ్వాలలు పడగలు విప్పిన పాముల్లా పైపైకి లేచి మాలతిని తమలో కలుపుకొంటున్నాయి.

చెమ్మగిలిన జానకి కళ్ళకు ఆ మంటలు మసక మసగ్గా కనిపిస్తున్నాయి.


పగందచ్చిపోయి చావడానికి సిద్ధంగా ఉన్న ప్రకాశం పెళ్ళిచేసిన అతనితల్లిదండ్రులా?

చదువూ, సంస్కారం వుండీ, తను మహా భయంకరమైన క్షయ వ్యాధితో బాధ పడు తున్నానని తెలిసీ, అంతరాత్మను చంపుకుని మాలతి మెడలో తాళి అనే పేరుతో యమ పాశం కట్టిన ప్రకాశమా?

జానకి గుండెల్లో ప్రశ్నలు కొండచిలువల్లా మెలికలు తిరుగుతున్నాయి.

చివరి ప్రశ్న చిరుగుల్లోనే జవాబు కూడా వుందేమో! ●





సినిమా

అక్కినేని నాగేశ్వరరావు కుమార్తె వివాహం

హీరో నాగేశ్వరరావు కుమార్తె చి॥ సౌ॥ సత్యవతికీ, కారంచేడు వాస్తవ్యులైన శ్రీ నాయుడమ్మగారి కుమారుడు చి॥ సురేంద్రకీ మే 7 వ తేదీ రాత్రి గం॥ 10—19 ని॥ లకి హైదరాబాదులో అత్యంత వైభవంగా వివాహం జరిగింది.

ఈ వివాహానికి రాష్ట్ర రాజకీయ నాయకులు, దక్షిణాది ప్రముఖ నటీనటులు, నిర్మాతలు, పరిశ్రమకి సంబంధించిన ఇతర ప్రముఖులు విచ్చేసి వధూవరులని ఆశీర్వదించారు. వివాహానికి సంబంధించిన పూర్తి వివరాలు, పెళ్ళి ఫోటోలు ఈ వారమే మీకు అందిద్దామనుకున్నాము కానీ కొంత ఆలస్యం కావటంవల్ల వాటిని పైవారం వివరంగా మీకు అందజేస్తాము.

* * *

సమస్యా పరిష్కారానికి సంచలన చిత్రం

వేశ్యగాపుట్టడం తప్పా? ఆమెకు మంగళసూత్రాన్ని ధరించే అదృష్టం లేదా? అందరిలాగా ఆమె స్త్రీకాదా? ఏ స్త్రీకయినా పుణ్యాన్ని, పురుషార్థాన్ని ప్రసాదించేది ఏది? వివాహబంధం; మాంగల్యం. లోకంలో ఒక జాతికి ఒక నీతి, మరొకరికి యింకో నీతి వుండడం ధర్మమా? వేశ్యగా పుట్టినంత మాత్రాన ఆమెలో పవిత్రత వుండదా? ఆమెకు త్యాగంచెయ్యడం చేతకాదా? మగవాడి పిరికితనంవల్ల అలాంటి స్త్రీల జీవితాలు పంసువు మూడనమ్మకానికి బలికావలసిందేనా? ఈ సమస్యను పరిష్కరించాల్సింది ఎవరు? ఇవే ప్రశ్నలు మధుసూదన్ వారి 'కళ్యాణమంటపం' చిత్రంలో ఎదురవుతాయి. ఈ సమస్యాత్మక చిత్రాన్ని దర్శకుడు మధుసూదనరావు హృద్యంగమంగా చిత్రీకరించారు. 'ఇంతవరకు ఆయన డైరెక్టుచేసిన చిత్రాలన్నీ ఒక ఎత్తు 'కళ్యాణమంటపం' మేకింగ్ ఒక ఎత్తు" అని చెప్పడం న్యాయం. చిత్రంలో కనిపించే ప్రతిపాత్రకు కథలో సంబంధం వుండేవిధంగా



[illegible] పోటుపడుతున్న [illegible] 'కళ్యాణ మంటపం' చిత్రంలో ఒక దృశ్యం.

[illegible] [illegible]

నటన్ని, వేశాలను త్మనైన దర్శకుడి కళ్ళనైకళ్ళ అభినందించదగ్గది. ముఖ్యంగా యింతమంది హేమాహేమీలయిన ఆర్టిస్టులచేత, ఆయా పాత్రలకోసం వారు పుట్టారా అనేభావాన్ని కలిగించే విధంగా దర్శకుడు నటింపచేశారు. కొన్ని ఘట్టాలు రాతిగుండెలుకూడా కరిగే విధంగా ఉన్నాయి. ఈ చిత్రం మంలోక సంచలనాన్ని సృష్టించి తీరుతుంది.


క్రొత్త తరహా పాత్రలో కాంచన

గ్లామర్‌గర్ల్‌గా పేరుతెకెక్కిన కాంచన నటు యీ చిత్రంలో చూస్తే, 'ఆమె యీమేనా' అంటారు. అలాగే నాగభూషణం, గుమ్మడి, జగ్గయ్య, శోభన్, రమాప్రభలను క్రొత్త తరహా పాత్రల్లో చూసి విస్తుపోతారు. చక్కటి కథను చక్కగా చిత్రీకరించడానికి మధుసూదనరావుకు తోడుగా వెంకటరత్నం, ఆదినారాయణరావు, సత్యం, బొల్లిముంత అడుగడుగునా కని పిస్తారు. కలర్‌లో నిర్మించబడిన 'కళ్యాణ మంటపం' నవయుగాద్వారా త్వరలో దర్శన మిస్తుంది.

ఎన్.ఏ.టి. చిత్రంలో ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం

ఎన్టీఆర్ యింతవరకు అనేక పాత్రలను ధరించి, మీమంస్సును దోచుకుని యున్నారు. పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక, జానపద చిత్రనాయకుడిగా సవరోపాన్ని చిలికించియున్నారు. ఇప్పుడు రామారావు గారు విభిన్న మనస్తత్వాలు కలిగిన పాత్రలను పోషించడానికి ఆయత్తమౌతున్నారు. తండ్రి, కొడుకు, మనుమడిగా ఎన్టీఆర్ తమ వైవిధ్యమైన నటనను చూపించబోతున్నారు. ఈ చిత్రాన్ని ఎన్. ఏ. టి. సంస్థ నిర్మిస్తుంది.

కన్నడంలో 'కులగౌరవ' పేరిట విజయ యాత్ర సాగిస్తున్న ఈ చిత్రాన్ని పేకేటి డైరెక్టు చేసారు తెలుగు వెర్షన్ని కూడా పేకేటినే చెయ్యమని రామారావు ఆదేశించి, తాము యిచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తెలుగు చిత్రానికి సముద్రాల రచయిత. కవి నారాయణరెడ్డి రెండు పాటలను వ్రాసారు. తెలుగులో మూడు పాత్రలను



సినిమా

ఎన్టీఆర్ ధరించడం ఇదే ప్రథమం. నాయికగా జయంతి నటించవచ్చు.

కలర్ అదనపు ఆకర్షణే

'దసరా బుల్లోడు' కలర్ చిత్రం కలెక్షన్లలో రికార్డును సృష్టించింది గదా! ఇప్పుడు చాలామంది నిర్మాతలు (పెద్ద హీరోతో తీసేవారు) కలర్ చిత్ర నిర్మాణంపై మోజు పడుతున్నారు. మంచి కథ, చక్కటి మాటలు, వీనులవిందైన సంగీతం, ఆర్టిస్టుల నటనావైదుష్యం + కన్నులపండువైన ఛాయాగ్రహణం వుండి, కలర్‌లో నిర్మించబడితే, నిర్మాతలకు అదృష్టం తగలొచ్చు. పై అంశాలన్నీ వున్న చిత్రం బ్లాక్ అండ్ వైట్ అయినా ఒక్కటే; కలర్ అయినా ఒక్కటే కథ లేని కలర్ చిత్రం నిర్మాతలకు ఇచ్చేది నిరాశ నిస్పృహలను మాత్రమే.

పి.ఏ.పి. లో జయలలిత, నాగేశ్వరరావు

'పెంపుడుకొడుకు' దగ్గర్నుండి 'ఆదర్శ కుటుంబం' వరకు పరీక్షిద్దాం. అన్ని చిత్రాల్లోనూ సాంఘిక ప్రయోజనం వుండే కథాంశం వుందని చెప్పొచ్చు. అందుకే ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ పైన ప్రేక్షకులకు ప్రత్యేక అభిమానం. ఆ సంస్థ ద్వారా 'ఎప్పుడు వస్తుంది చిత్రం' అని ప్రజలు ఆతురతగా అడుగుతుంటారు. మంచి కథ దొరికితేనే నిర్మాణానికి పూనుకుంటారు అనుమోలు వెంకటసుబ్బారావు. అందుకే ఆయన తొందరపడి, చెత్త కథలను హడావిడిగా నిర్మించేందుకు ప్రయత్నించరు. 'ఆదర్శ కుటుంబం' విడుదలై దాదాపు రెండు సంవత్సరాలైంది. ఇప్పుడు మంచి స్టోరీ దొరికింది. జూన్‌లో నిర్మాణం ప్రారంభమవుతుంది. పి. ఏ. పి. నిర్మించే ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ రచయిత. వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు; మహదేవన్ సంగీత సారధి ఈ ముగ్గురి కలయిక 'దసరా బుల్లోడు' విజయానికి చాలావరకు తోడ్పడింది. ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ నిర్మించే ఈ చిత్రంలో నాగేశ్వరరావు, జయలలిత, కృష్ణకుమారి, గుమ్మడి ముఖ్య పాత్రలను పోషిస్తారు. కలర్‌లో నిర్మించబడే యీ చిత్రానికి తాతినేని రామారావు నిర్దేశకుడు.



జమునని ... 'శ్రీమంతుడు'గా నాగేశ్వరరావు.

మంచి దర్శకుడు

'సుపుత్రుడు' విడుదలైన తర్వాత తాతినేని రామారావుకు 'గుడ్ డైరెక్టర్' అనే పేరును ప్రేక్షకులు యిచ్చారు. 'రైతు కుటుంబం' తర్వాత, 'వెరీ గుడ్ డైరెక్టర్' కావచ్చు. మొత్తానికి తాతినేనికి మంచి భవిష్యత్తు కనిపిస్తూవుంది. 'సిన్సియారిటీ విల్ పే' అనే వాక్యం తాతినేనిపట్ల నిజమయింది.

దీప్తి ఇంటర్నేషనల్

విశ్వశాంతి విశ్వేశ్వరరావు స్థాపించిన కొత్త సంస్థ యిది. వీరి మొదటి ప్రయత్నంగా ఒక కలర్ సాంఘికాన్ని నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ ముఖ్యనటుడు. జమున నాయిక. జగ్గయ్య, దేవిక, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి ప్రధాన పాత్రలను పోషించే యీ చిత్రానికి మహారథి రచయిత. జి. కె. రాము కెమెరామన్, మహదేవన్ సంగీతాన్ని నిర్వహించే యీ చిత్రానికి సి. ఎస్. రావ్ దర్శకుడు. షూటింగ్ జూన్ నుండి

వుంటుంది.

ఎస్. వి. ఎస్. క్రయిమ్ (కలర్) చిత్రం

'నిండుమనసులు' చిత్రాన్ని నిర్మించిన మిద్దే జగన్నాధరావు ఆ తర్వాత (రెండు) ఫ్యామిలీ సెంటిమెంట్స్ నిండిన చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. ఇప్పుడు నిర్మాత మనస్సు క్రయిమ్ కథపై లగ్నమైంది. మోదుకూరి జాన్సన్ కథ, మాటలను వ్రాస్తున్న యీ కలర్ క్రయిమ్ కు ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు; నాయకుడు రామారావు. సెప్టెంబరునుండి షూటింగు ప్రారంభమవుతుంది.

మారిషస్‌కి జగపతి బృందం

తన కుమార్తె పెండ్లిని శుభప్రదంగా జరిపిన అక్కినేని సతీసమేతంగా మే 17న మారిషస్‌కు బయల్దేరుతున్నారు. వీరి వెంట 'దసరా బుల్లోడు' ఫేం వి. బి. రాజేంద్రప్రసాద్, ఎస్. వెంకటరత్నం, జమునరమణారావు, వి. మధుసూదనరావు, కాంచన, రామానాయుడు, ఎస్. కృష్ణారావు వెడుతున్నారు. వెళ్లేప్పుడు, జగపతి నిర్మించిన ఆరు చిత్రాల ప్రింట్లను వెంటపెట్టుకుని వెడుతున్నారు. మారిషస్‌లో ఆంధ్రులు చాలామంది వున్నారు.

* * *


జగపతి వి. బి. రాజేంద్రప్రసాద్ తన తర్వాతి చిత్రాన్ని బహుశా విదేశాల్లో (మంచి లొకేట్స్ దొరికితే) తీసే యత్నాల్లో ఉన్నారు. అలా నిర్మిస్తే విదేశాల్లో తెలుగు చిత్రాన్ని నిర్మించిన ఘనత జగపతి అధినేతకే చెందుతుంది.

పుల్లయ్య షష్టిపూర్తి సన్నాహాలు

అనుభవజ్ఞుడు, ప్రముఖ దర్శకుడు పి. పుల్లయ్యకు అరవై సంవత్సరాలు నిండుతున్నాయి. ఈ సందర్భంగా జైహింద్ సత్యం ఆయనకు షష్టిపూర్తి ఉత్సవాన్ని జూన్‌లో ఘనంగా చెయ్యడానికి పూనుకున్నారు. జైహింద్ సత్యం చెయ్యనున్న ఈ మంచి పనిని అందరూ హర్షించగలరని ఆశించవచ్చు.



శ్రీ కొంగర జగ్గయ్యగారి ప్రథమపుత్రిక చి. సౌ. సంధ్యారాణి, డాక్టర్ అచ్యుత రామయ్యల వివాహ సందర్భంగా తీసిన చిత్రం.



సినిమా

యాచనకొచ్చిన త్రిమూర్తులు

'భవతీ భిక్షాందేహి' అంటూ ముగ్గురు సాధువులువచ్చి ఒక ఆశ్రమం ముందు ఆగారు. లోపలనుండి ఒక స్వాధ్విలలామ వచ్చింది. 'అతిథి దేవతలారా, దయచేయండి' అంటూ విందుకు ఆహ్వానించింది. ఆమె ఎవరోతెలుసా? సతీఅనసూయే. ఆ ముగ్గురు సాధువులు సాక్షాత్తు బ్రహ్మవిష్ణు మహేశ్వరులే. 'నీవు వివస్త్రవై మాకు వడ్డించాలి. అది మా నియమం' అన్నారు ఏక కంఠంతో. ఇదేమికోరిక. స్త్రీకి మాన సంరక్షణ కంటె వేరే ధర్మం లేదు గదా, మీకు ఈకోరిక తగునా, అని వేడుకుంది ఆమె. 'చేసిన బాస చెల్లించలేకపోతే చెప్పు. మేం వెళ్లిపోతాం' అంటూ లేనబోయారు. అనసూయ కాస్సేపు ఆలోచించి ఆ పరమాత్మునకే తనమొర వినిపించింది. మరుక్షణమే త్రిమూర్తులు పసిపాపలయ్యారు. వారిని తన ఒడిలోనికి తీసుకుని ఆప్యాయంగా ఆహారాన్ని తినిపించింది. ఇదంతా పైనుంచి తిలకించిన నారదుడు 'ధన్యురాలవు అనసూయా' అంటూ పతివ్రతను అభినందించాడు. అందంగా హృద్యంగమంగా చిత్రీకరించబడిన ఈ సన్నివేశం శ్రీ కాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రైసెస్‌వారి సతీ అనసూయ లోనిది. సతీఅనసూయగా జమున నటించిన ఈచిత్రాన్ని శ్రీకాంత్ నహతా, శ్రీకాంత్ పటేల్ నిర్మించారు. ఈచిత్రాన్ని సర్వజన రంజకంగా బి. ఏ. సుబ్బారావు తయారుచేసారు. మధుభాయ్‌పటేల్ ఎగ్జిక్యుటివ్ నిర్మాత; రామదుర్గై నిర్మాణ నిర్వాహకుడు.

రామారావు దేవికల శృంగారం

ప్రణయం అనేది ఎంతో మధురమయినది. అందునా యువతీయువకుల శృంగారం చూడ ముచ్చటగా, ఆత్మీయతకే అందమైన ప్రతిబింబంగా ఉంటుంది. శ్రీనివాసరావు, లలిత ఒక ముచ్చటయిన జంట. వయస్సులోని మాధుర్యాన్ని, అనుభవంలోని మమతను మిళితంగా చేసుకొంటూ ఒక్క చందమామ తప్ప మరెవ్వరు చూడనంత ఒంటరిగా ఆడుకుంటూ పాడుకుంటూ వుంటారు ఆలుమగలు. 'శృతిమించె శ్రీవారి మనసు, గడుసైన వయసు' అంటూ లలిత చేసిన అందమైన ఆక్షేపణకు జవాబుగా 'నీ వోర చూపుల దొందరలు నీ దోర నవ్వుల దొంతరలు' అంటూ శ్రీనివాసరావు జవాబిస్తాడు. కవి నారాయణరెడ్డి వ్రాసిన యీ పాటను సుశీల ఘంటసాల పాడగా దేవిక, రామారావులపై దర్శకుడు విశ్వనాథ్ చిత్రీకరించారు. డి. వి. ఎస్. రాజు భారీ ఎత్తున నిర్మిస్తున్న యీ సాంఘికంలోని ప్రధాన పాత్రలను శోభన్, జగ్గయ్య, రాజనాల, రాజబాబు, అల్లురామలింగయ్య, శాంతకుమారి, రమాప్రభ, పుష్పకుమారి పోషిస్తున్నారు. విడుదల—విజయ.

సినిమా డైరీ

- రామవిజేతావారి రామాలయం షూటింగు ఏప్రిల్ 30 వేకువజామున (గం 3—20ని.లకు విజయా స్టుడియోలో ప్రారంభించబడింది. సీతారాములు విగ్రహంపై దర్శకుడు బాబూరావు మొదటి షాటును తీసారు.
- దీప్తి ఇంటర్నేషనల్‌వారి కలర్ చిత్రం యొక్క షూటింగు ఏప్రిల్ 30 న (వేకువ జామున గం 3—20 ని. లకు) విజయా స్టుడియోలో ప్రారంభించబడింది. శ్రీరాముని విగ్రహంపై దర్శకుడు సి. ఎస్. రావ్ మొదటిషాటును తీసారు.
- ఎన్. ఏ. టి. నిర్మించనున్న తెలుగు చిత్రానికి పేకేటి దర్శకుడు. ఈ చిత్రం యొక్క ప్రారంభపూజ మే 1 న జరిగింది.
- ఫల్గుణావారి జగత్ జంత్రీలు షూటింగు మే 5 న శారదాలో ప్రారంభమైంది. లక్ష్మీదీపక్ దర్శకుడు. వాణిశ్రీ, శోభన్ పాల్గొన్నారు.
- మధు మూవీస్‌వారి కళ్యాణ మంటపం చిత్రానికి యు సర్టిఫికేటు యివ్వబడింది. వి. మధుసూదనరావు దర్శకుడు.


కులగౌరవ

రాజా రఘునాథ్ పేరుమోసిన శ్రీమంతుడు. ఆయన ఏ పనిచేసినా—తన అంతస్తును, గొప్పదనాన్ని, గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తుంటాడు. ఆయనకు ఒక్కడే కొడుకు. పేరు రవి. సంగీత, కళా ప్రియుడు. కొడుకు రవి అంటే రాజాగారికి పంచప్రాణాలు.

అనుకోని పరిస్థితుల్లో రవికి కళాదేవి అనే అందాల నర్తకితో పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయం కాస్తా ప్రణయంగా మారి, పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వస్తాడు. తండ్రిముందు తన కోరికను వెల్లడిచేస్తాడు. ఆయన ససేమిరా అంగీకరించలేదు. తండ్రినీ ఆయన సిరిసంపదల్నీ అన్నిటినీ వదిలిపెట్టేసి కళాదేవిని వివాహం చేసుకుంటాడు. నర్తకిగా భార్యను కళకు సేవచెయ్యమంటాడు రవి. నర్తకిగా ఆమె అశేష పేరు ప్రఖ్యాతులను గడిస్తుంది.

విధిలీలలు ఎంతో చిత్రమైనవి. ఆ ఆదర్శదంపతుల మధ్య చేరలేనిదూరం ఎదురయింది. అప్పటికే వారికి ఒక మగబిడ్డ కలిగాడు. ఆ బిడ్డను తీసుకుని రవి దూర

శ్రీ పింగళి నాగేంద్రరావు మరణం



ప్రముఖ సినీ రచయిత, కవి, పండితులు అయిన శ్రీ పింగళి నాగేంద్రరావుగారు మే 6 వ తేదీ రాత్రి మదరాసులోని తమ నివాస గృహంలో మరణించారు. చనిపోయే నాటికి 70 సంవత్సరాలుగల శ్రీ పింగళి నాగేంద్రరావుగారు గత కొద్ది నెలలుగా అస్వస్థులుగా ఉన్నారు. ఆయన మరణ వార్త విన్నవెంటనే చలన చిత్ర రంగంలోని ప్రముఖులు అనేకులు, మిత్రులు, ఆప్తులు వారి గృహానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు.

శ్రీ నాగేంద్రరావు కొంతకాలం రైల్వే ఉద్యోగిగా ఉండి ఆ తర్వాత నాటకరంగంపై దృష్టిని మరల్చారు. ప్రముఖ రంగస్థలనటుడు కీ. శే. డి. వి. సుబ్బారావుగారి ఆంధ్ర డ్రమెటిక్ కంపెనీలో సన్నిహిత సంబంధం ఉన్నకాలంలో శ్రీ నాగేంద్రరావుగారు వింధ్యరాణి, నా రాజు నాటకాలని రచించారు. ఒకే కుటుంబం, క్షాత్ర హిందు మొదలైన నాటకాలని రాశారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యకలాపాలలో ప్రముఖ పాత్రని నిర్వహించారు. శారద పత్రిక సంపాదకశాఖలో పనిచేశారు. ఆయన సాహితీ రచనలలో ముఖ్యంగా పేర్కొనదగినది జేబున్నీసా నాటకం.

1942లో భలేపెళ్లి—అన్న చిత్రానికి మాటలు రాశారు. తర్వాత వింధ్యరాణి చలన చిత్రంగా వచ్చింది. ఆ తర్వాత విజయావారు నిర్మించిన పాతాళభైరవిలో శ్రీ పింగళి జానపద చిత్ర సాహిత్యంలో కొత్త బాటని రూపొందించారు. ఆ చిత్రం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఎన్నికైన ఒకే ఒక దక్షిణ భారత చిత్రం. శ్రీ నాగేంద్రరావు దాదాపు 30 చిత్రాలకి మాటలు, పాటలు, కథలు రాశారు. ఇంకో నాలుగు చిత్రాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి.

శంకరుకు పెళ్లి చేస్తాడు కొడుకు శంకర్‌ని పెద్దజేసి డాక్టర్ చేస్తాడు రవి. విడిపోయిన తల్లిదండ్రుల్ని డాక్టర్ శంకర్ ఎలా కలిపాడన్నది ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది.

రాజా రఘునాథ్‌గా, రవిగా, ' డాక్టర్ శంకర్‌గా రాజకుమార్ మూడుపాత్రల్ని పోషించారు. కళాదేవిగా జయంతి, శంకర్ ప్రేమించిన రాధగా భారతి నటించారు.

ప్రసిద్ధ తెలుగు హాస్యనటుడు, దర్శకుడు అయిన శ్రీ పేకేటి శివరామ్ దర్శకత్వంలో తయారయిన ఈ కన్నడ చిత్రం ఇప్పుడు మైసూరు రాష్ట్రంలో విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నది.

—మోహన్ కుమార్ ●

అవీ...ఇవీ!

శ్రీ గాడ్గిల్ అస్తమయం

ప్రఖ్యాత ఆర్థికవేత్త, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు శ్రీ డి. ఆర్. గాడ్గిల్ మే 3వ తేదీ ఉదయం ఢిల్లీ నుంచి పూనా మీదుగా బొంబాయి వెళ్తున్న ఫ్రాంటియర్ మెయిల్‌లో ప్రయాణం చేస్తూ మరణించారు.

* * *

విదిశా పట్టణములోని ప్రవాసాంధ్రులు విశాలాంధ్ర విజ్ఞాన సమితి అన్న పేరుతో ఒక సాంస్కృతిక సంఘమును ఈ మధ్యనే స్థాపించి, ఉగాది రోజున (27—3—71) ప్రారంభోత్సవము అతి సాంప్రదాయక పూర్వకంగా జరిపించారు. (ఒ. వి.) ●

ప్రేమా పెసరట్లూ

(17 వ పేజీ తరువాయి)

'నేను నిన్ను ప్రేమించడం లేదనంతే' అంది అనూరాధ.

'నేను—నిన్ను పెళ్లి చేసుకుంటాను—' అన్నాడనంత్—బాధగా.

'నేను నిన్ను పెళ్లి చేసుకోను—' అంది అనూరాధ అవలీలగా.

'ఎందుకని నన్ను ప్రేమించవు? ఎందుకని నన్ను పెళ్లి చేసుకోవు?' ఆటంలో అబ్బాయిలా రెట్టించాడనంత్.

'ఎందుకని నిన్ను ప్రేమించాలి?...'

'స్టాప్. ఆ పార్ట్‌కి సమాధానం చెప్పాలి—నేనందంగా ఉంటాను—'

'మగవాడికి అందం అనవసరం. అదేమీ క్వాలిఫికేషన్ కాదు.'

'నేను మంచివాణ్ని ... నన్ను అపర్ణ కూడా ప్రేమించింది.'

'అయితే అపర్ణనే పెళ్లి చేసుకో.'

'అపర్ణ బెంగాలీ.'

'మతాంతర వివాహం చేసుకో...మతాంతరమో లేక...అదేదో అంతరమో...'

'నిజం చెప్పు అనూరాధా ... సీరియస్‌గా అడుగుతున్నాను. నన్ను పెళ్లి చేసుకోవూ?'

'సీరియస్‌గా నిజం చెప్తున్నాను. నిన్ను పెళ్లి చేసుకోను.'

'కారణం?' అనంత్ గొంతులోకి దుఃఖం వచ్చేసింది.

'నాకు ప్రేమా పెళ్లీ కంటె చదువు ముఖ్యం. వీటికిప్పుడే తొందరలేదు. అదీకాక—అందమైన మగవాళ్లంటే నా కసహ్యం.'

'కాదు — జెలసీ.' అన్నాడు కసిగా అనంత్.

'ఏదో ఒకటి అనుకో. ఇక నాకు పనుంది. ఇంటికిపోయి అల్లం జీలకర్ర పెసరట్లు తిని హాయిగా చదువుకోవాలి. ప్రేమ కబుర్ల కంటె పెసరట్లు ఎంతో రుచిగా వుంటాయి. గుడ్ బై.' అనేసి వెళ్ళిపోయింది.

ఆంధ్రా యూనివర్సిటీలో - అనూరాధకి —అనంత్ అందం కంటె—అల్లం జీలకర్ర పెసరట్లే ఎంతో యిష్టమన్న అతి చేదు నిజం— అతి తక్కువ మందికి మాత్రమే తెలుసు — (అనంతకీ, అనూరాధకీ, నాకూ.) ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press; 6 & 7 Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.